జ్ఞాన యోగం

# ఆత్మబోధ



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని స్క్రిబ్డ్ వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. దీనిద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంథాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) స్క్రిబ్డ్ వారి వెబ్ సైట్: https://www.scribd.com
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో స్క్రిబ్డ్ వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

స్క్రిబ్డ్ వారి వెబ్ సైట్:

**http://www.scribd.com**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటీ కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# శఙ్కరాద్వైతమ్

10

## ఆత్మబోధః



శ్రీకృష్ణానంద మఠము
దిల్‌సుఖ్‌నగరము, హైదరాబాదు-500 036

శఙ్కరాద్వైతమ్ - 10

# ఆత్మబోధః




ఓం

కృష్ణానంద ముకుంద మురారే! వామన మాధవ గోవింద!
శ్రీధర కేశవ రాఘవ విష్ణో! శ్రీనారాయణ చిద్రూప!


## శ్రీకృష్ణానంద మఠము

1359, మూసారాంబాగ్ వీధి నెం. 10,
దిల్‌సుఖ్‌నగరము, హైదరాబాద్ - 500 036
☎ ఫోన్ 040 - 24046581 ☎


సర్వస్వామ్యసంకలితము
వెల రూ. 20/-

ప్రథమ ముద్రణ శ్రీగీతాజయంతి 2003 1000 ప్రతులు

# ముందుమాట

శంకరాద్వైతం అవగాహన చేసికొనుటకు ఈ గ్రంథం **ఆత్మబోధః** ఒకానొక గొప్ప అమృతభాండం. అనుభూతితో ఆనందించేవలసినది. సామాన్యంగా చదివి విడిచేయదగినది కాదు. సాధకునికి సూక్ష్మాతి సూక్ష్మమైన అధ్యాత్మవిద్యను ఆత్మబోధను అందించేటానికి సృష్టి అంతా ఉపమానముల నిర్మాణం. చెప్పగలిగితేను అర్థంచేసికొనగలిగితేను సృష్టిలో అనంతమైన ఉపమానాత్మకమైన బోధ ఇమిడి ఉన్నది. ఈ గ్రంథంలో అటువంటి ఉపమానములు చాల విచారణచేయబడినవి. చాలా అయినప్పటికి స్థాలీపులాక న్యాయమే. ఎవరో ఏ గ్రంథమో చెప్పుట కాదు. బోధతీరును గ్రహించి సొంతతెలివితో సృష్టిని భోగానికికాక, బోధతీరులో యోగానికి వాడుకొని తరించాలి.

ఓం తత్ సత్

# ఆత్మబోధః

**తపోభిః క్షీణపాపానామ్, శాన్తానాం వీతరాగిణామ్,**
**ముముక్షూణామపేక్ష్యోఽయమ్, ఆత్మబోధో విధీయతే.**

తపోభిః - (క్షీణ-పాపానామ్) - శాన్తానామ్ - (వీత-రాగిణామ్) - ముముక్షూణామ్ - అపేక్ష్య - అయమ్ - (ఆత్మ-బోధః) - విధీయతే.

**తపోభిః ॥ క్షీణపాపానామ్, శాన్తానాం ॥ వీతరాగిణామ్,**
**ముముక్షూణామ్ అపేక్ష్యో । ఽయమ్, ఆత్మబోధో । విధీయతే. 1**

తపోభిః - క్షీణపాపానామ్ – శాన్తానామ్ – వీతరాగిణామ్ – ముముక్షూణామ్ - అపేక్ష్య - - అయమ్ - ఆత్మబోధః - విధీయతే.

(తపోభిః) తపస్సులచేత (క్షీణపాపానామ్) పాపములను నశింపజేసికొన్న వారికి (శాన్తానామ్) శాంతస్వరూపులకు (వీతరాగిణామ్) రాగములను.. బంధములను త్రెంచుకొన్నవారికి (ముముక్షూణామ్) మోక్షమును కోరినవారికి (అపేక్ష్య) కోరి, ఉద్దేశించి (అయమ్) ఈ (ఆత్మబోధః) ఆత్మబోధ (విధీయతే) విధింపబడుచున్నది. 1

**ఆత్మనః బోధః అవగాహనమ్ ఆత్మబోధః**. ఆత్మ యొక్క అవగాహన, అనగా స్వరూపముయొక్క అవగాహన ఆత్మబోధ. తపస్సులచేత పాపములను నశింప

చేసికొన్నవారికి, శాంతస్వరూపులకు, రాగములను =కోరికలను=బంధములను త్రెంచుకొన్నవారికి, మోక్షమునుకోరిన ముముక్షువులకు, అందఱికి ఈ ఆత్మబోధ= స్వరూపముయొక్క అవగాహన = ఆత్మజ్ఞానం విధింపబడినది. అంతటి గొప్పదానిని విశదంగా తెలియవలసినదే. ఎంతో అనుభవంతో చెప్పఁబడిన ఈ శ్లోకతాత్పర్యాన్ని .. అనుభవములను పోల్చుకొంటూ అర్థంచేసికొందాం.

**ఆ స్మృతౌ తనుతే విస్తరేణ మన్యతే జ్ఞాయతే ఇతి ఆత్మన్**. తను-విస్తారే. మన-జ్ఞానే. స్మృతియందు, విషయాత్మకమన్నంత కుత్సితంగా కాక, తనను తాను విశాలంగా ఎఱుఁగుట ఆత్మ.

**1. తపోభిః క్షీణపాపానామ్.** విశాలంగా స్వరూపమును ఎఱుఁగుట అన్న ఆత్మకు పాపము అన్న అంశం సుదూరం, విషయాత్మకం అన్నంత దూరం. ఎందుకంటే, పాపపుణ్యములు విషయములలోని ప్రవర్తనలో విషయములతో పోల్చిన భేదమే, విషయగ్రాహ్యంలోని భేదమే, స్వరూపావగాహనలో ఈ భేదం లేదు. పాపమన్నది స్వరూపభేదం అవుతున్నది. శుద్ధమైన ఆత్మ ఎఱుక స్వరూపమై ఉండగా, పాపపుణ్యములను గ్రహించి స్వరూపమన్నట్లు ప్రవర్తిస్తుంటుంది జీవలోకం. అందువలన, పాపపుణ్యములు స్వరూపభేదములు. ఇవి నశించేవలె. ఇందుకు తపస్సు విధింపఁబడింది. తపస్సనగానే హిమాలయములు తొందరగా తలపుకు వస్తయ్. హిమాలయములు, అరణ్యములు మొదలైనవి దేహమునకు స్థానములే. తపస్సు చిత్తానికి చిత్తంలో చిత్తంతో.

> **బ్రహ్మసత్యం జగన్మిథ్యేతి అపరోక్షజ్ఞానాగ్నినా బ్రహ్మాది ఐశ్వర్య-ఆశాసిద్ధసఙ్కల్పబీజసన్తాపరూపం తపః.** (నిరాలమ్బ ఉ.)

బ్రహ్మమే సత్యం, జగత్తు మిథ్య (లేనిదే ఉన్నదానివలె తోచేది) అన్న అనుభవజ్ఞానంచేత బ్రహ్మాది ఐశ్వర్యములలో ఏదైనా పొందుటకు ఆశవలన కలిగిన సంకల్పబీజాన్ని ఎండగొట్టుట తపస్సు. ఐశ్వర్యములు విషయాత్మకములు, సంకల్పబీజం ఆధ్యాత్మికావగాహనలోని దోషం. ఎక్కడెక్కడ ఎప్పుడెప్పుడు చిత్తం సంకల్పం చేస్తుందో అక్కడక్కడ అప్పుడప్పుడు దానిని ఎండగొట్టే తపస్సు జెరుగవలె. ఫలితంగా స్వరూపావగాహన విశాలం కావాలి. ఈ విధంగా, తపస్సన్నది స్వరూపంలోని భేదాన్ని ప్రవర్తనలో నిత్యం నశింపచేసికొంటూ జీవించుట. కొంగజపంలాగా, ఎక్కడో ఒకమూల బుద్ధిమంతులమని తలంచి చేసిన తపస్సు ఆత్మబోధను=ఆత్మజ్ఞానాన్ని కలిగించేదు కనుక, ఆత్మబోధను సాధించుటకే తపస్సు.

**2. శాన్తానామ్. శామ్యతే స్మ శాన్తః.** శము-ఉపశమే. రెచ్చిపోకుండగా శమించుట= స్వరూపంలో అణగియుండుట శాంతం. శాంతం అంటే బాహ్య చిహ్నములకు పరిమితం కాదు. అంతరాంతరములలో చలించని అనుభూతి

శాంతం. లోకంలో జీవులకు..లోకులకు అనేక ఉపాయములు ఉంటుంటయ్. ఇతరములైన ఉపాయములలో ఊపిరిపీలుస్తుంటారు. ఎన్నో జన్మలు గడుస్తుంటయ్. అసలుసాధనకు దూరంగా బ్రతుకుతుంటారు. విషయప్రవర్తనలో శుద్ధమైన ఆత్మజ్ఞానంతో = ఆత్మావగాహనతో = స్వరూపావగాహనతో విషయమునకు విలక్షణంగా నిలుపగలిగిన తన ఎఱుకయే తనకు శాంతస్వరూపం. విషయం విషయాత్మకంగా ఫలించుట విషయప్రవర్తనకు శాంతిగా అనిపిస్తుంది. ఇది తాత్కాలికం. కొందఱు పుట్టుకతోనే జన్మసంస్కారంచేత శాంతంగా ఉన్నట్లు కనపడుతారు. కాని, ఏదో ఒక విషయంలో పెకలివేయబడుతారు, బయటకు వ్యక్తంకాకున్నా లోలోపల బాధపడుతుంటారు. సాధనలో శాస్త్రజ్ఞానంచేత ఆత్మానాత్మవివేకం కలిగినవారుకూడా జీవితప్రవర్తనలో అట్టి వివేకాన్ని నిలుపుకొనుటకు కష్టపడుతారు. వారి జ్ఞానం ఇంకా తమకు అక్కఱకు రాలేదు. **వేదాంతం మొదట్లో విషయగ్రాహ్యంగానే సాగుతుంది. వేదాంతం ఆధ్యాత్మికం అన్న అనుభవం కలుగటానికి చాల వేదాంతవిచారణ కావాలి.** ఎక్కడో తన స్వరూపాన్ని ఏ కొద్దిపాటి తరుణమో గుర్తించి అటువంటి స్వరూపజ్ఞానంతో = ఆత్మజ్ఞానంతో = ఆత్మావగాహనతో తన స్వరూపాన్ని నిలుపుకొంటూ విషయవిస్మృతిని అనుభవించుట తనకు గమనం అయినప్పుడే శాంతి. ఈ విధంగా, శాంతికి ఆత్మజ్ఞానం=ఆత్మబోధ విధింపబడింది.

**3. వీతరాగిణామ్.** సుసంస్కారంచే విషయతృష్ణ లేనివారికికూడా జీవితంలో సమస్యలుంటుంటయ్. సమాజంలో అందఱితో కలిసిమెలిసి ఉండలేకపోవుట. ఇది కొందఱికి సమస్యగా ఉంటుంది. అందఱు విషయదృష్టిలో బ్రతుకుట కొందఱికి సమస్యయే. వారెందుకు అట్లుంటారని బాధపడుతుంటారు. అందఱు ఆధ్యాత్మిక జ్ఞానంతో జీవిస్తే సంఘంలో సమస్యలుండవని, జేరుగలేనిది జేరుగవలెనని ..జేరుగలేదని, వ్యథపడుతుంటారు. రాగములు=కోరికలు=బంధములు త్రెంచుకొనుటకూడ విషయాత్మకంగానే భావిస్తుంటారు. విషయానందమును పొందలేని సంస్కారం తనకెందుకున్నదో తెలియలేని ఆధ్యాత్మికబలహీనతకూడ కొందఱి సమస్య. కోరిక తనకు స్వరూపం కాదని, అది తనకు ద్వైతమని = మారురూపమని, స్వరూపజ్ఞానం నిత్యం నిలిచి అన్యములను=ద్వైతములను తరిమివేస్తుండుట స్వతస్సిద్ధమని, విషయతృష్ణ లేకుండుట ఈ విధంగా స్వరూపసిద్ధి అని గుర్తించవలె. అంతవఱకు తనకు తన స్థితిగతులు తెలియనివే. అందుకే, ఆత్మబోధ=ఆత్మావగాహన వీరికికూడా విధింపబడింది.

**4. ముముక్షూణామ్. మోక్షేచ్ఛా అస్య అస్తీతి ముముక్షుః.** మోక్షేచ్ఛ= విడుదలయందు కోరిక కలవాడు ముముక్షువు. దేనినుండి విడుదల అన్న ప్రశ్న ముముక్షువునకు అర్థంలేనిది. మోక్షము=విడుదల అన్నది జన్మపరంపరగా ప్రవాహరూపంగ వస్తున్నది. ఉన్నజన్మనుండి ఉన్నత జన్మకు పోతూ వచ్చాడు.

తాను జీవుడు కాదనీ, అంతకు ఉత్తమస్వరూపమనీ గుర్తించేకున్నా ప్రవర్తిస్తున్న ఇంగితజ్ఞానం. అనేకమానుషజన్మల అనంతరం ఈ జ్ఞానాన్ని ఆత్మజ్ఞానంగా సిద్ధింపచేసికొంటాడు. ఇది సృష్టి ప్రసాదించిన ప్రవాహం. అన్యములన్ని తనకు ద్వైతంగా=మారురూపంగా చెలరేగుతున్నవే. కనుక, విడుదల అన్నిటినుండి, ఇది-అది అన్న భేదం లేదు. ఏదేది ఉన్నదన్నాడో అట్లు అన్నవన్నీ లేనివి అని గుర్తించేవఱకు ముక్తికాంక్ష తరుముకొస్తుంటుంది. ఈ సత్యం చాలమంది ముముక్షువులకు తెలియదు. సాధనలోని తమ పోకడలకు పొంగిపోయి, అంతటితో సాధనగమ్యం చేరుకొన్నామన్నట్లు ప్రవర్తించి, సాధనకు అడ్డంకులు వేసికొంటారు.

**సిన్ధుః సరిద్వల్లభం యథా ప్రాప్నోతి.** నదినీరు సముద్రంవైపు పరుగిడుతూ, తనకు అడ్డువచ్చిన ఱాళ్ళను కొట్టుకొంటూ దాటికాని దూకికాని, తన ప్రవాహానికి అడ్డువచ్చినందుకు సహించేక, సముద్రమును చేరే ఉత్సాహంతో ఉఱికినట్లు, సాధకుడు గుర్తించి ఆత్మావగాహనతో = ఆత్మబోధతో తన విశాలస్వరూపమైన ఆత్మభావమునకు ఉఱకవలె.

ఈవిధంగా, ఆత్మబోధలేక ఎటువంటి సాధకులు సాధనలో ముందంజ వేయలేరు కనుక, సాధకులందఱికి ఆత్మబోధ విధింపబడినది. 1

**బోధోఽన్యసాధనేభ్యో హి, సాక్షాన్మోక్షైకసాధనమ్,**
**పాకస్య వహ్నివత్ జ్ఞానమ్, వినా మోక్షో న సిద్ధ్యతి.**

బోధః - (అన్య-సాధనేభ్యః) - హి - సాక్షాత్ - (మోక్ష-ఏక-సాధనమ్) - పాకస్య - వహ్నివత్ - జ్ఞానమ్ - వినా - మోక్షః - న - సిద్ధ్యతి.

**బోధో । ఽన్యసాధనేభ్యో హి, సాక్షాన్ ॥ మోక్షైకసాధనమ్,**
**పాకస్య ॥ వహ్నివత్, జ్ఞానం వినా ॥ మోక్షో న సిద్ధ్యతి. 2**

అన్యసాధనేభ్యః - బోధః హి - సాక్షాత్ - మోక్షైకసాధనమ్ - - పాకస్య - వహ్నివత్ - - జ్ఞానం వినా - మోక్షః - న సిద్ధ్యతి.

(అన్యసాధనేభ్యః) ఇతరసాధనములకంటె (బోధః హి) ఆత్మబోధయే (సాక్షాత్) ప్రత్యక్షమైన (మోక్షైకసాధనమ్) మోక్షమునకు ఏకమైన సాధనం (పాకస్య) వంటకు (వహ్నివత్) అగ్నివలె (జ్ఞానం వినా) ఆత్మజ్ఞానం లేక (మోక్షః) మోక్షము (న సిద్ధ్యతి) సిద్ధించుట లేదు. 2

ఆత్మబోధయొక్క ప్రాముఖ్యత ఉపమానంతో చెప్పబడుతున్నది.

**పాకస్య వహ్నివత్.** వంటకు పదార్థములు, పాత్రలు అన్ని సిద్ధమైనా అగ్ని లేనిది వంట కాదు. వంటకాకుంటే ఆహారం లేదు. తినటానికి పనికిరానివే

పదార్థములు, పాత్రలు.

**అధీత్య చతురోవేదాన్ ధర్మశాస్త్రాణి మానవః,**
**యో వై బ్రహ్మ న జానాతి దర్వీపాకరసం యథా.** (ఉ.గీ.)

వేదములు, వేదాంగములు, ధర్మశాస్త్రములు, ఉపనిషదాది వేదాంతములు సిద్ధమే. శ్రవణ-మనన-నిదిధ్యాస తపస్సులు పట్టుపడినయ్. సాధనచతుష్టయ సంపదయొక్క సాధన అబ్బింది. యుక్తమైన ఆహారవిహారనిద్రాదులచేత పాత్ర=శరీరం వశమైంది. ప్రవచనంచేత ప్రజలను ప్రమోదింపచేయుట ప్రస్తుతమైంది. ఇవన్నీ సాధకునికి ద్వైతపు పక్షమే. వీటిని ఆధ్యాత్మికంగా పచనం చేయవలె. ఉదాహరణతో అర్థంచేసికొందాం.

స్పష్టంగా చేదివిన విద్యార్థి, పరీక్షలో ఇచ్చిన ప్రశ్నకు సమాధానం వ్రాసేటప్పుడు తన పేరు, శరీరం తనదృష్టికి రాదు. పరిసరములు పలికించేవు, పలుకవు, కనబడవు. చేదువుకొనేటప్పుడు తను పడిన శ్రమసంతోషములు స్ఫురించేవు. పరీక్ష వ్రాస్తున్న ధ్యాసఉండదు. తనకు వంటపట్టిన దానిని వ్యక్తం చేసికొంటూ వ్రాసుకుపోతుంటాడు. ఈ సౌభాగ్యానికే సంవత్సరమంతా శ్రమ పడ్డాడు. ఉదాహరణ విషయాత్మకం, కొంతవఱకే అందిస్తుంది.

ఇన్ని జన్మల ఫలితంగా సాధించిన వేదవేదాంగాదులన్నీ తన ఆత్మ బోధకు = స్వరూపావగాహనకు అందివచ్చి, వాటిని దృష్టిలోకి రానీయక, అవి బోధించే స్వరూపమును వెలిగించుకొంటూ దర్శించుకొంటూ నిలువగలిగిన తరుణంలో వాటినన్నిటిని పాకంచేసికొని ఆహారంగా గ్రహించేగలుగుతాడు. ఆ తరుణంలోనే వాటిలోని బోధల విలువ తెలియవస్తుంది, రుచిగా ఉంటుంది. అంతవఱకు అవి చేట్టుచేరిన పదార్థములే..పాత్రలే. ఆహారం తింటే ఆకలినుండి విడుదల. ఆకలి ఒకప్పుడు తనరూపమే, ఆహారం తినినదికూడ తనరూపమే. కడుపునిండిన తరువాత ఆకలిబాధ, పదార్థముల రుచి అంతా గడచిపోయిన గాథ. ఆత్మబోధ=స్వరూపావగాహనపరంగా తన పూర్వపు సాధననంతా మఱల దర్శించేనంతవఱకు వాటిని భారంగా మోసిన తీరే. అహంకారాది అపచారములు అజ్ఞానినిగానే చేసి కబళిస్తుంటయ్. ద్వైతపు దయ్యం విడిపోదు. ద్వైతం తొలగిన అద్వైతమే మోక్షం=విడుదల=జన్మరాహిత్యం. జన్మలన్నీ అద్వైతపు అలలే, స్వరూపమునకు మారురూపములే. ద్వైతబుద్ధి ఉన్నంతవఱకు, ఆత్మబోధ కలుగనంతవఱకు స్వరూపసిద్ధి=మోక్షసిద్ధి లేదు. 2

**అవిరోధితయా కర్మ, నావిద్యాం వినివర్తయేత్,**
**విద్యాఽవిద్యాం నిహన్త్యేవ, తేజస్తిమిరసఙ్ఘవత్.**

అవిరోధితయా - కర్మ - న - అవిద్యామ్ - వినివర్తయేత్ - విద్యా -

అవిద్యామ్ - నిహన్తి - ఏవ - తేజః - (తిమిర-సఙ్ఘ-వత్).

**అవిరోధితయా ॥ కర్మ, నావిద్యాం వినివర్తయేత్,**
**విద్యా ॥ ఽవిద్యాం నిహన్త్యేవ, తేజస్ ॥ తిమిరసఙ్ఘవత్. 3**

అవిరోధితయా - - కర్మ - అవిద్యామ్ - న వినివర్తయేత్ - - తేజః - తిమిరసఙ్ఘవత్ - - అవిద్యామ్ - విద్యా ఏవ - నిహన్తి.

(అవిరోధితయా) విరోధము లేనిదగుటచేత (కర్మ) కర్మ (అవిద్యామ్) అవిద్యను (న వినివర్తయేత్) మరలింపదు, నాశము చేయలేదు. (తేజః) వెలుతురు (తిమిరసఙ్ఘవత్) చీకటియొక్క సమూహమును వలె (అవిద్యామ్) అవిద్యను (విద్యా ఏవ) విద్యయే (నిహన్తి) నాశము చేయుచున్నది. 3

*అద్వైత ఆత్మబోధకంటె వేఱైనదంతా కర్మరూపంగా చెప్పబడుచున్నది.*

క్రిందటి శ్లోకంలో చెప్పబడిన అన్యసాధనలన్నీ కర్మరూపములే, ఉనికి రూపములు కాదు. అర్థంచేసికొందాం.

గుణకర్మ సాధనకర్మ అని కర్మను రెండురూపములుగా చూచాం. గుణ ప్రవృత్తితో చేయబడు చేష్టలన్నీ గుణకర్మలుగా బంధిస్తయ్. గుణప్రవృత్తిని మరలించే సాధనతో ఆచరించే చేష్టలన్నీ సాధనకర్మగా సహకరిస్తయ్. ఏదైనా అది కర్మయే. క్రియకు విషయానికి ఆధ్యాత్మికపక్షం కర్మ. బాహ్యమును ఎంచుకొంటూ, బాహ్యంతో స్వరూపాన్ని పోల్చుకొంటూ ఆధ్యాత్మికంగా చేయబడేది కర్మ. అంటే, ఆధ్యాత్మికంగా ఆత్మను=స్వరూపాన్ని ఎంచుకోక..పోల్చుకోక బహిర్ముఖంగా బాహ్యసంబంధంతో చేసేది కర్మ. ఉపనిషదాదుల అధ్యయనం కూడా, వాటిలోని మంత్రములను పఠించుటగానే భావించుట జరుగుతుంటుంది సాధారణంగా. అవి అందించే నిజస్వరూపస్థితిని అందుకొనే అంతర్ముఖంగా అంతర్ముఖసంబంధంతో సాగదు సాధారణంగా. కృష్టంగా చెప్పాలంటే, వెనుకకు చూస్తూ ముందుకు నడిచినట్లుంటుంది కర్మ తీరు, ముందుకు చూస్తూ ముందుకు నడిచినట్లు ఉండదు. కర్మల సంపుటి దేహజీవితం. అందుకే, ఆత్మజ్ఞానంతో కర్మను ఆచరించమని శాస్త్రములన్నీ ఘోషిస్తున్నయ్.

**భూతభావోద్భవకరః విసర్గః కర్మసంజ్ఞితః.** (గీ8-3)

జన్మ, జన్మభావమును కలిగించే కారణమును విడుచుట కర్మ అనబడుతుందని కర్మకు మాధవుని నిర్వచనం. ఈ నిర్వచనం ప్రకారంగా ఆచరిస్తే ముందు చూస్తూ ముందుకు నడిచినట్లు.

ఇది గుర్తించి ఆచరించేవఱకు కర్మ ఆత్మజ్ఞానమునకు వ్యతిరేకంగానే ఉంటుంది. అవిద్యతో విరోధం లేకుండగా, అంటే అవిద్యకే చేయూతనిస్తూ కర్మ ఉంటుందని అంటున్నది ఈ శ్లోకం. కనుక, కర్మ అవిద్యను తప్పించేదు, మరలించేదు.

తప్పుగా తెలియుట అవిద్య. తప్పుడు దిశలో సాగే కర్మ తప్పుకు దిక్సూచియై తప్పక తప్పుగానే తెలియచేస్తుంది. కర్మ శ్రమను ఎంచి అవిద్యను పెంచుకొంటుంది. అందువలన, కర్మ అవిద్యకు స్నేహం, విరోధి కాదు, అవిద్యను తొలగించేదు.

**విద్యా ఏవ అవిద్యాం నిహన్తి.** విద్యయే అవిద్యను నాశం చేస్తుంది. కర్మను .. ఉనికిని సరిగా తెలియుట విద్య. కర్మ ఉనికికి వ్యతిరేకమనీ, కర్మకు ఉనికి విలక్షణమనీ ఎఱుగుట విద్య. ఆత్మబోధను = స్వరూపావగాహనను నిలుపుకొన్న విద్యయే కర్మకు స్నేహమైన అవిద్యను తొలగిస్తుంది.

**తేజః తిమిరసఙ్ఘవత్** అని ఉపమానం చెపుతున్నది శ్లోకం. దీపం వెలిగించేగానే దట్టంగా అలుముకొన్న చీకటి తొలగిపోతున్నది. ఎక్కడికి పోతున్నదో ఎవరికి కనపడదు. వెలుతురులేమియే చీకటి. చీకటికి ప్రత్యేకమైన రూపం లేదు. చీకటి వెలుతురును వెడలగొట్టలేదు. విద్యలేమియే అవిద్య. అవిద్యకు ప్రత్యేకమైన రూపం లేదు. అవిద్య విద్యను వెడలగొట్టలేదు. చీకటి వెలుతురును వెదకిస్తుంది, వెలుతురు చీకటిని స్మృతికికూడ రానీయదు. అవిద్య విద్యను వెదకిస్తుంది, విద్య అవిద్యను స్మృతికికూడ రానీయదు. 3

**అవచ్ఛిన్న ఇవాజ్ఞానాత్, తన్నాశే సతి కేవలః,**
**స్వయం ప్రకాశతే హ్యాత్మా, మేఘాపాయేఽంశుమానివ.**

అవచ్ఛిన్నః - ఇవ - అజ్ఞానాత్ - తత్ - నాశే - సతి - కేవలః - స్వయమ్ - ప్రకాశతే - హి - ఆత్మా - (మేఘ+అపాయే) - అంశుమాన్ - ఇవ.

**అవచ్ఛిన్న ఇవ్వాజ్ఞానాత్, తన్నాశే సతి ॥ కేవలః,**
**స్వయం ప్రకాశతే హ్యాత్మా, మేఘాపాయే ॥ ఽంశుమానివ. 4**

ఆత్మా - - అజ్ఞానాత్ - అవచ్ఛిన్నః ఇవ - [జ్ఞాయతే] - - మేఘాపాయే - అంశుమాన్ ఇవ - - తత్ - నాశే సతి - కేవలః - స్వయమ్ - ప్రకాశతే.

(ఆత్మా) ఆత్మ (అజ్ఞానాత్) అజ్ఞానంవలన (అవచ్ఛిన్నః ఇవ) భిన్నమైనట్లు [జ్ఞాయతే=తెలియబడుచున్నది]. (మేఘాపాయే) మేఘము తొలగినపుడు (అంశుమాన్ ఇవ) సూర్యునివలె (తత్) అది, అజ్ఞానం (నాశే సతి) నాశము అగుచుండగా (కేవలః) కేవలముగా, ఉన్నదున్నట్లు (స్వయమ్) స్వయంగా, ఇతర సాహాయ్యములేక (ప్రకాశతే) ప్రకాశిస్తుంది, తెలియవస్తుంది. 4

*84లక్షల జీవరాశుల జన్మలందు అంతట, అన్ని విషయములలోను, జీవులందఱు* **అహం=నేను** *అని ఆత్మపరంగా, ఇన్ని ఆత్మలుగా స్పష్టంగా అనుభవిస్తున్నారు. ఇక, ఆత్మబోధయొక్క అవసరం ఏమి? ఆత్మబోధలేమి అన్న*

దుర్వ్యవస్థ జీవులకు ఎందుకుంటున్నది? అన్న శంకలకు ఈశ్లోకం సమాధానం చెపుతున్నది.

అజ్ఞానంవలన, ఆత్మ=అహంశబ్దవాచ్యం=నేను అనేకరూపములలో భిన్నమైనట్లు తెలియబడుతున్నది. ఇది తెలియుటలో దోషమే, ఆత్మయొక్క స్వరూపభేదం కాదు. అజ్ఞానం అంటే ఏదో అనుకొని ఎక్కడో ఊహించే కూడదు సుమా! జ్ఞానంలేకుండుట=తెలియకుండుట అజ్ఞానం. శుచియై అద్వైతమై ఏకరూపమైన ఆత్మ, జన్మ-దేశ-కాల-విషయ-రాగముల పొంగులలో అశుచిగా ద్వైతంగా అనేకంగా ఊహించేబడుతున్నది. చూచినది త్రాడే అయినా, త్రాడును పాము అనుకొన్నట్లు, స్వచ్ఛమైన ఆత్మస్ఫురణ అశుచి రూపములుగా బంధిస్తున్నదిగా అనుకొనబడుతున్నది.

సాధకులు ఇక్కడ గుర్తించేవలసిన రహస్యం ఒకటి ఉన్నది. జీవుని ఊహ-అనుకొనుటలు సత్యమైతే, అదైనా ఏదో ఒకరూపంలో సత్యమై ఉండి, అనేకం లేకుండా పోతుంది. ఊహ-అనుకొనుటలు సత్యం కాదు కనుకనే, ప్రతిసారి మార్చుకొంటూ అనేకములు అనుకొనవలసి వస్తున్నది. ఇక్కడ ఇంకొక రహస్యం ఏమిటంటే, ప్రతిసారి తన ఊహను అసత్యంగా చేసి ఇంకొకటి అన్వేషింపచేసేది తన స్వచ్ఛమైన నిజరూపమే. ఇది గుర్తించేవలె. గుర్తించేని జీవుడు ఇంకొక అసత్యమును సత్యరూపంగా ఊహించుకొంటున్నాడు. ఈ విధంగా, ఇంతవఱకు నిత్యం తనకు కలిగిన జ్ఞానావకాశమును అజ్ఞానంచేత విడిచేసికొంటూ వచ్చాడు జీవుడు.

ఇది తనలో జేరుగుతున్న పరివర్తనయే కనుక, ఎప్పటికైనా, తన నిజతేజస్సు తనకు తెలివికి అందినప్పుడు తన నిజరూపం తనకు కేవలమై = అద్వైతమైనదిగా స్వయంగా ప్రకాశిస్తుంది=తెలియవస్తుంది.

**మేఘాపాయే అంశుమాన్ ఇవ** శ్లోకం ఉపమానంతో బోధిస్తున్నది.

మేఘం తొలగితే సూర్యుడు స్పష్టంగా స్వచ్ఛంగా కనబడినట్లు. మేఘం అడ్డువచ్చినప్పుడు సూర్యుడు అస్పష్టంగానో లేనట్లుగానో, మేఘపు ఆవరణను అనుసరించి అనేకవెలుగులలో కనబడుతున్నాడు. సూర్యునికి ఇన్ని రూపములు లేవు. భిన్నత్వం మేఘముల ఆవరణవలన కలిగింది. మేఘములు, వాటి ఆవరణ వలన కలిగిన భిన్నత్వం..అనేకత్వం సూర్యునివలననే తెలుస్తున్నది, సూర్యుని రూపంతో పోల్చియే తెలుస్తున్నది. జీవభావముల ఆచరణలవలన ..ఆవరణల వలన ఆత్మభావమునకు అస్పష్టత..అభావం(లేనట్లు) అనిపిస్తున్నది. భిన్నత్వం అజ్ఞానకారణమైన జీవభావములవలననే కలుగుతున్నది. జీవభావములు, వాటి ఆవరణలవలన కలిగిన భిన్నత్వం..అనేకత్వం తన నిజరూపకాంతివలననే తెలుస్తున్నది, నిజరూపంతో పోల్చియే తెలుస్తున్నది. 4

**అజ్ఞానకలుషం జీవమ్, జ్ఞానాభ్యాసాద్వినిర్మలమ్,**
**కృత్వా జ్ఞానం స్వయం నశ్యేత్, జలం కతకరేణువత్.**

(అజ్ఞాన-కలుషమ్) - జీవమ్ - (జ్ఞాన-అభ్యాసాత్) - వినిర్మలమ్ - కృత్వా - జ్ఞానమ్ - స్వయమ్ - నశ్యేత్ - జలమ్ - కతకరేణువత్.

**అజ్ఞానకలుషం ॥ జీవమ్, జ్ఞానాభ్యాసాద్ ॥ వినిర్మలమ్,**
**కృత్వా ॥ జ్ఞానం స్వయం నశ్యేత్, జలం ॥ కతకరేణువత్. 5**

అజ్ఞానకలుషమ్ - జీవమ్ - జ్ఞానాభ్యాసాత్ - వినిర్మలమ్ - కృత్వా - - జలమ్ - కతకరేణువత్ - - జ్ఞానమ్ - స్వయమ్ - నశ్యేత్.

(అజ్ఞానకలుషమ్) అజ్ఞానంచేత కలుషితమైన (జీవమ్) జీవుని, జీవభావమును (జ్ఞానాభ్యాసాత్) జ్ఞానాభ్యాసంవలన (వినిర్మలమ్) నిర్మలముగా (కృత్వా) చేసి (జలమ్) నీటిని (కతకరేణువత్) చిల్లగింజవలె (జ్ఞానమ్) జ్ఞానము (స్వయమ్) తనకు తానే (నశ్యేత్) కనిపించేకుండగ పోతుంది. 5

అజ్ఞానంచేత కలుషితమైన జీవుని జీవభావాన్ని జ్ఞానాభ్యాసం నిర్మలం చేస్తుంది. ఎట్లా చేస్తుందో చూద్దాం. పాఠం రాని విద్యార్థి, పదిమారులు చదివి, **రాదు** అన్న కలుషితమును పోగొట్టుకొని, **వచ్చింది** అన్న నిర్మలత్వమును సాధిస్తున్నాడు. చదివి, రాని మనస్సును వచ్చినదిగా మార్చి ఇది సాధిస్తున్నాడు. అట్లే, జీవునిగా ఊహింపచేసి అజ్ఞానంలో కలుషితమైన మనస్సును,

**జీవో నాహం శుద్ధోఽహం ప్రత్యగభిన్న బ్రహ్మైవాహమ్** నేను జీవుడను కాదు, శుద్ధస్వరూపుడను, ప్రత్యక్షంగా అనుభవిస్తున్న సచ్చిదానందల క్షణాత్మకమైన బ్రహ్మమునే అని విచారణచేసి, విషయప్రవర్తనలో జీవరూపంకంటె గొప్పదైన తనరూపమును దర్శించి నిలుపుకొని, క్రమంగా జ్ఞానమును=ఎఱుకను సాధించే అభ్యాసం, విరామం లేకుండగా చేస్తే, మనస్సును అజ్ఞానకలుషమునుండి నిర్మలం చేయగులుగుతాడు.

**జలం కతకరేణువత్.** చిల్లగింజే గంధం తీసి బురదనీటిలో వేస్తే, నీటిలోని బురదను గంధం అడుగుకు దింపి, తరువాత తానుకూడా అడుగుకు దిగిపోతుంది. అప్పుడు, నీటికి బురద కల్మషంకాని చిల్లగింజే ప్రయోగ ప్రభావంకాని లేక నీరు స్వచ్ఛంగా ఉంటుంది.

జ్ఞానాభ్యాసం అజ్ఞానకలుషమును అణచివేస్తుంది. అంతవఱకు మేలే. కాని, తాను బ్రహ్మము అయి ఉండే ఉనికికంటె, అయినానని అనుకొంటూ ..గుర్తించేకొంటూ ప్రవర్తిస్తే అప్పుడు బ్రహ్మలక్షణములు తనకు ద్వైతలక్షణము లుగా బంధిస్తయ్. జ్ఞానం అజ్ఞానంవలె బంధించేదు. జీవుని తన సత్-చైతన్య -ప్రకాశ-జ్ఞాన-ఆనందములనే నిజలక్షణములను ఎఱిగింప చేయు సాధన

ప్రక్రియయే జ్ఞానం. ఎఱుక ఉనికిగా చేరి, సాధనప్రక్రియరూపం అదర్శనమవుతుంది. ఇక జ్ఞానం-జ్ఞేయం-పరిజ్ఞాతా(తెలియువాడు) అన్న త్రిపుటి ఏకరూపంలో ఉనికిగా=సత్‌లక్షణంగా నిలిచిపోతుంది. ఇది సృష్టికి స్వాభావికం, జీవుడు సిద్ధిపొందుటకు సృష్టియొక్క అమరిక. 5

**సంసారస్స్వప్నతుల్యో హి, రాగద్వేషాది-సఙ్కులః,**
**స్వకాలే సత్యవద్భాతి, ప్రబోధేఽసత్యవద్భవేత్.**

సంసారః - (స్వప్న-తుల్యః) - హి - (రాగ-ద్వేష-ఆది-సఙ్కులః) - (స్వ-కాలే) - (సత్య-వత్) - భాతి - ప్రబోధే - (అసత్య-వత్) - భవేత్.

**సంసారస్ ॥ స్వప్నతుల్యో హి, రాగద్వేషాది-సఙ్కులః,**
**స్వకాలే ॥ సత్యవద్ భాతి, ప్రబోధే ॥ ఽసత్యవద్ భవేత్. 6**

హి - సంసారః - స్వప్నతుల్యః - (రాగద్వేషాది-సఙ్కులః) - - స్వకాలే - సత్యవత్ - భాతి - - ప్రబోధే - అసత్యవత్ - భవేత్.

(హి) నిశ్చయముగ (సంసారః) సంసారం (స్వప్నతుల్యః) స్వప్నంవంటిది (రాగద్వేషాది-సఙ్కులః) రాగద్వేషములు మొదలైన ద్వంద్వములచే వ్యాపించినది. (స్వకాలే) దానికాలమున (సత్యవత్) సత్యమైనదానివలె (భాతి) ప్రకాశిస్తుంది. (ప్రబోధే) బాగుగ అవగాహన అయినపుడు (అసత్యవత్) అసత్యమువలె (భవేత్) అవుతుంది. 6

అనేక జీవభావముల స్థితిని ఒక్కమాటలో శ్లోకం సంసారం అంటున్నది. **సంసరతి అనేన ఇతి సంసారః**. సృ-గతౌ. దీనివలన జారిపడును కనుక సంసారం.

**పునరపి జననం పునరపి మరణం పునరపి జననీజఠరే శయనమ్,**

**ఇహ సంసారే బహుదుస్తారే.**

మరల మరల పుట్టుట, మరల మరల చేచ్చుట, మరల మరల తల్లికడుపులో బంధింపబడుట అన్నది సంసారం. ఎట్లో చూద్దాం. ప్రతిజన్మలో జన్మభావంతో జీవభావంతో దేహభావంతో బ్రతుకుతున్నట్లు భావించినా, వీటికి అధిష్ఠానంగా =అధికసత్యంగా అహమ్=నేను అన్న నిజఆత్మభావంతోనే ఉనికి ఉంటున్నది. ఈ నిజఉనికిని ఆధ్యాత్మికంగా గ్రోలి అభ్యాసంచేయుటయే సృష్టిలో జన్మల అమరిక design. ఆయా జన్మలలో అధికమైన ఆధ్యాత్మికానుభవంతో ఆత్మభావమును గ్రోలుతున్నప్పటికి గుర్తింపుతెలివి లేనందువలన, పొందుతున్నదానికి వేఱుగా జీవభావమునే మోసికొని పోతున్నాడు ----- ఒక విషయంనుండి తదుపరి విషయానికి, ఒకజన్మనుండి మరుజన్మకు. ఇది అతని సంసరణం= జారిపడుట అనే సంసారం.

**సంసారః రాగద్వేషాది-సఙ్కులః.** శుచిగా స్నానంచేసిన దేహంతో వీధిలో తిరుగుతు దుమ్ము-ధూళి మొదలగు అశుచిని దేహంమీద ప్రోగుచేసి కొంటాడు మనిషి. ఇది తనకే ఉపమానం. శుచిగా ఆత్మస్వరూపంతో జన్మ పరంపర అను వీధిలో చరిస్తూ, రాగద్వేషాది ద్వంద్వములచే వ్యాపించిన ఆ వీధిలో ద్వంద్వములనే తనపై ప్రోగుచేసికొంటాడు. ఇక ఆ మురికితోనే పొర్లాడుతూ అదే తనకు రూపంగా భావిస్తూ అనుభవిస్తూ సాగుతుంటాడు. దారివలన ప్రయాస అనుకొంటాడు, తనకు ఆ దారిన పోవలసిన అవసరం లేదని గుర్తించేడు.

**సంసారః స్వప్నతుల్యః.** ఈసంసారం స్వప్నంవంటిది. అంటే ఏమిటో శ్లోకమే వివరిస్తున్నది. **స్వకాలే సత్యవత్ భాతి, ప్రబోధే అసత్యవద్ భవేత్.** స్వప్నకాలంలో స్వప్నం అంతా సత్యమన్నట్లే తనకు ప్రకాశిస్తుంది. అర్థంచేసికొందాం. స్వప్నకాలంలో స్వప్నం సత్యంగా లేదు, అసత్యంగానూ లేదు. అసత్యమైన దానికి ఉనికి లేదుగా! అసత్యంగా ప్రకాశించుట తనకే, తనతో పోల్చియే. ఈ సూక్ష్మ వ్యత్యాసం గుర్తించాలి. నిద్రనుండి లేచిన తరువాత లేనిదిగా తెలియుట కాదట. లేనిదివలె తెలుస్తుందట — శ్లోకం చెప్తున్నది. స్వప్నకాలంలో సత్యమన్నా, నిద్రలేచి అసత్యమన్నా, అన్నీ తను అనటమే. తనకు ప్రకాశించేటమే. సత్యమన్నప్పుడు ఉండుట, అసత్యమన్నప్పుడు లేకపోవుట అన్న వ్యవస్థ స్వప్నానికి లేదు. ఇది ఉపమానం.

రాగద్వేషాది సంసారానికి, జీవభావములకు సత్యమైన ఉనికి లేదు సరికదా, అసత్యమైనదని చూపటానికికూడా ఉనికి లేదు. స్వకాలే దానికాలంలో, అంటె ఉన్నదన్నప్పుడు, ఉన్నదన్నందుకు అన్నది అన్నట్లు ఉన్నదానివలె కనబడుతుంది. అన్నదానికి, అనుటలో నిలకడ ఉండదుగా! ఎట్లెట్లు అనుటలో మార్పు కలుగుతుంటుందో అట్లట్లు ఉన్నదానివలె కనబడుటలోకూడా మార్పు కలుగుతుంటుంది. బోధ అవగాహన అయి అసత్యమని అంటె అసత్యం వలెనె ప్రకాశిస్తుంది. తను అన్న సత్యాసత్యములు తను అనుటకే పరిమితం, రాగద్వేషాదులకు గాని జీవభావములకుగాని సంసారమన్నదానికిగాని వర్తించేదు. 6

**తావత్సత్యం జగద్భాతి, శుక్తికారజతం యథా,**
**యావన్న జ్ఞాయతే బ్రహ్మ, సర్వాధిష్ఠానమద్వయమ్.**

తావత్ - సత్యమ్ - జగత్ - భాతి - (శుక్తికా-రజతమ్) - యథా - యావత్ - న - జ్ఞాయతే - బ్రహ్మ - (సర్వ-అధిష్ఠానమ్) - అద్వయమ్.

**తావత్ ॥ సత్యం జగద్ భాతి, శుక్తికారజతం ॥ యథా,**
**యావన్ ॥ న జ్ఞాయతే బ్రహ్మ, సర్వాధిష్ఠానమ్ ॥ అద్వయమ్.** 7

యథా - శుక్తికారజతమ్ - - [తథా] - - యావత్ - సర్వాధిష్ఠానమ్ - అద్వయమ్ – బ్రహ్మ - న జ్ఞాయతే - - తావత్ - జగత్ - సత్యమ్ - భాతి.

(యథా) ఏ విధంగా (శుక్తికారజతమ్) ముత్యపుచిప్పలో వెండియో [తథా= ఆ విధంగా] (యావత్) ఎంతవఱకు (సర్వాధిష్ఠానమ్) సర్వమునకు అధికసత్యమైనది (అద్వయమ్) ద్వైతం లేనిది అయిన (బ్రహ్మ) బ్రహ్మము (న జ్ఞాయతే) తెలియబడదో (తావత్) అంతవఱకు (జగత్) జగత్తు (సత్యమ్) సత్యముగా (భాతి) ప్రకాశిస్తున్నది. 7

జగత్తు ఉనికి, బ్రహ్మ ఉనికి లోకానికి..మనిషికి ఎల్లప్పుడు మీమాంసయే. లేని జగత్తును ఉన్నదంటాడు. ఉన్న బ్రహ్మ లేదన్నట్లు భ్రాంతిలో తిరుగుతాడు, దర్శనార్థం సాధనచేస్తారు సాధకులు. ఈ మీమాంసకు పరిష్కారబోధను చేస్తున్నది ఈ శ్లోకం.

**యథా శుక్తికారజతమ్.** ముందుగా, శ్లోకం చెప్పే ఉపమానం అర్థంచేసికొందాం. సూర్యరశ్మిలో ముత్యపుచిప్పను చూస్తే వెండివలె కనిపిస్తుంది. అక్కడ వెండి లేదు. ఇది భ్రాంతి. చూచినది ఉన్నట్లు చూడక వేఱుగా అనుకొని చూచేట. ఇక్కడ ఉన్నదృశ్యం మఱుగై అనుకొన్నదే దృష్టియై దృశ్యంగ కనబడుతున్నది. వెండిని గ్రహించబోయి ముత్యపుచిప్పను స్పష్టంగా చూచినప్పుడు వెండిలేదని తెలిసింది. ఈ ఉపమానంలో వెండి భ్రాంతిరూపం. వెండిని చూచేటప్పుడు వెండికంటె అధికసత్యంగా (వెండికి అధిష్ఠానంగా) ముత్యపుచిప్ప ఉన్నది. అధిష్ఠానమైన ముత్యపుచిప్పను చూడక భ్రాంతిరూపమైన వెండి కనపడదు. ముత్యపుచిప్ప వెండి అనే ద్వైతరూపం=మారురూపం లేని అద్వయం. ఈ విధంగా, అధిష్ఠానము అద్వయము అయిన ముత్యపుచిప్పను తెలియనంతవఱకు భ్రాంతిరూపమైన వెండి కనపడుతుంది.

**యావత్ సర్వాధిష్ఠానమ్ అద్వయం బ్రహ్మ న జ్ఞాయతే, తావత్ జగత్ సత్యం భాతి.** ఎంతవఱకు అన్నిటికి అధిష్ఠానమైనది, అద్వయమైనది అయిన బ్రహ్మము తెలియబడదో, అంతవఱకు జగత్తు సత్యంగా ప్రకాశిస్తున్నది – అంటున్నది శ్లోకం. బ్రహ్మము అధిష్ఠానం అద్వయం. జగత్తు భ్రాంతిరూపం. అర్థంచేసికొందాం.

బ్రహ్మము అంటే ఎవరో చతుర్భుజమో షడ్భుజమో వైకుంఠవాసమో కైలాసవాసమో ఊహించేకూడదు సాధకులు. సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములే బ్రహ్మము. ఈ లక్షణములనుకూడా ఎక్కడివో ఎవరివో అని తేరిచూడ వద్దు. సృష్టి అంతా వ్యాపించిన లక్షణములు ఇవి. ప్రాణులందఱికి అధిష్ఠానమైన లక్షణములు. **సత్**=ఉండుట=ఉనికి, **చైతన్యము**= ఉనికియందు ఆధారపడిన తెలివి, **ప్రకాశము**=ఉనికితెలివి తనకు ప్రకాశించేట, **జ్ఞానము**= ప్రకాశించిన ఉనికి

తెలివిని ఎఱుకలో నిలుపుకొనుట, **ఆనందము**= అటువంటి ఉనికియందు పూర్ణత్వము. ఇదంతా కలిసి ఒకమాట ---- అహమ్=నేను=ఆత్మ= ప్రాణికి తననుగుఱించిన విశాలమైన ఎఱుక: ఇవి అధిష్ఠానలక్షణములు. ఈ లక్షణములు లేక ఏప్రాణికిని చేష్టకాని విషయప్రవర్తనకాని లేవు. చేష్టలు విషయప్రవర్తన ప్రాణికి భ్రాంతిరూపం. తన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు అధిష్ఠానం..అద్వయం. అర్థంచేసికొందాం.

నేను దుఃఖపడుతు ఉన్నాను – ఇది జీవుని ఒకానొక విషయం. నేను ఉన్నాను అన్న ఉనికి అంశం తీసివేస్తే దుఃఖపడుతు అన్న విషయంలేదు, ప్రవర్తన లేదు. దుఃఖపడుతు అన్న విషయం తీసివేస్తే నేను ఉన్నాను అన్న ఉనికి ఉన్నది. ఇది అన్వయవ్యతిరేక న్యాయం. ఉనికి ఉంటే విషయం ఉంటుంది, ఉనికిని ఆధారం చేసికొని ఉంటుంది. ఉనికి లేకుంటే విషయానికి ఉనికి లేదు. ఈ విధంగా, ఉనికి=సత్=ఆత్మ విషయానికి అధిష్ఠానం=అధికసత్యం. ఉనికికి దుఃఖపడుట మొదలైన విషయములుకాని విషయరూపంకాని లేవు. ఈవిధంగా, ఉనికి అద్వయం=ద్వైతరూపంలేనిది.

ఈవిధంగా, అధిష్ఠానం అద్వయం అయిన బ్రహ్మలక్షణములు తనవే. వాటిని స్వరూపంగా కలిగికూడా దుఃఖంతో ఉన్నానని సత్‌లక్షణానికి దుఃఖమును ద్వైతం చేస్తాడు. దుఃఖమే తనకు చైతన్యం, దుఃఖం ప్రకాశిస్తున్నదని దుఃఖమును ఎఱుకలో నిలుపుకొని దుఃఖించుటయే ఆనందమన్నట్లు ప్రవర్తిస్తుంటాడు. ఈ విధంగా, ముత్యపుచిప్పను చూచి వెండి అని భ్రాంతిపడినట్లు, బ్రహ్మలక్షణములైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనందములను విషయరూపంలోని ముసుగులో చూస్తాడు. ముత్యపుచిప్పనే వెండి అనుకొన్నట్లు బ్రహ్మలక్షణములనే దుఃఖాది రూపములుగా చూస్తాడు.

అధిష్ఠానం అద్వయమైన స్వరూపమును దుఃఖాది విషయములలో నిలుపుకొనేవఱకు దుఃఖాది విషయరూపజగత్తే సత్యంగా అనిపిస్తుంది. కనుక, ఆత్మరూపమును విషయప్రవర్తనలో నిలుపుకొను ఆత్మబోధ =ఆత్మావగాహన =బ్రహ్మలక్షణం ముక్తికి సూత్రం. 7

**సచ్చిదాత్మన్యనుస్యూతే, నిత్యే విష్ణౌ ప్రకల్పితాః,**
**వ్యక్తయో వివిధాస్సర్వాః, హాటకే కటకాదివత్.**

(సత్-చిత్-ఆత్మని) - అనుస్యూతే -నిత్యే - విష్ణౌ - ప్రకల్పితాః - వ్యక్తయః - వివిధాః - సర్వాః - హాటకే - కటకాదివత్.

**సచ్చిదాత్మన్యనుస్యూతే, నిత్యే విష్ణౌ ॥ ప్రకల్పితాః,**
**వ్యక్తయో । వివిధాస్సర్వాః, హాటకే ॥ కటకాదివత్.** **8**

వివిధాః - సర్వాః - వ్యక్తయః - - హాటకే - కటకాదివత్ - - అనుస్యూతే - నిత్యే - విష్ణౌ - సచ్చిదాత్మని - ప్రకల్పితాః.

(వివిధాః) వివిధములైనవి (సర్వాః) అన్ని (వ్యక్తయః) వ్యక్తమయ్యే జగత్తు పదార్థములు..విషయములు (హాటకే) బంగారునందు (కటకాదివత్) కడియము మొదలైన నగలవలె (అనుస్యూతే) గ్రుచ్చబడినవిగ ఉన్నదియు (నిత్యే) నిత్యమైనదియు (విష్ణౌ) సర్వవ్యాపియైనదియు అయిన (సచ్చిదాత్మని) సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములందు (ప్రకల్పితాః) కల్పింపబడినవి. 8

బ్రహ్మమునకు జగత్తునకు పరస్పరమైన వ్యత్యాసం చెప్పబడుతున్నది. శ్లోకం మోపుతున్న ఉదాహరణను అర్థంచేసికొందాం.

బంగారపు కడియం గొలుసు ఉంగరం మొదలైన నగలన్నీ బంగారంలో గ్రుచ్చబడినయ్. అంటే, ఒక్క బంగారం అన్న లోహంలో నగలన్నీ దారంలో గ్రుచ్చిన పూసలవలె ఆధారపడి ఉన్నయ్. బంగారుకడియంలో బంగారం నిత్యమైనది, కడియం అశాశ్వతమైనది. అంటే, నగను చెడగొడితే కడియపు గుండ్రనిరూపం చెడుతుంది, బంగారం చెడదు. అన్ని నగలలోను బంగారం వ్యాపించి ఉన్నది. బంగారం ఉంటే కడియం మొదలైన నగలు ఉంటయ్, బంగారం లేక కడియం మొదలైన నగలేవీ లేవు. నగకు బంగారమే ఉనికిచైతన్యం, ఉనికిప్రకాశం, ఉనికి జ్ఞానం, ఉనికిఆనందం. అంటే బంగారంవలననే సత్- చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు, కడియం మొదలైనవాటివలన కాదు.

**జననాత్ విపరిణమతే క్షీయతే నశ్యత ఇతి వికారగమనం యస్య తత్ జగత్.** పుట్టుట..కలుగుటవలన మార్పులుచెందుట, క్షీణించుట, నశించుట అను వికారపు పోకడ కలిగినది జగత్తు. నామ-రూప-క్రియా-గుణములు, దేశ-కాల-వస్తు-వ్యక్తి రూపములన్నీ వివిధములైన వ్యక్తరూపములు=జగత్తు. ఇవన్నీ సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములలో గ్రుచ్చబడినయ్. అంటే, ఉనికి=ఉండుట, ఉనికిచైతన్యం, ఉనికిప్రకాశం, ఉనికిజ్ఞానం(ఎఱుక), ఉనికిఆనందం అన్న లక్షణములలో దారంలో గ్రుచ్చిన పూసలవలె గ్రుచ్చబడినయ్. ఈ లక్షణములను అధిష్ఠానంగా=అధికసత్యంగా వ్యక్తంచేయక వ్యక్తరూపములనబడేవి ఏవీ వ్యక్తం కావు. బంగారం వ్యక్తంకాకుండగా కడియం వ్యక్తంకాదు. నేను ఉన్నాను అన్న ఉనికి వ్యక్తంకాకుండగా దుఃఖపడుతు అన్న క్రియాగుణం వ్యక్తంకాదు.

**నిత్యే.** సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు నిత్యమైనవి, నామరూపాది జగత్తు అశాశ్వతం. అంటే, నామరూపాదులు క్షీణించి నశిస్తయ్, అధిష్ఠానమైన బ్రహ్మలక్షణములు సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనందములు క్షీణించేవు నశించేవే కాదు, మార్పులుకూడా చెందవు.

**విష్ణౌ.** నామరూపాది జగత్తునందంతటా సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద

లక్షణములు అధిష్ఠానంగా ఆధారంగా వ్యాపించి ఉన్నాయ్, పొంది ఉన్నాయ్. నామరూపాది జగత్తు ఉన్నదంటే సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు పొంది ఉన్నది అన్నది బోధ. జగత్తు లేదని తెలిస్తే ఉన్నది అద్వయమైన బ్రహ్మ లక్షణములే. ఈ అనుభూతియే ఆత్మబోధ=ఆత్మావగాహన. 8

**యథాఽఽకాశో హృషీకేశః, నానోపాధిగతో విభుః,**
**తద్భేదాద్భిన్నవద్భాతి, తన్నాశే కేవలో భవేత్.**

యథా - ఆకాశః - (హృషీక+ఈశః) - (నానా-ఉపాధి-గతః) - విభుః - (తత్- భేదాత్) - భిన్నవత్ - భాతి - (తత్-నాశే) - కేవలః - భవేత్.

**యథా ఽఽకాశో । హృషీకేశః, నానోపాధిగతో । విభుః,**
**తద్భేదాద్ ॥ భిన్నవద్ భాతి, తన్నాశే ॥ కేవలో భవేత్.** 9

యథా - ఆకాశః - - [తథా] - హృషీకేశః విభుః - నానోపాధిగతః - - తద్భేదాత్ - భిన్నవత్ - భాతి - - తన్నాశే - కేవలః - భవేత్.

(యథా) ఏవిధంగా (ఆకాశః) ఆకాశమో [తథా=ఆవిధముగా] (హృషీకేశః విభుః) ఇంద్రియనియామకుడైన సర్వవ్యాపి (నానోపాధిగతః) అనేకరూపములలో ఉన్నట్లు. (తద్భేదాత్) ఉపాధిభేదంవలన, నామరూపాది భేదంవలన (భిన్నవత్) వేఱురూపమైనట్లు (భాతి) ప్రకాశిస్తున్నది, తెలియవస్తున్నది. (తన్నాశే) ఉపాధి నశించుటయందు, నామరూపాదులు నశించుటయందు (కేవలః) కేవలము, ఏకరూపము (భవేత్) అగును. 9

*ఆత్మ=బ్రహ్మలక్షణములే జగత్తువలె అనిపిస్తున్నవని శ్లోకం ఉపమానంతో బోధిస్తున్నది. అర్థంచేసికొందాం.*

ఆకాశం ఒకటియే, సర్వవ్యాపి. అది చేరిన ఉపాధుల భేదంచేత ఘటాకాశం (కుండఆకాశం), మఠాకాశం, గృహాకాశం అని విభిన్నంగా అనిపిస్తున్నది. కుండంతా ఆకాశం వ్యాపించుటచేత కుండలో ఆకాశం కుండఆకారంలో కనబడుతున్నది. కాని ఆకాశానికి కుండఆకారం లేదు, కుండలో కుండాకాశంగా వేఱైన స్వరూపం లేదు. కుండపగిలితే ఆకాశం పగలదు. కుండలో ఉన్నా కుండ పగిలినా కుండలో ఆకాశం మహాఆకాశంతో ఒకటిగానే ఉన్నది. కుండను కదిలించినా కుండ కదులుతున్నదే కాని కుండలోని ఆకాశం కదలుటలేదు. ఇది ఉపమానం.

ఈవిధంగా, సృష్టిఅంతా మానవుని ఆత్మబోధకు ఉపమానముల సంపుటి.

**విభుః** సర్వవ్యాపియైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు ప్రాణుల ఇంద్రియములను నియమించు హృషీకేశములు. అర్థంచేసికొందాం. ప్రాణులకు ఇంద్రియములు గ్రాహ్యసాధనములు, అంటే గ్రహించుటకు పరికరములు.

లోకంలో పట్టుకారు, కొడవలివంటి పరికరములు అనేకములున్నాయ్. అవి స్థూలస్వరూపములు..భౌతికరూపములు. అవి చేసే పని వాటికి తెలియవు. పనిలో శీతోష్ణాదులవలన వాటికి బాధలేదు. విరిగిపోయినా వాటికి తెలియదు. అంటే, ఈ పరికరములు బాహ్యమునకు ఆధ్యాత్మికమునకును జడములు. ఇంద్రియములు పరికరములంటే జడములు కాదు. ఆంతరంగికంనుండి ఆధ్యాత్మికంగ సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణముల తేజస్సుతో బాహ్యప్రవర్తన చేస్తయ్. బాహ్యమును ఈ ఆధ్యాత్మికలక్షణములరూపంలో గ్రహిస్తయ్. తమ ఆధ్యాత్మిక లక్షణముల తేజస్సును గుర్తించి నిలుపుకోగలవు. ఈవిధంగ, ఇంద్రియములు బాహ్యమునకు ఆధ్యాత్మికమునకు ఆధ్యాత్మికచైతన్యవంతములైన పరికరములు.

వివేకహీనుడు తన ఇంద్రియములను=పరికరములను బాహ్యోన్ముఖంతో బాహ్యప్రవర్తనకు బాహ్యస్పర్శకే వాడుకొంటున్నాడు. వాటి ఆధ్యాత్మిక తేజస్సు తెలియనివాడు కనుక, అతని ఇంద్రియములు తేజోహీనములవలె ప్రవర్తిస్తున్నయ్. ఇది జీవుని దోషం. తేజోహీనమును సహించేలేవు ఇంద్రియములు. జీవునికి గుణపాఠం చెప్పి, బుద్ధిని=అవగాహనను ఇచ్చి, ఇంద్రియములు తేజోవంతములుగ ప్రవర్తించేటట్లు ఇంద్రియములను .. జీవుని నియమించేవి అతని ఆధ్యాత్మిక సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు. అందుకే, అవి హృషీకేశములు, తేజోవంతమైన ఇంద్రియములను తేజోవంతముగ నియమించే లక్షణములు.

కేవలస్వరూపమైనా, ఆధ్యాత్మికమైనా, విషయప్రవర్తనైనా సృష్టిలోని లక్షణములు ఒకటే, సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములే. ఇవి విషయప్రవర్తనలో ప్రయోగలక్షణములుగా, సాధనలో ఆధ్యాత్మికలక్షణములుగా, సిద్ధస్థితిలో కేవలస్వరూపంగా చెప్పబడినయ్. ప్రయోగము..సాధనలు కేవలమునకు ప్రకల్పితములని 8వ మంత్రంలోను, ఇంతవఱకును విచారించుకొన్నాం. ప్రయోగము..సాధనలు ఆయా స్థితిగతులలో అనేకఉపాధులను (అంటే విషయరూపములను) పొందుతుంటయ్. విషయానికి జీవం ఆధ్యాత్మికలక్షణములే కనుక ఆ లక్షణములే విషయంలో నిండి ఉన్నయ్ (కుండలో ఆకాశంవలె). విషయంలో లక్షణములకు విషయాకారం లేదు, అంటే విషయగుణములు లేవు. విషయంలో విషయలక్షణములుగా మారి వేఱై లేవు. విషయం నాశమైనా ఆధ్యాత్మికలక్షణములు నాశం కావు. విషయం విపరీతం అయినా ఆధ్యాత్మికలక్షణములు విపరీతం కావు. నేను దుఃఖపడుతు ఉన్నాను అన్నప్పుడు, దుఃఖపడుట ఉన్నదన్నా, తరువాత తొలగినదన్నా ఆధ్యాత్మికలక్షణములకు ఈ భేదంలేదు, ఆధ్యాత్మికలక్షణములు సృష్టిలో నిండియున్న లక్షణములుగానే ఒకటిగానే అభేదంగానే ఉంటయ్. విషయమును విషయఫలమనబడేదానిని మోస్తూ జీవుడు సుఖదుఃఖాది ద్వంద్వములలో తిరుగాడుతున్నా, (కుండయే కదులుతున్నది, ఆకాశం కాదు) తిరుగులాట జీవునికేకాని అతని ఆధ్యాత్మికలక్షణములకు కాదు.

విషయప్రవర్తనలో తన ఆధ్యాత్మికలక్షణములకు ఉపాధిభేదం కలిగించుకొనుట నశించినప్పుడు, జీవుడు తన ఆధ్యాత్మికలక్షణములతో కేవలుడుగా బ్రహ్మస్వరూపంగా ఉంటాడు. 9

**ఉపాదానేఽఖిలాధారే, జగన్తి పరమేశ్వరే,**
**సర్గస్థితిలయం యాన్తి, బుద్బుదా ఇవ వారిణి.**

ఉపాదానే - (అఖిల-ఆధారే) - జగన్తి - పరమేశ్వరే - (సర్గ-స్థితి-లయమ్) - యాన్తి - బుద్బుదాః - ఇవ - వారిణి.

**ఉపాదానే ॥ ఽఖిలాధారే, జగన్తి ॥ పరమేశ్వరే,**
**సర్గస్థితిలయం ॥ యాన్తి, బుద్బుదా ఇవ ॥ వారిణి. 10**

వారిణి - బుద్బుదాః ఇవ - - ఉపాదానే – అఖిలాధారే – పరమేశ్వరే - జగన్తి - సర్గస్థితిలయమ్ - యాన్తి.

(వారిణి) నీటియందు (బుద్బుదాః ఇవ) బుడగలవలె, అలలవలె (ఉపాదానే) సత్తాకారణము (అఖిలాధారే) అన్నివిధముల ఆధారము అయిన (పరమేశ్వరే) పరమనియామకమునందు (జగన్తి) సృష్టిబ్రహ్మాండము (సర్గస్థితిలయమ్) పుట్టుక -స్థితి-లయరూపములను (యాన్తి) పొందుచున్నవి. 10

*క్రిందటి శ్లోకంలో చెప్పబడిన నానాఉపాధుల పుట్టుక-స్థితి-లయములు ఈశ్లోకం విచారణ చేస్తున్నది.*

**వారిణి బుద్బుదాః ఇవ.** ఉపమానం అర్థంచేసికొందాం. నీటిలోని అలలు నీటినుండి పుట్టి, నీటిలో నీరుగనే ప్రవర్తించి, నీటిలోనే లయమైనయ్. పుట్టుక-స్థితి-లయములలో అలలు నీటియొక్క ఉపాదానములే. ఉపాదానం పదమును అర్థం చేసికొందాం. కుండకు మట్టి ఉపాదానం = ఉపాదానకారణం material = material cause, అంటే, కుండఆకారమంతా నిండి ఉన్న పదార్థం. కుమ్మరి నిమిత్తకారణం, కుండను చేసిన కారణం. చక్రం..కఱ్ఱ పనిముట్లు. అట్లే, అలలలో ఉన్నది నీరే కనుక, అలకు నీరు ఉపాదానకారణం. నీరును ఆధారం చేసికొనియే అలకు పుట్టుక-స్థితి-లయలు కలుగుటవలన అలకు నీరు అఖిలాధారం అయింది, పుట్టుకనుండి లయంవఱకు ఆధారం అయింది. నీటికి నీరు పరమమైన రూపం, అల అశాశ్వతరూపం. నీరు అలను పరమమైన నీటిరూపంగానే శాసిస్తున్నది. నియమిస్తున్నది పుట్టుక-స్థితి-లయ దశలలో. అందుకే, అలకు నీరు పరమేశ్వరరూపం. నీరు లేక అలకు అలరూపం లేదు. ఇది ఉపమానం.

సృష్టిలో జీవుడు చూచే భౌతికపదార్థములు, విషయములు, నామరూప క్రియాగుణములు, అహంకారమమకారాదులు, సుఖదుఃఖాది ద్వంద్వములు అన్నీ

జగత్తని చెప్పబడుతున్నది. అవన్నీ పుట్టి, మార్పులుచెంది, క్షీణించి, నశించేవి. ఈ జగత్తంతా పుట్టుక-స్థితి-లయములలో సృష్టియొక్క సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములరూపములే. సృష్టిలో ఈలక్షణములకంటె అన్యం=ఇతరమైనది లేదు. ఈవిధంగా, జగత్తుకు సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన- ఆనంద లక్షణములు ఉపాదానం=ఉపాదానకారణం= నిండి ఉన్న అధిష్ఠానరూపం. ఈ ఆధ్యాత్మికలక్షణములనే ఆధారంచేసికొని జగత్తుకు పుట్టుక-స్థితి-లయములు ఉన్నవి కనుక ఆధ్యాత్మికలక్షణములు జగత్తుకు అఖిలాధారమైనయ్. సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములకు ఈ లక్షణములు పరమమైనరూపం, జగత్తు అశాశ్వతరూపం. జీవుడు జగత్తును జగద్రూపంగా చూచినా ఆధ్యాత్మికలక్షణములు జగత్తును సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములుగానే= పరమరూపంగానే శాసిస్తున్నవి..నియమిస్తున్నవి పుట్టుక-స్థితి-లయదశలలో. అందుకే, జగత్తుకు సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు పరమేశ్వరరూపం.

ఈవిధంగా, జగత్తు పుట్టుకస్థితిలయములలోను ఉపాదానము, అఖిలాధారము, పరమేశ్వరమైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములను పొందినది. ఈలక్షణములు లేక జగత్తుకు జగద్రూపం లేదు. 10

**నానోపాధివశాదేవ, జాతినామాశ్రమాదయః,**
**ఆత్మన్యారోపితాస్తోయే రసవర్ణాదిభేదవత్.**

(నానా-ఉపాధి-వశాత్) - ఏవ - (జాతి-నామ-ఆశ్రమ-ఆదయః) - ఆత్మని - ఆరోపితాః - తోయే - (రస-వర్ణ-ఆది-భేద-వత్).

**నానోపాధివశాద్ ॥ ఏవ, జాతినామాశ్రమాదయః,**
**ఆత్మన్యారోపితాః, తోయే ॥ రసవర్ణాదిభేదవత్. 11**

తోయే - రసవర్ణాదిభేదవత్ -- నానోపాధివశాత్ ఏవ - ఆత్మని - జాతినామాశ్రమాదయః - ఆరోపితాః.

(తోయే) నీటియందు (రసవర్ణాదిభేదవత్) రుచి రంగు మొదలగు భేదం వలె (నానోపాధివశాత్ ఏవ) అనేక విషయరూపముల వశమగుటవలననే (ఆత్మని) ఆత్మయందు (జాతినామాశ్రమాదయః) జాతి-పేరు-ఆశ్రమం మొదలైనవి (ఆరోపితాః) ఆరోపింపబడినవి. 11

కార్యకారణములతో అనేకం కల్పించేకొని జగత్తు సత్యమన్నట్లు వాపోతుంటాడు జీవుడు. ఈ శ్లోకం అతని సమస్యకు సమాధానం చెప్తున్నది.

**తోయే రసవర్ణాదిభేదవత్.** ఉపమానం అర్థంచేసికొందాం. నీటికి రుచి..రంగు మొదలైన భేదం చెప్తుంది లోకం. ఇది ఆరోపితం. నీటికి

ఎప్పటికి..ఎక్కడైనా ఒకటే రుచి..రంగు. భూమిలో వ్యత్యాసంవలన నీటికి రుచి వ్యత్యాసం ఉన్నట్లు అనిపిస్తుంది. ఇతర సంపర్కంవలన రంగువ్యత్యాసం ఉన్నట్లు కనిపిస్తుంది. ఇది ఉపమానం.

సంస్కారవ్యత్యాసంవలన జీవుడు 84లక్షల జీవరాశుల జన్మలనెత్తుతాడు, అనేకమానుషజన్మలనెత్తుతాడు. సంస్కారవ్యత్యాసంవలన కలిగిన దేహములకు వశమై పేరు..జాతి..ఆశ్రమముల వ్యత్యాసంతో జన్మలను సాగిస్తాడు. ఏ విషయంనుండైనా, ఏ జన్మనుండైనా సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనందములను ఆధ్యాత్మికలక్షణములతోనే బయటపడుతున్నాడు. జాతినామాశ్రమములు తోడు రావటం లేదు. జాతినామాశ్రమములు జన్మవ్యవస్థలో కనపడి వాస్తవంలో లేనివి కనుక అవి జీవునికి ఆత్మయందు ఆరోపింపబడినవే, వాస్తవములు కాదు. 11

**పఞ్చీకృత-మహాభూత-సమ్భవం కర్మ-సఞ్చితమ్,**
**శరీరం సుఖదుఃఖానామ్, భోగాయతనముచ్యతే.**

(పఞ్చీకృత-మహాభూత-సమ్భవమ్) - (కర్మ-సఞ్చితమ్) - శరీరమ్ - (సుఖ-దుఃఖానామ్) - (భోగ-ఆయతనమ్) - ఉచ్యతే.

**పఞ్చీకృత-మహాభూత-సమ్భవమ్, కర్మ-సఞ్చితమ్,**
**శరీరం ॥ సుఖదుఃఖానామ్, భోగాయతనమ్ ॥ ఉచ్యతే. 12**

(పఞ్చీకృత-మహాభూత-సమ్భవమ్) -- (కర్మ-సఞ్చితమ్) -- శరీరమ్ - - సుఖదుఃఖానామ్ - భోగాయతనమ్ - ఉచ్యతే.

(పఞ్చీకృత-మహాభూత-సమ్భవమ్) పంచీకృతములైన మహాభూతములవలన కలిగినది (కర్మ-సఞ్చితమ్) కర్మలచేత కూడబెట్టబడినది (శరీరమ్) శరీరం (సుఖదుఃఖానామ్) సుఖదుఃఖములయొక్క (భోగాయతనమ్) భోగమునకు ఆలవాలమని (ఉచ్యతే) చెప్పబడినది. 12

శరీరరూపం చెప్పబడుతున్నది.

**పఞ్చీకృత-మహాభూత-సమ్భవమ్.** పంచీకరణం అర్థంచేసికొందాం. ఆకాశం సగభాగం, మిగిలిన వాయువు, తేజస్సు, ఆపస్(నీరు), పృథ్వీ ఒక్కొక్కటి ఎనిమిదవభాగంగా ఐదుతన్మాత్రలు కలిసి ఆకాశంమహాభూతం కలిగింది. అట్లే, వాయువు సగభాగం, మిగిలిన నాలుగు ఎనిమిదవభాగంగా తన్మాత్రలు కలిసి వాయువుమహాభూతం కలిగింది. ఇంకా, తేజస్సు సగభాగం, మిగిలిన నాలుగు ఎనిమిదవభాగంగా తన్మాత్రలు కలిసి తేజస్సుమహాభూతం; ఆపస్ సగభాగం, మిగిలిన నాలుగు ఎనిమిదవభాగంగా తన్మాత్రలు కలిసి ఆపస్మహాభూతం; పృథ్వీ సగభాగం, మిగిలిన నాలుగు ఎనిమిదవభాగంగా తన్మాత్రలు కలిసి

పృథ్వీమహాభూతము కలిగినయ్.

| తన్మాత్ర | | | | | |
|---|---|---|---|---|---|
| ఆకాశము | 0.500 | 0.125 | 0.125 | 0.125 | 0.125 |
| వాయువు | 0.125 | 0.500 | 0.125 | 0.125 | 0.125 |
| తేజస్సు | 0.125 | 0.125 | 0.500 | 0.125 | 0.125 |
| ఆపస్ | 0.125 | 0.125 | 0.125 | 0.500 | 0.125 |
| పృథ్వీ | 0.125 | 0.125 | 0.125 | 0.125 | 0.500 |
| మహాభూతము | ఆకాశం | వాయువు | తేజస్సు | ఆపస్ | పృథ్వీ |

ఇది, సాధారణంగా, పంచతన్మాత్రలు పంచమహాభూతములుగ పంచీకరణమైన పద్ధతిగా అందఱు చెప్పునది. ఇది ఇంతవఱకు సరియే. కానీ, పంచ మహాభూతముల పంచీకరణం ఇంతటితో పరిమితమైనది కాదు, చాల విస్తృతమైనది. పంచీకరణం అంటే విస్తరింపచేయుట అని అర్థం. పంచమహాభూతములు ఎందుకు కలిగినవో, కలిగి ఎట్లు కార్యరూపానికి వచ్చినవో, అంటే వాటి పూర్వాపరములతో సహ విస్తృతమైనది సమగ్రమైన పంచీకరణం. అర్థంచేసికొందాం.

సృష్టికి పూర్వం సత్=ఉనికి లక్షణం మాత్రమే ఉన్నది. ఉనికి అన్నది పదార్థంకాదు, మారిపోయే గుణమూ కాదు. నిత్య మైనదీ, **అణోరణీయాన్** సూక్ష్మ మైన దానికంటె సూక్ష్మ మైనదీ, స్థూలంకానిదీ అయిన లక్షణం. ఉన్న ఈ ఉనికి=సత్ లక్షణం --- లేకుండుట, మార్పులుచెందుట, క్షీణించుట, నశించుట, తెలియకుండుట అన్న అవాంతరములు లేక అతీతమైనది. ఈ అవాంతరములకు అతీతంగానే సత్=ఉనికి లక్షణాన్ని నిలుపుకొనుట సృష్టియొక్క అమరిక design. ఇందుకు, ఇంకా నాలుగులక్షణములు సృష్టిబీజంలో అమరినయ్. సత్=ఉనికిని చైతన్యవంతంగా చేసికొనుట, ఉనికిచైతన్యమును ప్రకాశింపచేసికొనుట=తెలిసికొనుట, తెలిసిన=ప్రకాశించిన ఉనికిచైతన్యమును జ్ఞానంలో=ఎఱుకలో నిలుపుకొనుట, ఉనికిచైతన్యపు ఎఱుకలో ఆనందించుట=నిశ్చలమగుట. ఈ విధంగా, చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు సత్‌లక్షణపరంగా సృష్టిబీజంలో కలిగినయ్. ఇవి సృష్టిబీజంలోనే పంచీకరణం synthesis అయినయ్. ఇదే సృష్టి తపస్సు. ఇదే సృష్టికర్త బ్రహ్మగారి తపస్సుగా స్థూలంగా శాస్త్రములలో చెప్పబడుతున్నది. పంచీకరణం అర్థంచేసికొందాం. చైతన్యం అంటే సత్=ఉనికిలక్షణంయొక్క చైతన్యమే. ప్రకాశం అంటే సత్=ఉనికి లక్షణంయొక్క ప్రకాశమే. జ్ఞానం అంటే సత్=ఉనికిలక్షణంయొక్క జ్ఞానమే=ఎఱుకయే. ఆనందం అంటే సత్=ఉనికిలక్షణంయొక్క ఆనందమే. అంటే, సృష్టిబీజంలోని నాలుగులక్షణములు సృష్టికి పూర్వమున్న సత్=ఉనికిలక్షణానికే సమన్వయమైనవి. అటువంటి ఈ లక్షణములు

పంచీకరణమైనయ్=విస్తృతమైనయ్. అంటే, సత్=ఉనికిలక్షణమును చైతన్యవంతం చేసికోవాలి. ఎవరు? సృష్టి, సృష్టిలోనిది ఏది ఊహించినా..చెప్పినా అది చైతన్య వంతం చేసికోవాలి. చైతన్యవంతమైన ఉనికిని ప్రకాశింపచేసికోవాలి=తెలియ చేసికోవాలి. ప్రకాశింపచేసికొన్న=తెలియచేసికొన్న ఉనికిచైతన్యమును జ్ఞానంగా =ఎఱుకగా చేసికోవాలి. ఎఱుకలో నిలిపిన ఉనికిచైతన్యమును ఆనందం=ఆంత రంగికపూర్ణత్వంగా నిలుపుకోవాలి. ఇక అన్యం లేదు. లక్షణాత్మకరూపంలోనే ..రూపంతోనే ఆనందం..పూర్ణత్వం. ఇది సృష్టికి ధర్మం, **ధారణాయ శక్యమితి ధర్మమ్,** ధరించేటకు శక్యమైనది. ఇదే ధర్మం=ధరించేటకు శక్యమైనది, అన్యమేదీ ధర్మం కాదు, ధరించేగలిగినది కాదు. సృష్టిబీజంలో ఈ సత్-చైతన్య -ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు, ఈ విధంగా, ఆధ్యాత్మికంగా పంచీకరణ మైనవి. బీజం సృష్టికి అంతటికి రజస్సు=తేజస్సు. ఇంతకు వేఱుగా సృష్టిలేదు ఉండదు ఉండలేదు.

సత్

సత్-చైతన్యము

సత్చైతన్య-ప్రకాశము

సత్చైతన్యప్రకాశ-జ్ఞానము

సత్చైతన్యప్రకాశజ్ఞాన-ఆనందము

జగత్తుయొక్క పుట్టుక-స్థితి-లయములు ఈ ఆధ్యాత్మిక పంచీకరణలక్షణ ములందే ఉపాదాన-అఖిలాధార-పరమేశ్వర తీరుగా ఉన్నవని 10వ శ్లోకంలో చూచాం. అట్లు ఉండాలన్నది సృష్టిబీజంలోని అమరిక. (శ్రీకృష్ణానంద మఠము ప్రచురిం చిన **సృష్టిబీజం** పుస్తకంలో 41, 42 మంత్రములు చూడండి). సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు ఆధ్యాత్మికంగా ఆకాశము, వాయువు, తేజస్సు, ఆపస్ పృథ్వీ అను పంచతన్మాత్రలుగ సృష్టిచేయబడినవి. **తస్య మాత్రం తన్మాత్రమ్.** దానియొక్క సృష్టిధర్మముయొక్క సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణ ములందు నిశ్చయము..సర్వము తన్మాత్రము. పంచతన్మాత్రలు తమతమ ఆధ్యాత్మికలక్షణములతో సృష్టియొక్క సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనందములను ఆధ్యాత్మికలక్షణములనే వ్యక్తంచేస్తూ ఉంటవి. ఈలక్షణములకంటె వేఱుగా పంచమహాభూతములన్న రూపములనుకాని, నామరూపాదులనుకాని వ్యక్తం చేయటం లేదు.

1. ***ఆ స్మృతౌ కాశతే దీప్యతే ఇతి ఆకాశః***. స్మరణలో స్మృతిలో సృష్టిధర్మము యొక్క వెలుగు ఆకాశతన్మాత్ర.

2. ***వాతీతి వాయుః, వా వికల్పేన ఆయుః ఇతి వా వాయుః***. సృష్టిధర్మమును నిలుపగలిగినచోట అన్యదోషములను తరిమివేయునది వాయువుతన్మాత్ర.

సృష్టిధర్మమును నిలుపనిచోట వికల్పమైన ఆయుస్సు= జీవితకాలముయొక్క అనుభవము కూడా వాయువుతన్మాత్ర.

3. **తేజయతీతి తేజః**. తిజ-నిశాతనే. కృశముగ=క్షీణించినదిగా చేయునది. సృష్టి ధర్మమును నిలుపని వికల్పఆయుస్సులో గుణపాఠం అందిస్తూ దోషమును కృశింపజేయునది తేజస్సుతన్మాత్ర. Blessing in disguise.

ఈ మూడు తన్మాత్రలచేత, సృష్టి, తనధర్మమును నిలుపు కార్యం తన అమరికలో సాధించింది. కాని, సృష్టిఅమరికను అందుకోలేని స్థితిగతులలో (ప్రాణు లకు) , ఒక్క అవకాశం సరిపోదు.

4. **అప్నువన్తీతి ఆపః**. ఆప్ఌ-వ్యాప్తౌ. వ్యాపించేనది, విశేషముగా పొంది ఉండునది ఆపస్. సృష్టిఅమరికను అందుకోలేని స్థితిగతులలో అందుకొనే వరకు ప్రవాహరూపంగా ఆ స్థితిగతులలో సృష్టిధర్మమును పొంది నిలుపునది ఆపస్తన్మాత్ర. **సర్వం ఖల్విదం బ్రహ్మ, తజ్జలానీతి ఉపాసీత** (ఛా.ఉ). సర్వము బ్రహ్మలక్షణములైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనందములే అని గ్రహించేటకు సృష్టి ఆపస్-జలపూరితమైన భాగమును organic regionగ అవయవసంబంధ మైన ప్రాణులు పుట్టి గ్రహించుటకు అవకాశములను ప్రవాహరూపంగా అమర్చింది. బ్రహ్మగ్రాహ్యం జలమున్న భూమిపైనే ఉన్నది. సృష్టిలో ఇతరమైన అవయవసం బంధంకాని ప్రాంతములలో inorganic regionsలో ఈ అవకాశం లేదు.

5. **పృథుత్వాత్ పృథ్వీ**. విశాలమైనది కనుక పృథ్వీ. సృష్టిలో భౌతికంగా ఒక అణుమాత్రమైనది భూమి. అట్టి భూమిని విశాలమైనదని అంటున్నది శాస్త్రం. ఆధ్యాత్మికకొలతచేత భూమి విశాలమైనది. సృష్టి ఆపస్‌వలన ఇచ్చే ప్రవాహరూ పమైన అవకాశములలో ఒక్కొక్క అవకాశం పూర్తిగా తరింపచేయునట్లు (అవకాశం) విశాలంగా అందివచ్చుట పృథ్వీతన్మాత్ర.

ఈ ఐదు తన్మాత్రల పంచీకరణం ఈ శ్లోకం మొదట విచారణ చేసికొన్నాం. ఇంకా సూక్ష్మంగా, ఆపస్-పృథ్వీ తన్మాత్రలు ఆకాశ-వాయు-తేజస్, తన్మాత్రల ఒక్కొక్కటితో నిత్యం కలిసి ఉంటవి. అంటే, ఆకాశ-వాయు-తేజస్ తన్మాత్రలతో సృష్టి తన ధర్మమును నిలుపుట ప్రాణులకు ప్రవాహరూపమైన అవకాశములుగా, విశాలమైన అవకాశములుగా నిత్యం వెన్నంటి ఉంటయ్.

పంచీకృతమైన పంచతన్మాత్రలు పంచమహాభూతములుగ, ఆకాశ-వాయు-తేజస్-ఆపస్-పృథ్వీగా స్థూలరూపంగా సృజింపబడినయ్. స్థూలమైన ఆకాశ-వాయు-తేజస్-ఆపస్-పృథ్వీ అను ఐదుమహాభూతములకు ఐదు భౌతికగుణములు వరుసగా శబ్ద-స్పర్శ-రూప-రస-గంధములు ఉన్నయ్. ఈ భౌతికగుణములు ఆధ్యాత్మికంగ తెలియబడునవిగా పంచీకరణమైనవి=విస్తృతమైనవి. ఆధ్యాత్మి కంగ తెలియబడు వీటిని గ్రహించేటానికి, అవయవసంబంధమైన ప్రాణులలో

వరుసగా శ్రోత్ర-త్వక్-చక్షుర్-జిహ్వా-ఘ్రాణ ఇంద్రియములు సృజింపబడినవి. పూర్ణగ్రాహ్యమునకు తగినట్లు, మానవునిలో, ఈ ఐదు ఇంద్రియములు అంతరింద్రియంతో ఆధ్యాత్మికంగా పంచీకరణమైనవి=విస్తృతమైనవి.

ఇప్పటికి ఐదింటి పంచీకరణమును చూచాం.

1. సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనందములు.
2. పృథివ్యాపస్తేజోవాయురాకాశములను పంచతన్మాత్రలు.
3. పృథివ్యాపస్తేజోవాయురాకాశములను పంచమహాభూతములు.
4. శబ్దస్పర్శరూపరసగంధములను పంచభౌతికగుణములు.
5. శ్రోత్రత్వక్ చక్షుర్జిహ్వాఘ్రాణములను పంచజ్ఞానేంద్రియములు.

ఈ ఐదును ఒక్కొక్కటి తమలో తాము ఆధ్యాత్మికంగా పంచీకరణమైనవి. అంతేకాదు. ఈ ఐదుపంచీకరణములు సృష్టిధర్మమైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు ఉపాదానంగా, అఖిలాధారంగా, పరమేశ్వరంగా ఏకరూపంగా పంచీకరణమైనవి=విస్తృతమైనవి. ఇదే, పూర్వాపరములతో సహా పంచమహాభూతములు సమగ్రంగ పంచీకరణమును పొందుట.

ఈ సమగ్రపంచీకరణ మహాభూతములతో (భౌతికమనబడు) శరీరం కలిగింది.

**కర్మసఞ్చితమ్.** బాహ్యప్రవర్తన, బాహ్యచేష్ట, స్థూలమైన కార్యరూపం క్రియ అనబడుతుంది. క్రియకు ఆధారంగా ఉన్న ప్రవృత్తి క్రియలో త్రిగుణాత్మకంగా పెరుగుతుంది. క్రియ అశాశ్వతం. కర్మ ఆధ్యాత్మికస్థానంలో ఆధ్యాత్మికమును నిలుపుకోనీయక బంధిస్తుంది. గొప్పగా సమగ్రంగా పంచీకరణమైన శరీరాన్ని అటువంటి విస్తృతస్థితికి ఎదగనీయక కర్మ గుణకర్మగా బంధిస్తుంది. కర్మబంధమును తొలగించుకొనే ప్రయత్నం=సాధనకూడా కర్మయే, సాధనకర్మ. అంటే, ఆధ్యాత్మికదృష్టిని విడిచి విషయాత్మకదృష్టితో చేసిన ప్రవర్తన, ఆధ్యాత్మికస్థానంలో ఆధ్యాత్మికమును నిలుపుకోనీయక బంధిస్తుంది. ఇటువంటి కర్మలసంపుటి శరీరం.

**శరీరమ్. శీర్యత ఇతి శరీరమ్.** క్షీణిస్తుంది కనుక శరీరం. **శృణాతి కర్మక్షయం కరోతీతి శరీరమ్.** జన్మజన్మలలో గుణకర్మను క్షీణింపచేసి ఉత్తమజన్మలో ఉత్తమ కర్మగా, క్రమంగా సాధనకర్మను ఆచరింపచేస్తుంది కనుక శరీరం.

**సుఖదుఃఖానాం భోగాయతనమ్ ఉచ్యతే.** ఈ శరీరం సుఖదుఃఖముల భోగానికి నిలయం. **భుజ్యతే ఇతి భోగః.** భుజ-పాలనాభ్యవ్యవహారయోః. అనుభవింపబడునది భోగము. శరీరం క్షీణిస్తూ సుఖదుఃఖములను భోగిస్తే భోగం బంధం అవుతుంది. గుణకర్మలను క్షీణింపచేస్తూ సుఖదుఃఖములను అనుభవిస్తే సాధనను ఆనందించే భోగం కుదురుతుంది. జీవుడు బంధపరంగ భోగించే శరీరం, సామాన్యంగా స్థూలశరీరం అనబడుతుంది.

**పఞ్చప్రాణమనోబుద్ధిదశేన్ద్రియసమన్వితమ్,**
**పఞ్చీకృతభూతోత్థమ్, సూక్ష్మాఙ్గం భోగసాధనమ్.**

(పఞ్చ-ప్రాణ-మనస్-బుద్ధి-దశ-ఇన్ద్రియ-సమన్వితమ్) - (పఞ్చీకృత-భూత-ఉత్థమ్) - సూక్ష్మాఙ్గమ్ - భోగసాధనమ్.

**పఞ్చప్రాణ-మనో-బుద్ధి-దశేన్ద్రియ-సమన్వితమ్,**
**పఞ్చీకృత-భూతోత్థమ్, సూక్ష్మాఙ్గం ॥ భోగసాధనమ్. 13**

(పఞ్చప్రాణ-మనో-బుద్ధి-దశేన్ద్రియ-సమన్వితమ్) - (పఞ్చీకృత-భూతోత్థమ్) - (సూక్ష్మాఙ్గమ్) - (భోగసాధనమ్). 13

(పఞ్చప్రాణ-మనో-బుద్ధి-దశేన్ద్రియ-సమన్వితమ్) ఐదుప్రాణములు, మనస్సు, బుద్ధి, పదిఇంద్రియముల సమన్వయమైనది. (పఞ్చీకృత-భూతోత్థమ్) సమగ్రమైన పంచీకరణమును పొందిన పంచమహాభూతములవలన కలిగినది (సూక్ష్మాఙ్గమ్) సూక్ష్మభాగము, (భోగసాధనమ్) భోగమునకు పరికరము. 13

మానుషదేహం ప్రాణ-అపాన-వ్యాన-ఉదాన-సమానములను ఐదుప్రాణములు, మనస్సు, బుద్ధి, వాక్-పాణి-పాద-పాయు-ఉపస్థలను ఐదుకర్మేంద్రియములు, శ్రోత్ర-త్వక్-చక్షుర్-జిహ్వా-ఘ్రాణములను ఐదుజ్ఞానేంద్రియములు ఆధ్యాత్మికముగ సమన్వయమైన ఒక యంత్రాంగం system. ఇంకా 12వ శ్లోకంలో విచారణ ప్రకారం పంచీకరణమైన పంచమహాభూతములవలన కలిగిన భౌతికశరీరము. మానవజన్మ లోని ఈ మానుషదేహానికి ఒక సూక్ష్మాంగం ఉన్నదట. అర్థంచేసికొందాం.

ఆధ్యాత్మికంగ సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు సూక్ష్మంగా ఉన్నవి. వీటిని గుర్తించిన సాధకుడు సుఖదుఃఖములను సాధనవిచారణగా అనుభవించి బంధంలో పడడు. ఇది అతని భోగం. వీటిని గుర్తించని సామాన్యుడు సుఖదుఃఖములను ప్రవృత్తికి ఫలంగా అనుభవించి బంధంలో పడుతాడు. ఇది అతని భోగం. **భుజ్యతే ఇతి భోగః.** అనుభవింపబడునది భోగం.

ఆధ్యాత్మిక సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములకంటె వేఱుగా కల్పించుకొన్న విషయవాసనాస్వరూపం, సామాన్యంగా, సూక్ష్మాంగం=సూక్ష్మ శరీరం అనబడుతుంది. 13

**అనాద్యవిద్యాఽనిర్వాచ్యా, కారణోపాధిరుచ్యతే,**
**ఉపాధిత్రితయాదన్యమ్, ఆత్మానమవధారయేత్.**

(అనాది-అవిద్యా) - అనిర్వాచ్యా - (కారణ+ఉపాధిః) - ఉచ్యతే - (ఉపాధి-త్రితయాత్) - అన్యమ్ - ఆత్మానమ్ - అవధారయేత్.

**అనాద్యవిద్యా ॥ ఽనిర్వాచ్యా, కారణోపాధిర్ ॥ ఉచ్యతే,**

**ఉపాధిత్రితయాద్ ॥ అన్యమ్, ఆత్మానమ్ ॥ అవధారయేత్.** **14**

అనిర్వాచ్యా - అనాద్యవిద్యా - కారణోపాధిః - ఉచ్యతే -- ఉపాధిత్రితయాత్ - అన్యమ్ - ఆత్మానమ్ - అవధారయేత్.

(అనిర్వాచ్యా) నిర్వచించేలేనిది (అనాద్యవిద్యా) అనాదియైన అవిద్య (కారణోపాధిః) కారణశరీరం అని (ఉచ్యతే) చెప్పబడుతున్నది. (ఉపాధిత్రితయాత్) మూడుశరీరములకంటె (అన్యమ్) వేఱైనదిగ (ఆత్మానమ్) ఆత్మను, స్వస్వరూపమును (అవధారయేత్) తెలియవలె..గుర్తించవలె. 14

*12వశ్లోకంలో స్థూలశరీరంగుఱించి చెప్పబడినది. 13వశ్లోకంలో సూక్ష్మశరీరంగుఱించి ఈ శ్లోకంలో కారణశరీరం ఆత్మలగుఱించి చెప్పబడుతున్నది.*

**న విద్యతే ఆత్మానాత్మవివేకః అనేనేతి అవిద్యా.** ఆత్మ..అనాత్మల వివేకం తెలియని స్థితిగతి అవిద్య. ఇది అనాది. అంటే, ఆత్మానాత్మవివేకం తెలియని కారణంవలననే జీవుడు 84లక్షల జీవరాశుల గర్భములలో జన్మనెత్తుతు జనన మరణప్రవాహంలో తిరుగాడుతున్నాడు. జన్మాదివ్యవస్థ అనాత్మరూపం, తనకు స్వరూపం కానిది. ఇది తెలిస్తే జన్మనెత్తవలసిన అవసరం ఉండదు. అనాత్మను ఆత్మగా తెలియుట ఇంకా విపరీతం. విపరీతసహితమైన ఈ అవిద్య ఎప్పటినుండి తనను వెంటాడుకొస్తున్నదో తనకే (జీవునికే) తెలియనంత అనాది. జన్మాదివ్యవస్థకంటె వేఱుగా..ఉత్తమంగా తనకొక ఆత్మస్వరూపం ఉన్నదని ఊహగాకాని సంశయంగాకాని బోధగాకాని తెలిసిఉంటే, తన అనాత్మవ్యవస్థను పరిశీలించి నిర్వచించేవాడు. గ్రుడ్డి ఎద్దు చేలోబడినట్లు, గ్రుడ్డివాడు గ్రుడ్డివానినీ ఊతగా నమ్మిపోయినట్లు జన్మాదివ్యవస్థలన్నీ అజ్ఞానంలో..అవిద్యలో గడచిపోతున్నాయ్. ఈ అవిద్య, సాధారణంగా, కారణశరీరం అనబడుతుంది.

ఈ శ్లోకములలో వివరించి, సాధారణంగా చెప్పబడిన స్థూలశరీరం, సూక్ష్మశరీరం, కారణశరీరం మూడింటిని శరీరత్రయం అని సాధారణంగా అంటారు. శరీరత్రయమునకంటె వేఱైనది ఆత్మ, జీవుని స్వరూపం=నిజరూపం. 14

**పఞ్చకోశాదియోగేన, తత్తన్మయ ఇవ స్థితః,**
**శుద్ధాత్మా నీలవస్త్రాదియోగేన స్ఫటికో యథా.**

(పఞ్చ-కోశ-ఆది-యోగేన) - (తత్-తన్మయః) - ఇవ - స్థితః - (శుద్ధ- ఆత్మా) - (నీల-వస్త్ర-ఆది-యోగేన) - స్ఫటికః - యథా.

**పఞ్చకోశాదియోగేన, తత్తన్మయ ఇవ ॥ స్థితః,**
**శుద్ధాత్మా ॥ నీలవస్త్రాదియోగేన స్ఫటికో । యథా.** **15**

యథా - నీలవస్త్రాదియోగేన - స్ఫటికః -- [తథా] -- శుద్ధాత్మా -

పఞ్చకోశాదియోగేన - తత్తన్మయః ఇవ - స్థితః.

(యథా) ఎట్లు (నీలవస్త్రాదియోగేన) నలుపు మొదలైన రంగువస్త్రముల చేరికచేత (స్ఫటికః) స్ఫటికమో [తథా=అట్లు] (శుద్ధాత్మా) శుద్ధమైన ఆత్మ =స్వస్వరూపం (పఞ్చకోశాదియోగేన) పంచకోశములు మొదలైనవాటి చేరికతో (తత్తన్మయః ఇవ) ఆ రూపమునే పొందినట్లు (స్థితః) ఉన్నది. 15

అవిద్యాస్వరూపములు వివరింపబడుతున్నవి.

**యథా నీలవస్త్రాదియోగేన స్ఫటికః.** నల్లటిగుడ్డమీద తెల్లటిస్ఫటిక పెట్టినప్పుడు, గుడ్డరంగువలన స్ఫటికకూడా నల్లగా కనిపిస్తుంది. ఎఱుపు మొదలైన ఏ రంగుగుడ్డమీద ఉంచితే, స్ఫటిక (తెల్లగాకాక) ఆ గుడ్డరంగుగానే కనపడుతుంది. ఇది స్ఫటికదోషమూ కాదు, స్ఫటికరంగు మారిన దోషమూ కాదు. స్ఫటికకు రంగువస్త్రంతో చేరిన దోషం. ఇది ఉపమానం.

జీవుని భ్రాంతికి పంచకోశములు శాస్త్రం చెపుతున్నది. అర్థంచేసికొందాం.

1. **అన్నమయకోశం.** అన్నంచేత దేహం పోషింపబడుతున్నది. ఆత్మను అన్నమయంగా అనుకొనుట కోశం=ఆవరణ. ఆత్మను అన్నవికారంగా, అన్నంతో మార్పుచెందేదిగా అనుకొనుట అన్నమయకోశం. 2. **ప్రాణమయకోశం.** ప్రాణవాయువును పీల్చి దేహం జీవించిఉన్నది. ఆత్మను ప్రాణమయంగా, ప్రాణవాయువును పీల్చి బ్రతుకునదిగా అనుకొనుట కోశం=ఆవరణ. ఆత్మను ప్రాణవికారంగా, ప్రాణవాయువుతో బ్రతికేదిగా అనుకొనుట ప్రాణమయకోశం. 3. **మనోమయకోశం.** మనస్సుయొక్క చపలమును ఆత్మచైతన్యంగా అనుకొనుట కోశం=ఆవరణ. ఆత్మను మనోవికారంగా అనుకొనుట మనోమయకోశం. 4. **విజ్ఞానమయకోశం.** విషయజ్ఞానమును ఆత్మజ్ఞానంగా అనుకొనుట కోశం=ఆవరణ. విషయప్రవర్తన అనే వికారమును ఆత్మగా పోల్చుకొనుట విజ్ఞానమయకోశం. సైన్సును విజ్ఞానశాస్త్రం అనుట విజ్ఞానమయకోశం. ఎందుకంటే, ఆత్మయొక్క ఎఱుకయే విజ్ఞానం=విశిష్టజ్ఞానం. 5. **ఆనందమయకోశం.** విషయానందం..ఇంద్రియానందమును ఆత్మానందంగా అనుకొనుట కోశం =ఆవరణ. నిశ్చలత్వముచేత పూర్ణమైన ఆత్మను=ఆత్మానందమును విషయానందవికారంగాను ఇంద్రియానందవికారంగాను అనుకొనుట ఆనందమయకోశం.

విషయదృష్టిలో జగత్తు సత్యమని ప్రవర్తిస్తున్నప్పటికి తాను నీతిపరుడనని, సన్మార్గంలో సంచరిస్తున్నవాడనని, ఆధ్యాత్మికదృష్టిగల జ్ఞానుడనని, ఈ విధంగా అనేకతీరులలో ఉంటుంది జీవునిభ్రాంతి. ఆధ్యాత్మికమైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములతో కేవలమైన తాను శుద్ధాత్ముడైనప్పటికీ, విషయదృష్టిలో ఈ పంచకోశములు మొదలైన భ్రాంతిరూపములతో సంబంధం కలిగి ప్రవర్తిస్తున్నందువలన తాను అదే స్వరూపుడన్నట్లు **తత్తన్మయః ఇవ** ఉంటున్నాడు,

తన ఉనికిని గుర్తిస్తున్నాడు, జీవిస్తున్నాడు. 15

**వపుస్తుషాదిభిః కోశైః, యుక్తం యుక్త్యవఘాతతః,**
**ఆత్మానమాన్తరం శుద్ధమ్, వివిచ్యాత్తణ్డులం యథా.**

వపుః - తుషాదిభిః - కోశైః - యుక్తమ్ - (యుక్తి-అవఘాతతః) - ఆత్మానమ్ - ఆన్తరమ్ - శుద్ధమ్ - వివిచ్యాత్ - తణ్డులమ్ - యథా.

**వపుస్ ॥ తుషాదిభిః ॥ కోశైః, యుక్తం ॥ యుక్త్యవఘాతతః,**
**ఆత్మానమ్ ॥ ఆన్తరం శుద్ధమ్, వివిచ్యాత్ ॥ తణ్డులం యథా. 16**

తుషాదిభిః - యుక్తమ్ - తణ్డులమ్ - యథా - - [తథా] - - కోశైః - [యుక్తమ్] - వపుః - ఆన్తరమ్ - శుద్ధమ్ - ఆత్మానమ్ - యుక్త్యవఘాతతః - వివిచ్యాత్.

(తుషాదిభిః) పొట్టు మొదలైనవాటిచేత (యుక్తమ్) కూడినట్టి (తణ్డులమ్) బియ్యమును (యథా) ఎట్లో [తథా=అట్లే] (కోశైః) కోశములచేత, ఆవరణలచేత [యుక్తమ్=కూడినట్టి] (వపుః) దేహధారి (ఆన్తరమ్) ఆంతరంగికమైన (శుద్ధమ్) శుద్ధమైన (ఆత్మానమ్) ఆత్మను (యుక్త్యవఘాతతః) శ్రవణాదియుక్తులచే దంచుట చేత, విచారించుటచేత (వివిచ్యాత్) వేఱుగచేసి గ్రహించవలెను. 16

ఆవరణలను తొలగించుకొనవలెనని బోధ.

వడ్లురూపంలో పొట్టు తవుడు మొదలైనవాటిచేత బియ్యం ఆవరించబడి ఉంటుంది. వడ్లురూపంలో ధాన్యం తినగలిగినది కాదు. అందువలన, వడ్లను దంచి, తదుపరి చెరుగుట మొదలగు ప్రయత్నంచేత పొట్టు తవుడు మొదలగు ఆవరణ పదార్థములను తొలగించి, తినగలిగిన బియ్యంరూపమును చేసికొంటున్నాం. ఇది ఉపమానం.

ఆంతరంగికంలో శుద్ధమైనది ఆత్మ=స్వస్వరూపం. విషయదృష్టితోడి ప్రవర్తనలో పంచకోశాదులైన ఆవరణలచేత ఆవరింపబడి స్వస్వరూపంగా గ్రహించేటానికి తగినది కాదు. తగినది కానందువలననే

**విద్ధి వ్యాధ్యభిమానగ్రస్తం లోకం శోకహతం చ సమస్తమ్.**

ఆవరణల భ్రాంతిని విడువలేక వ్యాధి-అభిమానములవలన కలిగిన శోకంలో లోకంఅంతా తన్నుకులాడుకొంటున్నది. దంచుట మొదలైన ప్రయత్నములతోగాని, యంత్రంలో వేసికాని ఆవరణలను తొలగించినట్లు, ఆధ్యాత్మికసాధనలచేత ఆవరణలను తొలగించుకొనవలె. శ్రవణ-మనన-నిదిధ్యాసనలచేతను శ్రుతి-యుక్తి-అనుభవములచేతను సాధించవలె. శాస్త్రవిచారణవలన, ఆయా ఆవరణల స్థితిగతులలో తనకు వేఱైన అధిష్ఠాన=అధికసత్యమైన స్వరూపం ఉన్నదని నిశ్చయం కుదురుతుంది. అప్పుడు, అల్పసత్యములు= తాత్కాలికసత్యములు=భ్రాంతిసత్య

ములు అయిన విషయములనుండి దృష్టి మరలుతుంది. జీవుడు సాధకుడై తాను గ్రహించేదగిన..ధరించేగలిగిన స్వరూపమును=ఆత్మను పొందుతాడు. 16

**సదా సర్వగతోఽప్యాత్మా, న సర్వత్రావభాసతే,**
**బుద్ధావేవావభాసేత, స్వచ్ఛేషు ప్రతిబిమ్బవత్.**

సదా - (సర్వ-గతః) - అపి - ఆత్మా - న - సర్వత్ర - అవభాసతే - బుద్ధౌ - ఏవ - అవభాసేత - స్వచ్ఛేషు - ప్రతిబిమ్బవత్.

**సదా సర్వగతోఽప్యాత్మా, న సర్వత్రావభాసతే,**
**బుద్ధావేవావభాసేత, స్వచ్ఛేషు ॥ ప్రతిబిమ్బవత్. 17**

ఆత్మా - సదా - సర్వగతః అపి - సర్వత్ర - న అవభాసతే - - బుద్ధౌ ఏవ - అవభాసేత - - స్వచ్ఛేషు - ప్రతిబిమ్బవత్.

(ఆత్మా) ఆత్మ (సదా) ఎల్లప్పుడు (సర్వగతః అపి) సర్వవ్యాపి అయినప్పటికి (సర్వత్ర) అంతట (న అవభాసతే) ప్రకాశించుటలేదు, తెలియుటలేదు. (బుద్ధౌ ఏవ) బుద్ధియందే, అవగాహనయందే (అవభాసేత) ప్రకాశిస్తున్నది, తెలుస్తున్నది (స్వచ్ఛేషు) స్వచ్ఛమైనవాటియందు (ప్రతిబిమ్బవత్) ప్రతిబింబమువలె. 17

*శ్రవణమననాది సాధన ఎందుకు? ఆత్మ తనకు తానే ప్రకాశించేవమ్బను కదా! అన్న ప్రశ్నకు సమాధానం ఈ శ్లోకం చెపుతున్నది.*

**స్వచ్ఛేషు ప్రతిబిమ్బవత్.** ఉపమానం అర్థంచేసికొందాం. స్వచ్ఛమైన నీరు అద్దం మొదలైనవాటిలో ప్రతిబింబం కనబడుతుంది. మురికినీటిలోను కెలికిన ..చెదిరిన నీటిలోను కనబడదు. మాలిన్యం ఆవరించిన అద్దంలోను ప్రతిబింబం కనబడదు.

ఆత్మ=అహంశబ్దవాచ్యం= నేను అన్న తన నిజరూపం సర్వవ్యాపి. అంటే అర్థంచేసికొందాం. బయట చెట్టు పుట్ట కొండలన్నిటిలో ఆత్మ ఉన్నదనీ, నేను ఉన్నాననీ అర్థం కాదు. తన ఉనికిని విశాలంగ గుర్తించుటయే ఆత్మ. చెట్టు పుట్ట కొండ మొదలైనవాటికి వాటి ఉనికి తెలియదు. కనుక, అవి జడపదార్థములు. జీవుడు ఏఏ విషయములలో ఏఏ ఇంద్రియములతో ఏఏ విధంగా దేశకాలపరిస్థితులలో ప్రవర్తిస్తున్నాడో, అక్కడక్కడెల్ల ఆత్మ వ్యాపించి ఉన్నది. నేను దుఃఖిస్తూ ఉన్నాను, నేను భోగిస్తూ ఉన్నాను మొదలైన విషయములలోను, నేను చూస్తూ ఉన్నాను, నేను నడుస్తూ ఉన్నాను మొదలైన ఇంద్రియచేష్టలలోను, నేను ఇంటిలో ఉన్నాను, నేను బయట ప్రయాణంలో ఉన్నాను మొదలైన దేశవ్యవస్థలు ఇత్యాదులన్నీ సర్వం అనబడుతయ్. ఈ సర్వమునందు దుఃఖిస్తూ..భోగిస్తూ అన్న విషయములు, చూస్తూ ..నడుస్తూ అన్న ఇంద్రియచేష్టలు, ఇంటిలో..బయటప్రయాణంలో అన్న దేశ

వ్యవస్థ మొదలైనవన్నీ అశాశ్వతములు. అశాశ్వతములైన అన్నిటిలో సదా= శాశ్వతంగా అంతటా నేను ఉన్నాను అన్న ఆత్మభావన ఉన్నది. కానీ, దుఃఖిస్తూ ..భోగిస్తూ మొదలైన విషయముల దృష్టి, మోస్తూ..నడుస్తూ మొదలైన ఇంద్రియ చేష్టలసందడిలో, ఇంటిలో..బయట అన్న భేదవ్యవస్థలలో కొట్టుమిట్టాడుతూ, తత్తన్మయుడైనందువలన శాశ్వతంగా సదా స్మృతిలో ఉన్న స్వరూపం అవగాహన కావటంలేదు. అశుద్ధమై చలించేవాటిలో ప్రతిబింబం కనబడదు.

**బుద్ధౌ ఏవ అవభాసేత.** పైన విచారణచేసికొన్న జగత్తు సర్వమునకు నేను ఉన్నాను అన్న ఆత్మస్ఫురణ ఆధారమై ఉన్నది. అంటే, ఆత్మస్ఫురణ లేకుంటే జగత్తుకు ఉనికి లేదు. నేను ఉన్నాను అన్న ఆత్మస్ఫురణ తీసివేస్తే దుఃఖిస్తూ అన్న విషయానికి ఉనికి లేదు. ఆధారమును గుర్తించేక ఆధేయజగత్తును గుర్తించుట శుద్ధఅజ్ఞానం అని విచారణచేత అవగాహనచేసికొనే సాధకునికి తన స్ఫురణలోనే ఆత్మ ప్రకాశిస్తుంది=తెలియబడుతుంది. 17

**దేహేన్ద్రియమనోబుద్ధిప్రకృతిభ్యో విలక్షణమ్,**
**తద్వృత్తి-సాక్షిణం విద్యాత్, ఆత్మానం రాజవత్సదా.**

(దేహ-ఇన్ద్రియ-మనస్-బుద్ధి-ప్రకృతిభ్యః) - విలక్షణమ్ - తత్ - (వృత్తి- సాక్షిణమ్) - విద్యాత్ - ఆత్మానమ్ - రాజవత్ - సదా.

**దేహేన్ద్రియమనోబుద్ధిప్రకృతిభ్యో । విలక్షణమ్,**
**తద్ వృత్తి-సాక్షిణం ॥ విద్యాత్, ఆత్మానం ॥ రాజవత్ ॥ సదా. 18**

సదా - దేహేన్ద్రియమనోబుద్ధిప్రకృతిభ్యః - విలక్షణమ్ - [యత్] - - తత్ - - రాజవత్ - - ఆత్మానమ్ - వృత్తిసాక్షిణమ్ - విద్యాత్.

(సదా) ఎల్లప్పుడు (దేహేన్ద్రియమనోబుద్ధిప్రకృతిభ్యః) దేహము ఇంద్రియములు మనస్సు బుద్ధి మొదలైనవాటి ప్రకృతులకంటె (విలక్షణమ్) వ్యతిరేకలక్షణం [యత్= ఏది జీవుడు గుర్తించాడో] (తత్) దానిని, ఆ ప్రకృతివిలక్షణమును (రాజవత్) రాజునువలె (ఆత్మానమ్) ఆత్మనుగురించిన (వృత్తిసాక్షిణమ్) దేహేంద్రియాదుల వృత్తికి సాక్షిత్వము =ద్రష్టాలక్షణముగా (విద్యాత్) తెలియుము. 18

ఆత్మావగాహన సాక్షిత్వం మూలంగా చెప్పబడుతున్నది.

**రాజవత్.** ఉదాహరణను అర్థంచేసికొందాం. రాజు అనేకస్థానములలో పర్యవేక్షణ చేస్తాడు. 1. తనలో తాను తన రాజ్యమునుగురించి ఏకాంతంలో ఆలోచన చేస్తాడు. 2. అంతరంగికంగా మహామంత్రితో ఆలోచన చేస్తాడు. 3. సభలో ఇతరమంత్రులతో విచారణచేస్తాడు. 4. గూఢచారులను పంపి, విషయం సేకరించి విచారణచేస్తాడు. 5. తాను స్వయంగా రాజప్రాంగణంలో తిరుగుతూ తన

యంత్రాంగం ఎట్లు పనిచేస్తున్నదో చూచుకొంటాడు. 6. తాను స్వయంగా రాజ్యంలో పర్యటనచేస్తూ పరిశీలనచేస్తాడు. 7. బయట సామంతరాజులను తనకు అనుకూలంగా..వ్యతిరేకించేకుండగా కాపాడుకొంటుంటాడు.

ఇన్ని వివిధస్థానములలో విచారణచేయుటలో తాను వాటికి అధిపతియైన రాజును అని గుర్తించుకొంటు, రాజుహోదాలో ప్రవర్తిస్తున్నాడు. ఆయా స్థానముల చేత తాను పతనంచెందక ప్రవర్తిస్తున్నాడు.

**దేహేన్ద్రియమనోబుద్ధిప్రకృతిభ్యః విలక్షణం యత్ తత్ ఆత్మానం వృత్తిసాక్షిణమ్ విద్యాత్.** మార్పులుచెందుతూ పెరుగుతూ క్షీణించి నశించేుట దేహంయొక్క ప్రకృతి. ఇటువంటి దేహంలో నశించేక=మరణించేక ఉండాలన్న రూపాన్ని సదా నిలుపుకొంటున్నాడు జీవుడు. ఇది దేహప్రకృతికి విలక్షణం= వ్యతిరేకలక్షణం. జీవుడు ఈ రెండులక్షణముల మధ్య నిశ్చయంకాక, తాను మరణించేవాడో శాశ్వతుడో తెలియలేక, మరణమునకు భయపడుతూ జీవిస్తుంటాడు. దేహప్రకృతికి వ్యతిరేకలక్షణమైన అమృతం=నాశరహితం అయిన ఆత్మకు, దేహమును సాక్షిగా చూస్తూ తన స్వరూపమును గుర్తిస్తున్న ప్రకృతివృత్తిని సాక్షిత్వముగా తెలియవలె. అర్థంచేసికొందాం.

జీవుని విషయదృష్టిలో ఇంద్రియములు విషయములనే గ్రహిస్తున్నవి. ఇది ఇంద్రియప్రకృతి. ఫలితంగా కలుగుతున్న సుఖదుఃఖాదులవలన బాధ జీవునికి బాధగా తెలుస్తున్నది. బాధపడుతున్నాడే కాని ముక్తిమార్గం కనపడుట లేదు. బాధను కలిగించేుట ఇంద్రియప్రకృతి అయితే దానిని గుర్తించి తప్పించుకోవాలనుట ప్రకృతికి విలక్షణం=వ్యతిరేకలక్షణం. ఇది ఆత్మకు, స్వరూపమును గుర్తిస్తూ, ఇంద్రియముల ప్రకృతివృత్తికి సాక్షిగా ఉన్న సాక్షిత్వముగా తెలియవలె.

మనస్సు విషయజ్ఞానంతో చపలంగా ప్రవర్తిస్తున్నప్పటికి, తనదే పూర్ణ జ్ఞానమన్నట్లు ప్రవర్తిస్తుంది. ఇది మనస్సుప్రకృతి. తన మనస్సు నిలవటంలేదనీ, అందువలన తనకు బాధ, స్వరూపభంగం కలుగుతున్నదనీ జీవుడు కొట్టుమిట్టాడుతుంటాడు. ఇది, మనస్సుయొక్క ప్రకృతికి జీవుని విలక్షణం=వ్యతిరేక లక్షణం. ఇది, ఆత్మకు, స్వరూపమును గుర్తిస్తూ, మనస్సుయొక్క ప్రకృతివృత్తికి సాక్షిగా ఉన్న సాక్షిత్వముగా తెలియవలె.

విషయదృష్టిలో జీవుని బుద్ధి తన అవగాహన..నిశ్చయం విషయపరంగానే చేస్తుంది. ఇది బుద్ధికి ప్రకృతి. బుద్ధినిశ్చయములు తనకు స్వరూపభంగంగా, చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకొన్నట్లు అవుతున్నదని జీవుడు గుర్తిస్తున్నాడు. ఇది బుద్ధిప్రకృతికి జీవుని విలక్షణం=వ్యతిరేకలక్షణం. ఇది, ఆత్మకు, స్వరూపమును గుర్తిస్తూ, బుద్ధియొక్క ప్రకృతివృత్తికి సాక్షిగా ఉన్న సాక్షిత్వంగా తెలియవలె.

ఆత్మకు సాక్షిగా జేరుగుతున్న దేహేంద్రియమనోబుద్ధుల ప్రకృతిని

జీవుడు సాక్షిగా, ఇట్టి విచారణలో, బాధరూపంలోనైనా బోధరూపంలోనైనా గుర్తించినపుడు, జీవునికి ప్రకృతిని తప్పించుకొనే తెలివి తెలిసివస్తుంది. అర్థం చేసికొందాం. జీవుని సాక్షిత్వం బాధను గుర్తించేవఱకే కాని, బాధనుండి బయట పడే తెలివిని అందుకోలేదు. తాను గుర్తించినది ఆత్మతేజస్సుచేతనేననీ, ఆత్మసా క్షిత్వమునేననీ గుర్తించినప్పుడు, జీవుడు జీవభావపుపక్షం కాక ఆత్మభావపుపక్షం చేరినవాడవుతున్నాడు. అప్పుడు, ప్రకృతిబాధనుండి బయటపడే తెలివి ఆత్మ తేజస్సు=స్వస్వరూపతేజస్సువలన తనంతటఁ తానే తెలియవస్తుంది. 18

**వ్యాపృతేష్విన్ద్రియేష్వాత్మా, వ్యాపారీవావివేకినామ్,**
**దృశ్యతేఽభ్రేషు ధావత్సు, ధావన్నివ యథా శశీ.**

వ్యాపృతేషు - ఇన్ద్రియేషు - ఆత్మా - వ్యాపారీ - ఇవ - అవివేకినామ్ - దృశ్యతే - అభ్రేషు - ధావత్సు - ధావన్ - ఇవ - యథా - శశీ.

**వ్యాపృతేష్విన్ద్రియేష్వాత్మా, వ్యాపారీవావివేకినామ్,**
**దృశ్యతే ॥ ఽభ్రేషు ధావత్సు, ధావన్నివ యథా ॥ శశీ. 19**

యథా - అభ్రేషు - ధావత్సు - శశీ - ధావన్ ఇవ - [దృశ్యతే] - - [తథా] - - ఇన్ద్రియేషు - వ్యాపృతేషు - అవివేకినామ్ - ఆత్మా - వ్యాపారీ ఇవ - దృశ్యతే.

(యథా) ఎట్లైతే (అభ్రేషు) మేఘములు (ధావత్సు) పరుగెత్తుతున్నవికాగా (శశీ) చంద్రుడు (ధావన్ ఇవ) పరుగెత్తుతున్నట్లు [దృశ్యతే=కనబడుతున్నదో] [తథా=అట్లే] (ఇన్ద్రియేషు) ఇంద్రియములు (వ్యాపృతేషు) విషయములందు వ్యాపించుచుండగా (అవివేకినామ్) ఆత్మానాత్మవివేకం లేనివారికి (ఆత్మా) ఆత్మ (వ్యాపారీ ఇవ) విషయప్రవర్తన కలిగినదానివలె (దృశ్యతే) కనబడుతున్నది. 19

*ఆత్మ సాక్షి అయితే విషయప్రవర్తన కలిగినట్లు జీవునికి ఎందుకు అనిపిస్తున్నది? ఎందుకో ఈ శ్లోకం సమాధానం చెపుతున్నది.*

**అభ్రేషు ధావత్సు శశీ ధావన్ ఇవ.** ఉపమానం అర్థంచేసికొందాం. మేఘములు పరుగెత్తుతుంటె వాటి వెనుకగా కనబడుతున్న చంద్రుడు పరుగెత్తుతున్నట్లు కనబడుతుంది. పిల్లలు చంద్రుడు పరుగెత్తుతున్నాడని సంతోషంతో గంతులు పెడుతారు. వాస్తవంలో చంద్రునికి మేఘములకు మధ్య చాలదూరం ఉన్నది, సంబంధమే లేదు. ఇది దర్శనదోషమే, దృశ్యదోషం కాదు.

విషయప్రవృత్తిలో విషయములలో వ్యాపించి చంచలంగా ప్రవర్తించేవి ఇంద్రియములు. చూస్తూ వస్తూ పోతూ తింటూ ఆలోచిస్తూ అని ఇంద్రియములు మార్చుకొంటూ చెట్టాపట్టాలేసికొని పోయినట్లు, వ్యూహబద్ధంగా కదిలినట్లు ప్రవర్తిస్తుంటవి. అంతటా స్ఫురిస్తున్న నేను ఉన్నాను అన్న ఆత్మఉనికికి ఇంద్రియ

ముల చలనచంచలములు లేవు. కాని, జీవుని వ్యక్తీకరణ నేను చూస్తూ ఉన్నాను, నేను వస్తూ ఉన్నాను అని ఇంద్రియచేష్టలను ఉనికితో కలిపి జేరుగుతున్నందు వలన, ఉనికి-ఇంద్రియచేష్టల విభాగం తెలియక, ఇంద్రియముల చలనచంచల ములు ఆత్మకే=స్వరూపానికే ఉన్నట్లు భ్రాంతిలోనే ఉంటూంటాడు. ఆత్మకు ఇంద్రియచేష్టలకు ఉనికి-చేష్టలన్నంత వ్యత్యాసం, ఆత్మ-అనాత్మ అన్నంత వ్యత్యాసం, పరస్పరం వ్యతిరేకం అన్నంత దూరం. కనుక, ఇంద్రియముల చలన చంచలములు ఆత్మకు ఉండవు, ఉండలేవు. 19

**ఆత్మచైతన్యమాశ్రిత్య, దేహేన్ద్రియమనోధియః,**
**స్వకీయార్థేషు వర్తన్తే, సూర్యాలోకం యథా జనాః.**

(ఆత్మ-చైతన్యమ్) - ఆశ్రిత్య - (దేహ-ఇన్ద్రియ-మనస్-ధియః) - (స్వకీయ-అర్థేషు) - వర్తన్తే - (సూర్య-ఆలోకమ్) - యథా - జనాః.

**ఆత్మచైతన్యమ్ ॥ ఆశ్రిత్య, దేహేన్ద్రియమనోధియః,**
**స్వకీయార్థేషు ॥ వర్తన్తే, సూర్యాలోకం ॥ యథా జనాః. 20**

యథా - జనాః - సూర్యాలోకమ్ - - [తథా] - - దేహేన్ద్రియమనోధియః - ఆత్మచైతన్యమ్ - ఆశ్రిత్య - స్వకీయార్థేషు - వర్తన్తే.

(యథా) ఏవిధంగా (జనాః) జనులు (సూర్యాలోకమ్) సూర్యప్రకాశమునో [తథా=అదేవిధంగా] (దేహేన్ద్రియమనోధియః) దేహేంద్రియమనోబుద్ధులు (ఆత్మచైతన్యమ్) ఆత్మచైతన్యమును (ఆశ్రిత్య) ఆశ్రయించి (స్వకీయార్థేషు) వాటి ప్రయోజనములందు (వర్తన్తే) ప్రవర్తిస్తున్నవి. 20

*ఆత్మకు విషయప్రవర్తన కలిగినట్లు ఎందుకు జీవునికి అనిపిస్తున్నదో ఈ శ్లోకం ఇంకొక ఉపమానంతో బోధిస్తున్నది.*

**యథా జనాః సూర్యాలోకమ్.** సూర్యునిప్రకాశం లేకుంటే జనులు భూమి మీద ఏ పనిని చేయలేరు. సూర్యుని ప్రకాశం వెలుతురుగానే కాక, భూమిని అయస్కాంతంగా చేసి తనచుట్టు త్రిప్పుకొనుటకు, భూమి తనచుట్టు తాను తిరుగుటకు ఉత్తరదక్షిణధ్రువములను కల్పించి భూమియొక్క ప్రయోజనముల నన్నిటిని నిలుపుతున్నది. ఇందుమూలంగా జనుల ప్రయోజనములనన్నిటిని నిలుపుతున్నది. కానీ, సామాన్యజనులు సూర్యప్రకాశమే తెలియక, కనపడుతున్న వెలుగునైన లెక్కించేక, వారి ప్రయోజనములన్నీ వారి స్వప్రకాశంవలననే జేరుగుతున్నట్లు అనుకొంటూ జీవిస్తూంటారు. ఇది ఉపమానం.

దేహేంద్రియమనోబుద్ధులకు ఆత్మవలన ఆధ్యాత్మికంగ చైతన్యం కలుగు తున్నది. అర్థంచేసికొందాం. లోకంలో దేనికైనా స్వశక్తి లేదు. బయటనుండి

విద్యుచ్ఛక్తినో యాంత్రికశక్తినో, hydraulic నీటిసంబంధమైన శక్తినో ప్రయోగించాలి. అప్పటికి ప్రయోగించినంతవఱకే పనిచేస్తుంది, శక్తిని వేఱుచేస్తే ఇక పనిచేయలేదు, కదలలేదు. జీవప్రాణులు ఆవిధంగా లేవు. వాటి కదలికలక న్నిటికి ఎల్లప్పుడు లోపలనుండి శక్తి తెగకుండగ వస్తున్నది. మించి, సంకల్పం చేత చేయలేని పనిని సాధించేగలుగుతాడు. భౌతికంగాను బాహ్యలోకంలోనేకాక, కేవలఆధ్యాత్మికంగా, తనకు అందనిది అనుకొన్న ఆత్మజ్ఞానమునే సాధించే గలుగుతాడు. ఏ పనికైనా, నేను చేస్తూ ఉన్నాను అని ప్రవర్తించేటప్పుడు చేస్తూ అన్నది చేష్ట..పనిఅంశం. నేను ఉన్నాను అన్నది ఉనికిఅంశం. ఉనికిఅంశం తీసి వేస్తే చేస్తూ అన్న చేష్టఅంశానికి ఉనికి లేదు. ఈ విధంగా, కర్మ ఉనికిఅంశాన్ని ఆధారంచేసికొని ఉన్నది. అయినా, ప్రజలందఱు, దేహేంద్రియమనోబుద్ధులే స్వచైతన్యంతో తమ ప్రయోజనములను సిద్ధింపచేసికొంటున్నవని అనుకొం టారు. తమ ప్రయోజనములన్నీ బయట విషయములలోనే విషయముల తోనే అనే విషయదృష్టికలవారు కనుక వారి భావనల తీరు అట్లే ఉంటుంది. సాధకునికి కావలసినది అనుకొనుట కాదు, సత్యం. 20

**దేహేన్ద్రియగుణాన్ కర్మాణి, అమలే సచ్చిదాత్మని,**
**అధ్యస్యన్త్యవివేకేన, గగనే నీలతాదివత్.**

(దేహ-ఇన్ద్రియ-గుణాన్) - కర్మాణి - అమలే - సచ్చిదాత్మని - అధ్యస్యన్తి - అవివేకేన - గగనే - నీలతాదివత్.

**దేహేన్ద్రియగుణాన్ ॥ కర్మాణి, అమలే ॥ సచ్చిదాత్మని,**
**అధ్యస్యన్త్యవివేకేన, గగనే ॥ నీలతాదివత్. 21**

గగనే - నీలతాదివత్ -- అవివేకేన - అమలే - సచ్చిదాత్మని - దేహేన్ద్రియగుణాన్ - కర్మాణి - అధ్యస్యన్తి.

(గగనే) ఆకాశమునందు (నీలతాదివత్) నలుపు..నీలంరంగు, దూరంగ ఉండుట మొదలైనవి ఆరోపణచేసినట్లు (అవివేకేన) అవివేకంచేత (అమలే) దోషంలేని (సచ్చిదాత్మని) ఉనికిచైతన్యములు కల ఆత్మయందు (దేహేన్ద్రియగుణాన్) దేహేం ద్రియముల గుణములను (కర్మాణి) కర్మలను (అధ్యస్యన్తి) అధ్యాసచేస్తున్నారు, ఆరోపణచేస్తున్నారు. 21

*ఆత్మ చైతన్యం ఆధారంగా చేష్టలలో ప్రవర్తిస్తున్నప్పటికి, దేహేంద్రియ మనోబుద్ధులకు సొంతంగా చైతన్యం ఉన్నట్లు జీవుడు అనుకొంటున్నాడని క్రిందటి శ్లోకంలో చూచాం. ఈ శ్లోకం జీవుని ఇంకొక విపరీతం బోధచేస్తున్నది. దేహేంద్రి యముల గుణములు..కర్మల మాలిన్యమును ఆత్మ పై ఆరోపణచేస్తున్నాడని బోధ.*

**గగనే నీలతాదివత్.** ఉపమానం అర్థంచేసికొందాం. ఆకాశమునకు ఏ రంగు లేదు. కంటికి కనబడనిది. సర్వవ్యాపి, తనచుట్టు చుట్టి ఉన్నది. ఇటువంటి ఆకాశం ఎక్కడో పైన కనబడుతున్నదనీ, నీలంరంగు కలిగిందనీ అంటారు. ఇవి ఆరోపణలు.

సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనందములు ఆధ్యాత్మికలక్షణములుగ కల ఆత్మ నిర్మలమైనది, అన్యస్పర్శ=బాహ్యస్పర్శవలన కలిగే దోషములేవీ లేనిది. కర్మలో ప్రవర్తించే దేహేంద్రియమనోబుద్ధులకు సత్త్వరజస్తమో గుణములు ఉంటయ్. ఇవి జీవుడు అనాదిజన్మసంస్కారంలో ప్రోగుచేసినవి. గుణములు.. కర్మల వలయంలో తన చిత్తానికి..చేష్టలకు వివిధరంగులు..రూపములు కల్పించుకొం టాడు. కంటికి కనపడని సూక్ష్మాతిసూక్ష్మము అభౌతికము అయిన తన ఆత్మస్వ రూపమును భౌతికవిషయరూపములలోకి తెచ్చి కనబడవలె అంటాడు. నేను ఉన్నాను అన్న ఉనికిరూపంలో ఉనికిచైతన్యంలో ఉనికిఆనందంలో సర్వవ్యాపియైన తనను విషయములలో ఉండుట చైతన్యం తెలియుట ఎఱుక ఆనందం అంటున్నాడు. కర్మలబంధం ఆత్మకు ఆరోపించి ఆత్మ బాధపడుతున్నదని అంటాడు. ఈ విధంగా, దేహేంద్రియమనోబుద్ధుల గుణములను కర్మలను సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణాత్మకస్వరూపమైన తన నిజరూపంమీద జీవుడు అవివేకంచేత ఆరోపణ చేసికొంటాడు. 21

**అజ్ఞానాన్మానసోపాధేః, కర్తృత్వాదీని చాత్మని,**
**కల్ప్యన్తేఽమ్బుగతే చన్ద్రే, చలనాది యథాఽమ్భసః.**

అజ్ఞానాత్ - (మానస-ఉపాధేః) - (కర్తృత్వ-ఆదీని) - చ - ఆత్మని - కల్ప్యన్తే - అమ్బుగతే - చన్ద్రే - చలనాది - యథా - అమ్భసః.

**అజ్ఞానాన్ ॥ మానసోపాధేః, కర్తృత్వాదీని చ్ఛాత్మని,**
**కల్ప్యన్తే ॥ ఽమ్బుగతే చన్ద్రే, చలనాది యథా ॥ ఽమ్భసః. 22**

యథా - అమ్భసః - చలనాది - అమ్బుగతే - చన్ద్రే - కల్ప్యన్తే - - [తథా] - - అజ్ఞానాత్ - మానసోపాధేః - కర్తృత్వాదీని - ఆత్మని - [కల్ప్యన్తే].

(యథా) ఎట్లు (అమ్భసః) నీటియొక్క (చలనాది) కదలిక మొదలైనవి (అమ్బుగతే) నీటిలో ఉన్న..కనబడుతున్న (చన్ద్రే) చంద్రునియందు (కల్ప్యన్తే) కల్పిస్తున్నారో [తథా=అట్లే] (అజ్ఞానాత్) అజ్ఞానంవలన (మానసోపాధేః) మనస్సు దేహములయొక్క (కర్తృత్వాదీని) కర్తృత్వము మొదలైనవాటిని (ఆత్మని) ఆత్మ యందు [కల్ప్యన్తే=కల్పిస్తున్నారు]. 22

ఆత్మమీద ఆరోపణలనే ఈ శ్లోకంకూడా చెపుతున్నది.

**యథా అమ్భసః చలనాది అమ్బుగతే చన్ద్రే కల్ప్యతే.** ఉపమానం అర్థంచేసికొందాం. నీరు కదులుతుంటే, నీటిలో పడిన చంద్రప్రతిబింబం కదిలినట్లు కనబడుతుంది. చంద్రుడు నీటిలో లేడు, నీటిలో కదలటం లేదు నింగిలో కదలటం లేదు. నీటికదలికను ప్రతిబింబంలో చూచి చంద్రుడే కదులుతున్నట్లు చేప్పట్లుకొట్టి కేరింతలుకొడుతు పిల్లలు ఆనందిస్తారు.

విషయాత్మకమైనా ఆధ్యాత్మికమైనా, గ్రహించుట అన్నది ఆత్మకు ప్రతిబింబం. నిజానికి ఆత్మకు గ్రహించేట..గ్రహింపబడుట అన్న వ్యత్యాసంకాని వ్యాపారం కాని లేదు. దేహేంద్రియమనోబుద్ధులకు కర్మలను చేయటంలో కర్తృత్వ భోక్తృత్వములన్నంత చలనచపలములు ఉంటయ్. కర్మప్రవర్తనలో గ్రహించేట కర్తృత్వభోక్తృత్వములతో చలనచపలములతోనే ఉంటుంది. దీనికి అజ్ఞానం కారణం, అంటే ఆత్మజ్ఞానం లేకుండుట కారణం. అజ్ఞానంచేత కర్తృత్వభోక్తృత్వపు చలన చపలములు నిశ్చలమైన ఆత్మమీద ఆరోపించేకొని స్వరూపం పోగొట్టుకొన్నట్లు బాధపడుతారు. 22

**రాగేచ్ఛాసుఖదుఃఖాది, బుద్ధౌ సత్యాం ప్రవర్తతే,**
**సుషుప్తౌ నాస్తి తన్నాశే, తస్మాద్బుద్ధేస్తు నాత్మనః.**

(రాగ-ఇచ్ఛా-సుఖ-దుఃఖ-ఆది) - బుద్ధౌ - సత్యామ్ - ప్రవర్తతే - సుషుప్తౌ - న - అస్తి - తత్ - నాశే - తస్మాత్ - బుద్ధేః - తు - న - ఆత్మనః.

**రాగేచ్ఛాసుఖదుఃఖాది, బుద్ధౌ సత్యాం ॥ ప్రవర్తతే,**
**సుషుప్తౌ నాస్తి ॥ తన్నాశే, తస్మాద్ ॥ బుద్ధేస్తు నాత్మనః. 23**

బుద్ధౌ - సత్యామ్ - రాగేచ్ఛాసుఖదుఃఖాది - ప్రవర్తతే - - సుషుప్తౌ - తత్ - నాశే - న అస్తి - - తస్మాత్ - బుద్ధేః తు - న ఆత్మనః.

(బుద్ధౌ) బుద్ధి (సత్యామ్) జాగ్రత్స్వప్నములలో అవగాహన చేసి నిశ్చయించి ఉండగా (రాగేచ్ఛాసుఖదుఃఖాది) రాగము ఇచ్ఛ సుఖము దుఃఖము మొదలైనవి (ప్రవర్తతే) ప్రవర్తిస్తున్నది (సుషుప్తౌ) గాఢనిద్రలో (తత్) అది, ఆ బుద్ధి (నాశే) లయం కాగా (న అస్తి) రాగాదుల సమూహం లేదు. (తస్మాత్) అందువలన (బుద్ధేః తు) బుద్ధియొక్క ప్రవర్తన/ధర్మం (న ఆత్మనః) ఆత్మది కాదు. 23

*బుద్ధికంటె ఆత్మ వేఱని నిరూపణ.*

విషయప్రవర్తనలో విషయములందు మిక్కిలిప్రీతి, కోరిక, ఉండక తప్పదన్న ఇచ్ఛ, వీటికి ఫలితంగా సుఖదుఃఖములు మొదలైన ద్వంద్వములు ఉంటయ్. వీటిని బుద్ధి అవగాహనచేస్తుంది, సత్యములని నిశ్చయంచేస్తుంది. బుద్ధియొక్క ఈ ప్రవర్తన జాగ్రత్స్వప్న అవస్థలలో ఉంటుంది. సుషుప్త్యవస్థలో బుద్ధి ప్రవర్తించేదు.

కనుక, సుషుప్తిలో రాగాదులు, సుఖదుఃఖాది ద్వంద్వములు లేవు. అంటే ఏమి తెలుస్తున్నది? బుద్ధియొక్క ఉనికి..ధర్మము ఒక అవస్థలో ఉండి, వేఱొక అవస్థలో ఉండవు, అనగా నిత్యం కాదు. బుద్ధి గ్రహించే రాగాది విషయములు, సుఖదుః ఖాది ద్వంద్వములుకూడా ఒక అవస్థలో ఉండి వేఱొక అవస్థలో లేనివి, అనగా నిత్యం కాదు. ఉన్నకాలంలోనైనా స్వతస్సిద్ధం కావు, నేను మిక్కిలి ప్రీతితో ఉన్నాను, నేను కోరికతో ఉన్నాను, నేను సుఖినై ఉన్నాను, నేను దుఃఖినై ఉన్నాను మొదలైన దిగా రాగేచ్ఛాసుఖదుఃఖాదుల ప్రవర్తన నేను ఉన్నాను అన్న ఉనికిఅంశ మును=ఆత్మను ఆధారంచేసికొని ఉన్నది. అంటే, ఆత్మను ఆధారంచేసికొని బుద్ధికి ఉనికి..ధర్మములు ఉన్నయ్. బుద్ధి ఆధారంగా ఆత్మకు ఉనికి కాదు. అందువలన, బుద్ధియొక్క ఉనికి..ధర్మములు ఆత్మవి కావు. బుద్ధి అనాత్మ. రాగాదులు, సుఖ దుఃఖాదులు వాటి ప్రవర్తన అనాత్మములు. అంటే, నేను అని స్వరూపంగా గ్రహించేగలిగినవి కావు, ధరించేగలిగినవి కావు. 23

**ప్రకాశోఽర్కస్య తోయస్య శైత్యమ్ అగ్నేర్యథోష్ణతా,**
**స్వభావస్సచ్చిదానన్ద-నిత్యనిర్మలతాఽఽత్మనః.**

ప్రకాశః - అర్కస్య - తోయస్య - శైత్యమ్ - అగ్నేః - యథా - ఉష్ణతా - స్వభావః - (సత్-చిత్-ఆనన్ద-నిత్య-నిర్మలతా) - ఆత్మనః.

**ప్రకాశోఽర్కస్య ॥ తోయస్య శైత్యమ్ ॥ అగ్నేర్ యథోష్ణతా,**
**స్వభావః ॥ సచ్చిదానన్ద-నిత్యనిర్మలతా ॥ ఽఽత్మనః. 24**

యథా - - అర్కస్య - ప్రకాశః - - తోయస్య - శైత్యమ్ - - అగ్నేః - ఉష్ణతా - - [తథా] - - (సచ్చిదానన్ద-నిత్యనిర్మలతా) - ఆత్మనః - స్వభావః.

(యథా) ఏ విధంగా (అర్కస్య) సూర్యునికి (ప్రకాశః) ప్రకాశము (తోయస్య) నీటికి (శైత్యమ్) శీతలము (అగ్నేః) అగ్నికి (ఉష్ణతా) వేడి [తథా=అట్లే] (సచ్చిదానన్ద-నిత్యనిర్మలతా) సచ్చిదానందలక్షణములతో నిత్యము నిర్మలము (ఆత్మనః) ఆత్మయొక్క (స్వభావః) స్వభావము. 24

ఆత్మకు స్వభావలక్షణములు చెప్పబడుతున్నవి. ముందుగా ఉపమానములు అర్థంచేసికొందాం.

**అర్కస్య ప్రకాశః.** సూర్యునికి ప్రకాశం ఇచ్చుట స్వభావం. **తోయస్య శైత్యమ్.** నీటికి చల్లదనం=శీతలం ఇచ్చుట స్వభావం. **అగ్నేః ఉష్ణతా.** అగ్నికి వేడినిచ్చుట స్వభావం. స్వభావమునకు వ్యతిరేకంగా సూర్యునివలన చీకటికాని, నీటికి వేడినిచ్చుటకాని, అగ్నికి శీతలమునిచ్చుటకాని ఉండదు. అటు-ఇటుకాని మధ్యస్థంగాకూడా ఉండదు. భౌతికంగా ఉపమానంగా ప్రకాశం-శీతలం-వేడి ఇచ్చుట

వెనుక సృష్టిలక్షణములు ఉన్నయ్. అందుకే, భౌతికగుణములు మారని స్వభావంగా అయినయ్. **స్వస్వభావ: స్వభావ:**. సత్=ఉనికి, చైతన్యం=ఉనికి చైతన్యం, ప్రకాశం=ఉనికిచైతన్యప్రకాశం, జ్ఞానం=ప్రకాశమైనదాని ఎఱుక, ఆనందం=పూర్ణత్వం. ఈ లక్షణములు సూర్యునికి ప్రకాశమిచ్చుటలో, నీటికి శీతలమిచ్చుటలో, అగ్నికి వేడినిచ్చుటలో వ్యక్తమవుతున్నయ్. అర్థంచేసికొందాం.

సూర్యుని భౌతికమైన ఉనికి, ఉనికిచైతన్యం. తన ఉనికిచైతన్యం తనకు ప్రకాశించినట్లు=తెలిసినట్లు, జ్ఞానంలో=ఎఱుకలో నిలుపుకొన్నట్లు, అదియే తనకు ఆనందం=పూర్ణం అన్నట్లు నిలిచి భౌతికప్రకాశమును ఇస్తున్నది.

**యదాదిత్యగతం తేజ: తద్విద్ధి మామకమ్** (గీ15- 13)

జ్ఞానులు సూర్యప్రకాశమును, ఈవిధంగా, భౌతికప్రకాశమేకాక సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణముల వ్యక్తీకరణగా గుర్తిస్తారు. ఈవ్యక్తీకరణలో ఏమాత్రమైన లోటైనా సూర్యునిలో ఉండి ఉంటే, ప్రకాశమునిచ్చుట సూర్యునికి చంచలగుణం అయిఉండేది. నీరు శీతలమునిచ్చుట, అగ్ని వేడినిచ్చుటకూడ భౌతికగుణములేకాక సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణముల వ్యక్తీకరణగానే ఉన్నది, జ్ఞానులు గుర్తిస్తున్నారు. **యచ్చ అగ్నౌ తేజ: తద్విద్ధి మామకమ్.** (గీ15-13). వ్యక్తీకరణలో ఏమాత్రమైన లోటు నీటిలోగాని అగ్నిలోగాని ఉండి ఉంటే వాటికి (వరుసగా) శీతలం-వేడి గుణములు చంచలములయ్యేవి, స్వభావం కావు. తమ సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు తమకే తెలియని జడములైన సూర్యుడు, నీరు, అగ్ని తమతమ భౌతికగుణములలో, భౌతికగుణములకు మించిన=అధికసత్యమైన=అధిష్ఠానమైన సృష్టిలక్షణములను= సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనందములను వ్యక్తం చేస్తున్నవి. ఈ విచారణలో సాధకులు గుర్తించవలసిన బోధ ఏమిటో చూద్దాం. స్వభావం అన్నది భౌతికగుణముల వ్యక్తీకరణకాదు, సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములను వ్యక్తంచేయుట అనియే. ఈ విధంగా, స్వభావం ఆధ్యాత్మికమే, స్వభావమంటే విషయాత్మకం కాదు, భౌతిక ప్రదర్శనకాదు.

కొండ అన్న నామరూపంకూడా, సత్ ఉనికి ఉన్నట్లు, తన ఉనికి తనకు చైతన్యమన్నట్లు, తన ఉనికిచైతన్యం తనకు తెలిసినట్లు, ఎఱుకలో నిలుపుకొన్నట్లు, తన ఉనికి తనకు ఆనందం=పూర్ణం అన్నట్లు సత్-చైతన్య- ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములను (తను తనకు గుర్తించలేకున్నా) వ్యక్తంచేస్తూ కొండ అన్న నామరూపములలో భౌతికమైనది. కొండను పగులకొడితే, నామరూపములే భంగమవుతున్నవి కాని, అవి వ్యక్తంచేసే సత్-చైతన్య- ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు భంగం కావటంలేదు. ఈ తత్త్వం జ్ఞానికే తెలుసు, నామరూపములకు తెలియదు. అందుకే సూర్యుడు మొదలైన నామరూపములన్నీ ఉపమానములుగానే నిలిచి జ్ఞానుల విచారణకు సాహాయ్యం చేస్తున్నయ్. ఇది సృష్టియొక్క అమరిక.

ఇప్పుడు ఉపమానములకు ఉపమేయమైన ఆత్మను అర్థంచేసికొందాం. సృష్టిలో నిండినిబిడీకృతమై ఉన్నది సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములే. ఇవి ఆధ్యాత్మికలక్షణములుగానే ఉన్నాయ్. తనను తాను గుర్తించేకొనే ఆధ్యాత్మికం సూర్యుడు మొదలైన నామరూపములకు లేదు కనుక, తాము గొప్పగా వ్యక్తంచేసే ఆధ్యాత్మికమైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు వాటికి తెలియవు. ఈ లక్షణములను తన ఆధ్యాత్మికస్థానంలో ప్రయోగించి గ్రహించి విచారణచేయగలిగిన జ్ఞానులకు తమ ఆధ్యాత్మికస్థానంలోనే వ్యక్తమవుతున్నవి, గ్రహించేగలుగుతున్నారు. జ్ఞానులు అందుకోవలసిన ఆధ్యాత్మికస్థానంయొక్క పూర్ణస్వరూపాన్ని=ఆత్మస్వరూపాన్ని, ఈ ఉపమాన-ఉపమేయములతో ఈశ్లోకం బోధిస్తున్నది.

ఆత్మకు లక్షణములు ఆధ్యాత్మికలక్షణములే, సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనందములే. సృష్టిలో ఇంతకంటే వేఱులక్షణములు లేవుగా! అయితే, ఉన్న గొప్ప తేడాను, ఆత్మ-జడములన్నంత తేడాను సాధకులు గుర్తించేవలె. ఆత్మయొక్క సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు నిత్యనిర్మలములు. అర్థంచేసికొందాం.

సూర్యుడు అనే నామరూపములు సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములను తాను జడమై, జ్ఞానులు గ్రహించేగలిగినట్లు వ్యక్తంచేస్తున్నాయ్. తన ఈ స్వభావం తనకు జడమై-భౌతికమైన ప్రకాశంగా నిలిచిపోయింది. ఆత్మ — **1.** సత్=ఉనికిలక్షణంలో నిత్యం నిర్మలంగా ఉండి నిత్యం నిర్మలంగా తనను తాను గ్రహిస్తూ..నిలుపుకొంటూ, ప్రాణులందఱికి వ్యక్తంచేస్తూ, వారి జడబుద్ధికి..మందబుద్ధికికూడా అందిస్తున్నది. **2.** తన ఉనికిని తానే స్వయంగా నిత్యం నిర్మలంగా చైతన్యవంతం చేసికొని గ్రహిస్తూ..నిలుపుకొంటూ, ప్రాణులందఱికి వ్యక్తంచేస్తూ, నిత్యమూ నిర్మలంగా వారి జడబుద్ధులను క్రమంగా చైతన్యవంతం చేస్తున్నది. **3.** తన ఉనికిచైతన్యాన్ని తాను ప్రకాశింపచేసికొంటూ=తెలిసికొంటూ, ప్రాణులందఱికి వ్యక్తంచేస్తూ, వారి జడబుద్ధులలో నిత్యం నిర్మలంగా నిలిచి, వారి జడబుద్ధులను ఉనికిచైతన్యమును గుర్తించేటట్లుగా క్రమంగా మల్చుతున్నది. **4.** తన ఉనికిచైతన్యప్రకాశమును తనకు జ్ఞానంగా=ఎఱుకగా గ్రహిస్తూ..నిలుపుకొంటూ, ప్రాణులందఱికి వ్యక్తంచేస్తూ చైతన్య-ప్రకాశ-జ్ఞానములకు వ్యతిరేకంగా జీవించిన 84లక్షల జీవరాశుల జన్మలలోను, జ్ఞానిఅయ్యేవఱకు, ప్రాణికి ఎఱుక లేకున్నా ప్రాణిస్వభావంలో ఎఱుకనిలిపి, **నేను ఉన్నాను** అన్న ఆధ్యాత్మికస్ఫురణను నిత్యం నిర్మలంగా అందిస్తూ, మలినంగా చలించే విషయములలో నిర్మలంగా నిలుపుతూ, క్రమంగా మానుషజన్మలో అందుకొని విచారణకు అక్కఱకువచ్చేవఱకు ఎఱుకను నిలుపుతున్నది. **5.** తన ఆనందమును=పూర్ణత్వమును నిత్యం నిర్మలంగా తనకు తాను గ్రహిస్తూ..నిలుపుకొంటూ, ప్రాణులందఱికి వ్యక్తంచేస్తూ, జ్ఞానికి సాధనలో ముందంజ వేస్తున్న సాధనలో నిత్యం తన సాధనను పూర్ణత్వంతో తనకు తానే

పోల్చుకొనేటట్లు అందిస్తున్నది. ఈ విధంగా, ఆత్మ తన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములను తాను ఆ లక్షణములచేతనే నిత్యం నిర్మలంగా చైతన్యవంతమై ఆ లక్షణములనే ప్రాణులందరికి నిత్యం నిర్మలంగా వ్యక్తం చేస్తూ అందిస్తూ ప్రాణులు అజ్ఞానంగానైనా జ్ఞానంతోనైనా గ్రహించేట్లు వారి సాధనకు చేయూతనిస్తూ ఉన్నది.

సూర్యుడు మొదలైన నామరూపక్రియాగుణములకు సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన- ఆనంద లక్షణములు ఉపమానమును ఇచ్చే స్వభావం. అవే లక్షణములు ఆత్మకు ఉపమేయంగా నిత్యం నిర్మలంగా ప్రాణులను సాధకులను జ్ఞానులనుగా మార్చుతూ తనస్వరూపంగా స్వస్వరూపంగా నిలిపే స్వభావం. 24

**ఆత్మనస్సచ్చిదంశశ్చ, బుద్ధేర్వృత్తిరితి ద్వయమ్,**
**సంయోజ్య చావివేకేన, జానామీతి ప్రవర్తతే.**

ఆత్మనః - (సత్-చిత్-అంశః) - చ - బుద్ధేః - వృత్తిః - ఇతి - ద్వయమ్ - సంయోజ్య - చ - అవివేకేన - జానామి - ఇతి - ప్రవర్తతే.

**ఆత్మనః ॥ సచ్చిదంశశ్చ, బుద్ధేర్ వృత్తిరితి ॥ ద్వయమ్,**
**సంయోజ్య చ్ఛావివేకేన, జానామీతి ॥ ప్రవర్తతే. 25**

ఆత్మనః - బుద్ధేః వృత్తిః – సచ్చిదంశః చ - ఇతి - ద్వయమ్ - సంయోజ్య చ - - అవివేకేన - జానామి ఇతి - ప్రవర్తతే.

(ఆత్మనః) ఆత్మకు (బుద్ధేః వృత్తిః) బుద్ధియొక్క విషయాత్మకవృత్తి (సచ్చిదంశః) సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణముల అంశము (ఇతి) అని (ద్వయమ్) రెండింటిని (సంయోజ్య చ) చేర్చుకొని (అవివేకేన) అవివేకంచేత (జానామి ఇతి) నేను తెలిసికొంటు ఉన్నాను అని (ప్రవర్తతే) ప్రవర్తిస్తున్నాడు. 25

జీవుని ప్రవర్తనలోని వ్యత్యాస్తం చెప్పబడుతున్నది.

జీవునికి సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు అధిష్ఠానములు, అంటే సర్వత్ర అధికసత్యమైన ఉనికి. బుద్ధియొక్క వృత్తి విషయాత్మకమైన అవగాహన. ఈ అధిష్ఠాన..అవగాహనలను ద్వయమును=రెండింటిని కలిపేస్తాడు. కలిపి, నేను తెలిసికొంటు ఉన్నాను అని ప్రవర్తిస్తున్నాడు. అంటే, నేను ఉన్నాను అన్న అధిష్ఠానఅంశమును, తెలిసికొంటున్నాను అన్న అవగాహనఅంశమును రెండింటిని కలిపి, అధిష్ఠానమును విడిచి అవగాహనపరంగానే, బాహ్యమును ..విషయములను తెలిసికొనేరూపంగానే ప్రవర్తిస్తున్నాడు. అయినా, తన ప్రవర్తనలో నేను ఉన్నాను అన్న అధిష్ఠానమే తెలిసికొంటు అన్న అవగాహనను అధిగమించి ఆధారంగ పలుకుతున్నది. పలికిన అధిష్ఠానమును, తెలిసికొనలేని

తన అవగాహనను రెండింటిని, ఉన్నది ఉన్నట్లు కాక, అవివేకంచేత, తన అవగాహనపరంగ=బుద్ధివృత్తిగానే గ్రహిస్తున్నాడు. 25

**ఆత్మనో విక్రియా నాస్తి, బుద్ధేర్ బోధో న జాత్వపి,**
**జీవస్సర్వమలం జ్ఞాత్వా, కర్తా ద్రష్టేతి ముహ్యతి.**

ఆత్మనః - విక్రియా - న - అస్తి - బుద్ధేః - బోధః - న - జాతు - అపి - జీవః - సర్వమ్ - అలమ్ - జ్ఞాత్వా - కర్తా - ద్రష్టా - ఇతి - ముహ్యతి.

**ఆత్మనో । విక్రియానాస్తి, బుద్ధేర్ ॥ బోధో న జాత్వపి,**
**జీవః ॥ సర్వమలం జ్ఞాత్వా, కర్తా ॥ ద్రష్టేతి ॥ ముహ్యతి. 26**

ఆత్మనః - విక్రియా - న అస్తి - - బుద్ధేః - న బోధః - జాతు అపి - - జీవః - సర్వమ్ - అలమ్ - జ్ఞాత్వా - - కర్తా – ద్రష్టా - ఇతి - ముహ్యతి.

(ఆత్మనః) ఆత్మకు (విక్రియా) వికారం (న అస్తి) లేదు. (బుద్ధేః) బుద్ధికి (జాతు అపి) ఒకప్పుడును (న బోధః) జ్ఞానం లేదు. (జీవః) జీవుడు (సర్వమ్) అంతటిని (అలమ్) మిక్కిలి, విపరీతంగా (జ్ఞాత్వా) తెలిసికొని (కర్తా) కర్తను (ద్రష్టా) ద్రష్టను (ఇతి) అని (ముహ్యతి) మోహం చెందుతున్నాడు. 26

ఆత్మకు బుద్ధికి తేడా చెప్పబడుతున్నది.

నిత్యం నిర్మలంగా సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములను అధిష్ఠానంగా నిలుపుకొన్న ఆత్మకు ఎటువంటి మార్పులు లేవు. విషయప్రవృత్తిలో అవగాహనచేసికొనే బుద్ధికి జ్ఞానం (విషయంలో విషయబంధం తప్పించుకొనే జ్ఞానంకాని ఆత్మజ్ఞానంకాని) ఒకప్పుడుకూడా లేదు, ఉండదు. బుద్ధి తన విషయ ప్రవర్తనలో అనాత్మరూపం, కనుక ఆత్మజ్ఞానమూ ఉండదు, అనాత్మజ్ఞానమూ ఉండదు.

విషయచాపల్యంచేత అవివేకి అవుతాడు జీవుడు. అవివేకంలో, ఏమీ తెలియకున్నా, అన్నీ తెలుసునని అహంకరిస్తాడు. అన్ని గొప్పలు తానే సృష్టించేసిన కర్తనని, అన్నిటిని గొప్పగా దర్శించిన ద్రష్టనని మోహంచెందుతాడు. సుఖ దుఃఖాది ద్వంద్వములకు తాను భోక్తనని త్రుళ్ళిపడుతాడు, దుఃఖిస్తాడు. 26

**రజ్జుసర్పవదాత్మానమ్, జీవం జ్ఞాత్వా భయం వహేత్,**
**నాహం జీవః పరాత్మేతి, జ్ఞాతశ్చేత్ నిర్భయో భవేత్.**

(రజ్జు-సర్ప-వత్) - ఆత్మానమ్ - జీవమ్ - జ్ఞాత్వా - భయమ్ - వహేత్ - న - అహమ్ - జీవః - (పర-ఆత్మా) - ఇతి - జ్ఞాతః - చేత్ - నిర్భయః - భవేత్.

**రజ్జుసర్పవద్ ॥ ఆత్మానమ్, జీవం జ్ఞాత్వా ॥ భయం వహేత్,**
**నాహం జీవః ॥ పరాత్మేతి, జ్ఞాతః చేత్ ॥ నిర్భయో భవేత్.** **27**

రజ్జుసర్పవత్ - - ఆత్మానమ్ - జీవమ్ - జ్ఞాత్వా - భయమ్ - వహేత్ - - [అధ్యాత్మవిచారణేన] - అహమ్ - న జీవః - పరాత్మా - ఇతి - జ్ఞాతః చేత్ - నిర్భయః - భవేత్.

(రజ్జుసర్పవత్) త్రాడుమీద పాము భ్రాంతివలె (ఆత్మానమ్) ఆత్మను, స్వస్వరూపమును (జీవమ్) జీవునిగ (జ్ఞాత్వా) తెలిసి (భయమ్) భయమును (వహేత్) పొందుతున్నాడు. [అధ్యాత్మవిచారణేన=అధ్యాత్మవిచారణచేత] (అహమ్) నేను (న జీవః) జీవుడను కాను (పరాత్మా) పరమమైన ఆత్మను=నేనును (ఇతి) అని (జ్ఞాతః చేత్) తెలిసినవాడైతే (నిర్భయః) భయంనుండి తొలగినవాడు (భవేత్) అగుచేన్నాడు. 27

జీవుడు స్వస్వరూమును పొందే ఉపాయం చెప్పబడుతున్నది.

**రజ్జుసర్పవత్.** ఉపమానం అర్థంచేసికొందాం. త్రాడు పురివిప్పి పడిఉంటే చూచి భ్రాంతిపురుషుడు పాముగా చూచాడు. చూచినది నిజమైన త్రాడునే, అనుకొని చూచినది పామును. అనుకొనుట అను దోషంవలన పామువలన భయమును పొంది, పరుగెత్తి, ఊయి కాలికి తగిలి క్రిందపడినందువలన దెబ్బ తగిలింది. తగిలిన దెబ్బ తను చూచిన పాముకు ప్రమాణం అంటాడు కాని తన భ్రాంతిని ఒప్పుకోడు. భ్రాంతికారణంగా పాముయొక్క సృష్టి కలిగింది. ఇది నిజం. కాని, దెబ్బకు కారణం పాముయొక్క సృష్టి అని అంటాడు. ఈ విధంగా, కార్యకారణ సంబంధమునుకూడా భ్రాంతిపరంగానే ఎంచి భయాదిజగత్తును పొందుతాడు భ్రాంతిపురుషుడు. కళ్ళు నలుపుకొని, కాసిని మంచినీళ్ళు త్రాగి, శాంతించి, ఇప్పుడు మరల చూస్తే తనకు త్రాడు కనిపిస్తుంది. నేను చూచింది పామును కాదు, త్రాడునే అని గుర్తిస్తే తనను ఆవరించిన భయం తొలగుతుంది.

సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు నిత్యనిర్మలములగుటవలనను, అవి తనకు ఆత్మలక్షణములు, ఆధ్యాత్మికలక్షణములు అగుటవలనను తాను జీవాత్మకాదు పరాత్మా=పరమాత్మ= పరమమైన ఆత్మ. ఇది అధిష్ఠానంగా సత్యం. అధిష్ఠానమును అవగాహనచేసికొనే ఆధ్యాత్మికవిచారణను తన బుద్ధికి అందించుట జీవుని బాధ్యత, జీవితధ్యేయం. విచారణలో, బుద్ధివృత్తి అనాత్మమని గుర్తించి, బుద్ధివృత్తిని తన వృత్తిగా తనస్వరూపంగా ప్రవర్తించి భయాది దోషములను పొందే జీవుడను **నేను** కాదు అని మొదట గుర్తించి స్థిరంచేసికోవాలి. ఇది స్థిరం అవటానికి, జీవునికి అధిష్ఠానమైన నిజఆత్మస్వరూపమే **నేను** అని ప్రతిసారి పోల్చుకొని చూచుకోవాలి. అప్పుడు, జీవభావంవలన కలిగిన భయాది దోషములు తొలగిపోతవి. అభిమానఅహంకారములు, కామక్రోధాదులు కలిగినప్పుడు వాటి ప్రభావ

మునకు పర్యవసానమునకు (ఫలితమునకు) గురికాక, విచారణచేసి అభిమానాదులు తనకు స్వరూపంకాదని, తనకు ద్వైతములు=మారురూపములు=భ్రాంతిరూపములు అని గుర్తించి, ఇది ఆవరించేని పూర్వపురూపమే తనకు పరమమైన రూపం అని నిశ్చయించుకొని, బుద్ధిని నిగ్రహించితే (అంటే, అవగాహనను సవరించుకొంటే) జీవుడు ఆత్మస్వరూపుడుగా నిర్భయుడవుతాడు. 27

**ఆత్మా ఽవభాసయత్యేకః, బుద్ధ్యాదీనీన్ద్రియాణ్యపి,**
**దీపో ఘటాదివత్స్వాత్మా, జడైస్తైర్నావభాస్యతే.**

ఆత్మా - అవభాసయతి - ఏకః - (బుద్ధి-ఆదీని) - ఇన్ద్రియాణి - అపి - దీపః - ఘటాదివత్ - (స్వ-ఆత్మా) - జడైః - తైః - న - అవభాస్యతే.

**ఆత్మా ॥ ఽవభాసయత్యేకః, బుద్ధ్యాదీన్నీన్ద్రియాణ్యపి,**
**దీపో ఘటాదివత్ ॥ స్వాత్మా, జడైస్తైర్ ॥ నావభాస్యతే. 28**

ఏకః - ఆత్మా - బుద్ధ్యాదీని - ఇన్ద్రియాణి అపి - అవభాసయతి - - దీపః - ఘటాదివత్ - - తైః జడైః - స్వాత్మా - న అవభాస్యతే.

(ఏకః) ఒకటే అయిన (ఆత్మా) ఆత్మ (బుద్ధ్యాదీని) బుద్ధి మొదలైన (ఇన్ద్రియాణి అపి) ఇంద్రియములనుకూడా (అవభాసయతి) ప్రకాశింపచేస్తుంది. (దీపః) దీపము (ఘటాదివత్) ఘటాదులవలనవలె (తైః జడైః) ఆ జడములైనవాటి చేత (స్వాత్మా) తన ఆత్మ (న అవభాస్యతే) ప్రకాశింపబడదు. 28

*ఆత్మకు బుద్ధ్యాది ఇంద్రియములకు ప్రకాశప్రకాశ్యముల పోలికచేత ఆత్మ బోధ చేయబడుచున్నది.*

**దీపః ఘటాదివత్.** ఉపమానం అర్థంచేసికొందాం. ఒక్క దీపం కుండ మొదలైన పదార్థములనన్నిటిని ప్రకాశింపచేస్తుంది=తెలియచేస్తుంది. దీపం ప్రకాశము, కుండ మొదలైనవి ప్రకాశ్యములు=ప్రకాశింపబడినవి. ప్రకాశింపబడిన కుండ మొదలైన పదార్థములు ప్రకాశమిచ్చే దీపమును ప్రకాశింపచేయలేవు, తెలియచేయలేవు. సాధకులు ఈ ఉపమానమును బాగుగ ధారణచేయవలె.

ఆత్మయొక్క సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణముల తేజస్సుచేత బుద్ధి మొదలైన ఇంద్రియములన్నీ ప్రకాశింపబడుతున్నవి. ఉపమానంతో పోల్చి అర్థంచేసికొందాం. దీపపుకాంతిలో, కుండ గుర్తించేవానికి ప్రకాశిస్తున్నది= తెలుస్తున్నది, దీపానికి తెలియుటలేదు, కుండకు తెలియుటలేదు. ఉపమేయంలో ఆత్మ యొక్క సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు బుద్ధిమొదలైన ఇంద్రియ ములకు నిత్యంగా నిర్మలంగా అందుతున్నవి, ఇంద్రియములు అందుకొంటున్నవి, అందుకొన్నట్లు ప్రవర్తిస్తున్నవి. కన్ను భౌతికమే. అయినా, తన ఉనికిలో తాను ఉండి,

ఎదుట దృశ్యం రాగానే తనను తాను చైతన్యవంతం చేసికొన్నట్లు రెటీనామీద ప్రతిబింబమును తీసికొంటుంది. తన ఉనికి చైతన్యం తనకు ప్రకాశించినట్లు= తెలిసినట్లు ప్రవర్తిస్తూ ఎఱుకలో నిలుపుకొంటూ, దృశ్యం ఉంటే ప్రతిబింబం తీసి కొంటూ, దృశ్యంలేకుంటే ప్రతిబింబం తీసికోక రెటీనాను శుభ్రంగా ఉంచుకొం టుంది. ఈ చేష్టయే తనకు ఉనికిఆనందం=పూర్ణత్వం అన్నట్లు ఉంటుంది. 24వశ్లో కంలో విచారణచేసికొన్నట్లు, ఆత్మలక్షణములను స్పష్టంగా వ్యక్తంచేసినా, సూర్యుడు మొదలైన పదార్థములవలె, లక్షణములను రెటీనామీద ప్రతిబింబం తీసికొను చేష్టలో కన్ను భౌతికంగా ఉపమానంగా వ్యక్తంచేస్తుంది. కాని, తను వ్యక్తంచేసే లక్షణ ములు తనకు ప్రకాశించుటలేదు=తెలియటంలేదు. అందుకే, ఇంద్రియములు ప్రకాశ్యములు=ప్రకాశింపబడినవి మాత్రమే, వాటికి ప్రకాశం లేదు. అంతేకాదు. ఆత్మ యొక్క సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములను జ్ఞానికి ప్రకాశింపచేసే ప్రకాశమునకు ప్రవర్తనయేకాని, విషయప్రకాశము గ్రహించలేదు..వ్యక్తంచేయలేదు. కుండ అనే దృశ్యానికి కుండయొక్క ప్రతిబింబం తీసికొంటుంది, అంతే, కుండ యందు జీవుడు చూచే మంచిచెడ్డలు హర్షామర్షలు ప్రతిబింబంగా గ్రహించేలేదు.. వ్యక్తంచేయలేదు, గ్రహించేదు.. వ్యక్తంచేయదు.

ఈ విధంగా, నిత్యంగా నిర్మలంగా ఆధ్యాత్మికంగా జ్ఞానులకు జ్ఞానసాధ నంగా, సామాన్యులకు తెడ్డుగా, ఒక్కటే ఆత్మ తన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణముల తేజస్సును ఇంద్రియములకు ప్రకాశింపచేస్తుంది. జడములైన ఈ ఇంద్రియములు తమకు తేజస్సునిచ్చే ఆత్మను ప్రకాశింపచేయలేవు. ఇంద్రియాది సృష్టిపదార్థములన్నీ ఆత్మలక్షణములనే వ్యక్తంచేసినా అందఱు గ్రహించేలేరు, జ్ఞానదృష్టి కలవారే గ్రహించేగలరు. ఆత్మ తన లక్షణములను పిపీలికం amoeba మొదలు జ్ఞానివఱకు గ్రహించి..సాధనచేసి సాధనకాలంలో ఆ లక్షణములను పూర్ణరూపంలో సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములుగా వ్యక్తంచేసేటట్లు అందిస్తుంది. జడపదార్థములనుకూడా వాటికి ప్రకాశింపని లక్షణములను జ్ఞానుల కొఱకు వ్యక్తంచేసేటట్లు అందిస్తుంది. అటువంటి ఆత్మను పిపీలికంనుండి జ్ఞానులవఱకు ఎవరుకాని, జడపదార్థములుకాని, బుద్ధిమొదలయిన ఇంద్రియము లుకాని ప్రకాశింపచేయలేవు. 28

**స్వబోధే నాన్యబోధేచ్ఛా, బోధరూపతయాఽఽత్మనః,**
**న దీపస్యాన్యదీపేచ్ఛా, యథా స్వాత్మప్రకాశనే.**

(స్వ-బోధే) - న - (అన్య-బోధ-ఇచ్ఛా) - (బోధ-రూపతయా) - ఆత్మనః - న -దీపస్య - (అన్య-దీప-ఇచ్ఛా) - యథా - (స్వ-ఆత్మ-ప్రకాశనే).

**స్వబోధే ॥ నాన్యబోధేచ్ఛా, బోధరూపతయా ॥ ఆత్మనః,**

**న దీపస్యాన్యదీపేచ్ఛా, యథా ॥ స్వాత్మప్రకాశనే.** 29

యథా - స్వాత్మప్రకాశనే - దీపస్య - న అన్యదీపేచ్ఛా - - [తథా] - - బోధరూపతయా - ఆత్మనః - స్వబోధే - న అన్యబోధేచ్ఛా.

(యథా) ఏవిధంగా (స్వాత్మప్రకాశనే) తన వెలుగును ప్రకాశింపచేయుట యందు (దీపస్య) దీపమునకు (న అన్యదీపేచ్ఛా) ఇతరదీపముయొక్క అవసరము లేదో [తథా=అట్లే] (బోధరూపతయా) తనను తెలిసికొను రూపమగుటచేత (ఆత్మనః) ఆత్మకు (స్వబోధే) తనయొక్క జ్ఞానం=ఎఱుకయందు (న అన్యబోధేచ్ఛా) ఇతర జ్ఞానముల అవసరము లేదు. 29

ఆత్మబోధ వివరింపబడుతున్నది.

**యథా స్వాత్మప్రకాశనే దీపస్య నాన్యదీపేచ్ఛా.** ఉపమానం అర్థం చేసికొందాం. దీపం తన వెలుగును తానే స్వయంగా ప్రకాశింపచేసికొంటుంది. ఇతరదీపంయొక్క సాహాయ్యం అక్కఱలేదు. దీపం తనలో తానే వెలుగుటచేత స్వయంగా వెలుగును ప్రకాశింపచేసికొంటుంది.

ఆత్మ, తన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములను స్వయం జ్యోతిగా నిలుపుకొంటూ అన్ని ప్రాణులకు, జడపదార్థములకు, ఇంద్రియములకు అందిస్తున్నదని క్రిందటి శ్లోకంలో విచారణచేసికొన్నాం. స్వయంజ్యోతి పరంజ్యోతి అయిన ఆత్మకు తన తేజస్సును నిలుపుకొనుటకు ప్రకాశింపబడిన ఇతరముల సాహాయ్యం అక్కఱలేదు.

24వ శ్లోకపు విచారణ ప్రకారంగా దీపం భౌతికమైన వెలుగును స్వయంగా వెలిగించేటలో ఆత్మయొక్క సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములను వ్యక్తం చేస్తూ, తాను ఉపమానరూపంలో దీపపు కాంతి వ్యక్తం చేస్తున్నట్లున్నది. ఇది సృష్టి అమరిక. సృష్టి అంతా ఆత్మబోధకు=ఆత్మజ్ఞానమునకు ఉపమానములే.

**విదా జ్ఞానేన యాౌతి ఇతి విద్యుత్.** ప్రాణులందఱికి ఆత్మయొక్క సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు ఎఱుకతో వ్యక్తమయ్యే విద్యుత్‌గా ఉన్నవి. ప్రాణులే విద్యుత్ ఎఱుకతో ఆత్మరూపమును పలుకుతుంటే, ఇక అట్టి ఆత్మకు ఇంకొక ప్రకాశింపబడిన రూపము కాని ఇంద్రియచేష్టలుకాని అక్కఱలేదు. అంటే, ఇంద్రియచేష్టలచేతకాని విషయములచేతకాని ఆత్మ తెలియబడదు. 29

**నిషిధ్య నిఖిలోపాధీన్, నేతినేతీతి వాక్యతః,**
**విద్యాదైక్యం మహావాక్యైః, జీవాత్మపరమాత్మనోః.**

నిషిధ్య - (నిఖిల-ఉపాధీన్) - (న-ఇతి-న-ఇతి-ఇతి) - వాక్యతః - విద్యాత్ - ఐక్యమ్ - (మహాన్-వాక్యైః) - (జీవాత్మ-పరమాత్మనోః).

**నిషిధ్య ॥ నిఖిలోపాధీన్, నేతినేతీతి ॥ వాక్యతః,**
**విద్యాద్ ఐక్యం ॥ మహావాక్యైః, జీవాత్మ-పరమాత్మనోః. 30**

నేతినేతీతి - వాక్యతః - నిఖిలోపాధీన్ - నిషిధ్య - - మహావాక్యైః - (జీవాత్మ-పరమాత్మనోః) - ఐక్యమ్ - విద్యాత్.

(నేతినేతీతి) కాదుకాదను (వాక్యతః) వేదవాక్కులవలన (నిఖిలోపాధీన్) అన్ని ఉపాధులను (నిషిధ్య) నిషేధించి (మహావాక్యైః) మాహావాక్యములచేత (జీవాత్మ-పరమాత్మనోః) జీవాత్మపరమాత్మలయొక్క (ఐక్యమ్) ఐక్యమును (విద్యాత్) తెలియవలెను. 30

*జీవాత్మ-పరమాత్మల ఐక్యం బోధింపబడుతున్నది.*

వాస్తవంలో జీవాత్మ-పరమాత్మలను భేదం లేదు. ఉన్నది సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణముల ఆత్మ ఒక్కటే. ఆత్మకు బుద్ధిమొదలగు ఇంద్రియములతో పనిలేదు అనికూడా చూచాం. జన్మాదివ్యవస్థలు, కర్మలు, బంధము, ముక్తి సాధన ఇవన్నీ వాస్తవంలో కల్పితములు. ఆత్మజ్ఞానంలేని అజ్ఞానకారణంచేత విషయదృష్టిని కలిగి అనేకంగా కల్పించుకొని ప్రవర్తించేవాడు జీవుడు అనబడుతాడు. ఈ విధంగా, జీవుడు కల్పితస్వరూపుడు. అతడు అట్లు ప్రవర్తించేటానికి..కల్పించుకోటానికి అతనికి స్వయంగా తేజస్సుకాని శక్తికాని లేదని చూచాం. రజ్జుసర్పభ్రాంతివలె, తన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన- ఆనందముల ఆత్మతేజస్సునే విషయపరంగా తనకు ద్వైతమును=మారురూపమును భ్రాంతిచేత చూచుకొంటున్నాడని విచారణ చేసికొన్నాం.

ఈ విధంగా, ఉన్న నిజఆత్మను ద్వైతంగా జీవాత్మ అని అనుకొనుటవలన, నిజఆత్మను జీవాత్మకంటె పరమమైన ఆత్మ పరమాత్మ అనవలసివచ్చింది. ఇప్పుడు, వాస్తవంలో జీవాత్మ అనబడునది పరమాత్మయే, భ్రాంతిభేదమే కాని లక్షణములలో భేదం లేదు.

కనుక, జీవుడు తనను నిజఆత్మగా=నిజమైననేనుగా= పరమాత్మగా= పరమమైనఆత్మగా ఉద్ధరించుకొనదలచితే, అతడు ఆచరించవలసినది బోధింపబడుతున్నది. తన చిత్తం చిత్రించుకొన్న ఉపాధులన్ని పూర్ణరూపములు కానివి. కనుక, అన్ని ఉపాధులను = విషయరూపములను ఒక్కొక్కటిని **న ఇతి న ఇతి** అవి తనరూపం కాదని నిషేధించవలె. ఈ ప్రయత్నంలో పూర్ణత్వమును సాధించవలె. శ్రుతి-యుక్తి-అనుభవములు శ్రవణ-మనన-నిదిధ్యాసములు సాధనచతుష్టయ సంపత్తిసాధన ఆచరించవలె. విషయములు నామరూపక్రియాగుణాత్మకములు, మార్పులుచెంది క్షీణించి నశించేవి. ఇది ప్రకృతి. ప్రకృతి విలక్షణము, సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనందముల లక్షణాత్మకం ఆత్మ. ఈభేదమును ఎఱుకలో నిలుపుకొంటూ నేతినేతి అన్న విచారణను ప్రయోగించవలె. **వక్తుం యోగ్యం వాక్యమ్.**

వచ-పరిభాషణే. పలుకదగినది వాక్యం. విషయములు సత్యమని ఇంతవఱకు అన్నది అవాచ్యం పలుకకూడనిది. **నేతినేతి** అని నిషేధించుట పలుకదగిన వాక్యం.

ఈ ప్రయత్నంలోని పూర్ణత్వంలోనే జీవాత్మ-పరమాత్మలకు భేదం లేదన్న మహావాక్యం పలుకుతుంది, పలుకుటకు యోగ్యమైనది పలుకుతుంది, ఆచరింప బడుతుంది. కనుక ప్రయత్నమును పూర్ణత్వమునకు సాధించి జీవాత్మపరమాత్మల ఐక్యమును తెలియవలె..పొందవలె. 30

**ఆవిద్యకం శరీరాది, దృశ్యం బుద్బుదవత్ క్షరమ్,**
**ఏతద్విలక్షణం విద్యాత్, అహం బ్రహ్మేతి నిర్మలమ్.**

ఆవిద్యకమ్ - శరీరాది - దృశ్యమ్ - బుద్బుదవత్ - క్షరమ్ - ఏతత్ - విలక్షణమ్ - విద్యాత్ - అహమ్ - బ్రహ్మ - ఇతి - నిర్మలమ్.

**ఆవిద్యకం ॥ శరీరాది, దృశ్యం ॥ బుద్బుదవత్ క్షరమ్,**
**ఏతద్విలక్షణం ॥ విద్యాత్, అహం బ్రహ్మేతి ॥ నిర్మలమ్. 31**

ఆవిద్యకమ్ - శరీరాది - దృశ్యమ్ - బుద్బుదవత్ - క్షరమ్ - - ఏతత్ విలక్షణమ్ - అహం బ్రహ్మ ఇతి - నిర్మలమ్ - విద్యాత్.

(ఆవిద్యకమ్) అవిద్యారూపమైన (శరీరాది) శరీరం మొదలైన (దృశ్యమ్) దృశ్యం (బుద్బుదవత్) బుడగవలె (క్షరమ్) నశించేది. (ఏతత్ విలక్షణమ్) దీనికి వ్యతిరేకలక్షణం (అహం బ్రహ్మ ఇతి) నేను బ్రహ్మను అని (నిర్మలమ్) మలినం కానిదిగ (విద్యాత్) తెలియవలె. 31

మహావాక్యానుభవం బోధింపబడుతున్నది.

శరీరం మొదలుగా నామరూపక్రియాగుణములన్నీ దృశ్యములే. తాను వాటి నన్నిటిని దర్శించే ఏకైక ద్రష్ట. అన్నిటిని దర్శించే ద్రష్ట వాటిని సవరించేగల విద్యాస్వరూపం. శరీరాది దృశ్యములన్నీ స్వచేతనం లేనివి, తనను తాను తెలియలేని అవిద్యారూపములు. అవిద్యకు విత్‌లక్షణం అధిష్ఠానం. అధిష్ఠాన విత్‌లక్షణం ఆధారంగా అవిద్య ప్రవర్తిస్తుంది, విషయములను అవగాహనచేసేరూపంగా మలినంగా ప్రవర్తిస్తుంది. నీటిమట్టంమీద గాలిప్రభావంచేత నీరు బుడగగా రూపమును పొంది, త్వరలో బుడగరూపం నశించినట్లు, నశించే విషయములను అవగాహనామలినంలో అవగాహనచేసి, శరీరాది దృశ్యములు ద్రష్టవలె ప్రవర్తించినా, నశించేవిగానే ఉంటవి.

ఇందుకు విలక్షణం=వ్యతిరేకలక్షణం **అహం బ్రహ్మ ఇతి** నేను సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణముల బ్రహ్మమునే అన్న మహావాక్య దర్శనం. నేను చేస్తూ ఉన్నాను అన్న వాక్యంలో చేస్తూ అన్న చేష్ట..కర్మ నేను ఉన్నాను అన్న

ఉనికికి దృశ్యం. చేష్ట..కర్మ క్షీణించే స్వభావం కలవి. వాటికి నేను ఉన్నాను అన్న ఉనికి అధిష్ఠానం..ఆధారం, సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు స్వభావంగా కలది. మోస్తూ మొదలైన చేష్టలు..కర్మలు అన్ని నశించినా నశించేని నిర్మలమైనది సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనందములు లక్షణాత్మకంగా వ్యక్తమవుతున్న నేను ఉన్నాను అన్న ఉనికిస్వభావం. ఈ ఉనికి జీవుని విషయములలో వ్యాపించిన బ్రహ్మస్వరూపం. అటువంటి విశాలమైన బ్రహ్మమునే **నేను** అన్న **అహం బ్రహ్మ ఇతి** మహావాక్యానుభూతి నిర్మలమైనదిగా తెలియవలె.

శరీరాదులందు ఆత్మభావం (దేహాత్మభావం) సంస్కారంలో పోషింపబడుతున్నవి, ప్రవర్తనలో కాదు. సంస్కారం ఆంతరంగికం..కారణం, ప్రవర్తన బాహ్యం.. కార్యరూపం. ప్రవర్తనలో విషయదృష్టి దేహాత్మభావమును మరిపిస్తున్నది, దేహాత్మభావం ఉన్నట్లు గుర్తించనీయటం లేదు. సంస్కారంలో ఉపాధులనూ దేహాత్మభావమునూ నిషేధించుట పూర్ణత్వం. సంస్కారమును సవరించు లక్ష్యం సాధనచేసిన సాధకునికి మహావాక్యబోధను ఆచరించుట కష్టం కాదు. 31

**దేహాన్యత్వాన్న మే జన్మజరాకార్శ్యలయాదయః,**
**శబ్దాదివిషయైస్సఙ్గః, నిరిన్ద్రియతయా న చ.**

(దేహ-అన్యత్వాత్) - న - మే - (జన్మ-జరా-కార్శ్య-లయ-ఆదయః) - (శబ్ద-ఆది-విషయైః) - సఙ్గః - (నిః-ఇన్ద్రియతయా) - న - చ.

**దేహాన్యత్వాన్ ॥ న మే, జన్మజరాకార్శ్యలయాదయః,**
**శబ్దాదివిషయైః ॥ సఙ్గః, నిరిన్ద్రియతయా ॥ న చ. 32**

దేహాన్యత్వాత్ - మే - న జన్మజరాకార్శ్యలయాదయః - - నిరిన్ద్రియతయా - శబ్దాదివిషయైః - న సఙ్గః చ.

(దేహాన్యత్వాత్) దేహంకంటె వేఱగుటవలన (మే) నాకు (న జన్మజరా-కార్శ్యలయాదయః) పుట్టుక, ముసలితనం, క్షీణించుట, నశించుట అనునవి లేవు. (నిరిన్ద్రియతయా) ఇంద్రియములు లేనందువలన (శబ్దాదివిషయైః) శబ్దాదివిషయములతో (న సఙ్గః చ) కలయికకూడ లేదు. 32

అహం బ్రహ్మేతి మహావాక్యానుసంధానం బోధింపబడుతున్నది.

దేహానికి పుట్టుక, పెరుగుదల, ముసలితనం, క్షీణించుట, నశించుట అన్న వికారములు ఉన్నవి. నేను దేహంకంటె వేఱు. అందువలన, నాకు ఈ దేహవికారములు లేవు.

శ్రోత్ర-త్వక్-చక్షుర్-జిహ్వా-ఘ్రాణములను ఐదు జ్ఞానేంద్రియములకు వరుసగా శబ్దస్పర్శరూపరసగంధములను విషయములున్నవి. వాక్-పాణి-

పాద-పాయు-ఉపస్థ అను కర్మేంద్రియములకు మాట్లాడుట, ఇచ్చిపుచ్చుకొనుట, నడచుట, మలవిసర్జన, మూత్రవిసర్జన అను విషయములున్నవి. ప్రాణ-అపాన-వ్యాన-ఉదాన-సమాన అను ప్రాణేంద్రియములకు ఉచ్ఛ్వాసనిశ్వాస, వ్యాపించుట, జీవమును తీసికొనిపోవుట, సమంగా నిలుపుకొనుట అను విషయములున్నవి. మనస్సు-బుద్ధి-చిత్తం-అహంకారం అను అంతరింద్రియచేష్టలకు విచారణ, నిశ్చయించుట, స్మృతిలో నిలుపుట, విషయప్రవర్తన అన్న విషయములున్నవి, నాకు ఈ ఇంద్రియములు లేవు. అందువలన నాకు ఈ శబ్దాదివిషయములు లేవు. 32

**అమనస్త్వాన్న మే దుఃఖరాగభయద్వేషాదయః,**
**అప్రాణోహ్యమనాశ్శుభ్రః, ఇత్యాది శ్రుతిశాసనాత్.**

అమనస్త్వాత్ - న - మే - (దుఃఖ-రాగ-భయ-ద్వేష-ఆదయః) - అప్రాణః - హి - అమనాః - శుభ్రః - (ఇతి-ఆది) - (శ్రుతి-శాసనాత్).

**అమనస్త్వాన్ ॥ న మే, దుఃఖరాగభయద్వేషాదయః,**
**అప్రాణో హ్యమనాః ॥ శుభ్రః, ఇత్యాది ॥ శ్రుతిశాసనాత్. 33**

అమనస్త్వాత్ - మే - న దుఃఖరాగభయద్వేషాదయః - - శ్రుతిశాసనాత్ - - హి - [అహమ్] - అప్రాణః - అమనాః - శుభ్రః - ఇత్యాది.

(అమనస్త్వాత్) మనస్సు లేనందువలన (మే) నాకు (న దుఃఖరాగభయద్వేషాదయః) దుఃఖము, రాగము, భయము, ద్వేషము మొదలైనవి లేవు. (శ్రుతిశాసనాత్) శ్రుతుల శాసనంవలన (హి) నిశ్చయంగ [అహమ్=నేను] (అప్రాణః) ప్రాణంలేని స్వరూపుడను (అమనాః) తలంచుటలేని స్వరూపుడను (శుభ్రః) శుభ్రస్వరూపుడను (ఇత్యాది) మొదలైనవి. 33

అహం బ్రహ్మేతి మహావాక్యానుసంధానం బోధింపబడుతున్నది.

దుఃఖం, రాగం, భయం, ద్వేషం మొదలైనవి మనోధర్మములు. అంటే ఊహించి ధరించేనవి, ధరించేగలుగుతున్నామనికూడ ఊహయే నిలుపుకొనబడేది. విచారణ మనస్సుకు తేజస్సు. విచారణను ఊహలో డోలాయమానంగా ఊగునట్లు చేసికొని ప్రవర్తిస్తుంది మనస్సు. ఈ మనస్సు నాకు లేదు. అందువలన, ఊహకు ఫలంగా కలుగుతున్న దుఃఖం, రాగం, భయం, ద్వేషం మొదలైనవి నాకు లేవు. నేను వీటినుండి ముక్తుడనే.

ఆత్మలక్షణములు శ్రుతులు శాసించి చెపుతున్నయ్. అవి నాకు స్వరూపములుగ నేను గుర్తించి నిలుపుకొన్నప్పుడే నేను ఆత్మస్వరూపుడనవుతాను, బ్రహ్మస్వరూపుడనవుతాను. శ్రుతుల శాసనానికి వ్యతిరేకంగాను వ్యత్యస్తంగాను ప్రవర్తిస్తూ ఆత్మస్వరూపుడనని బ్రహ్మస్వరూపుడనని అనుకొనుట భ్రాంతి.

**అప్రాణః అహమ్.** ప్రాణవాయువును శ్వాసగా పీల్చి జీవిస్తున్నవాడను కాదు. శ్వాసకు నిశ్శ్వాస వెంటనే తోసికొనివస్తుంది. వాయువును పీల్చి బ్రతికే ప్రాణి ఉచ్ఛ్వాసనిశ్శ్వాసలలో డోలాయమానమవుతుంది, alternate అవుతుంది. ఇది నాస్వరూపం కాదు. నేను **అప్రాణః** ప్రాణవాయువు ఆధారంలేని నిశ్చలుడను. ఇది శ్రుతిశాసనం, నాకు అనుసంధానం.

**అమనాః అహమ్. మన్యతే మనుతే వా ఇతి మనుః**. బయటినుండి జ్ఞానము నబడేదానిని తెచ్చిపెట్టుకొనేది, ఊహించేది మనస్సు. నేను అఖండమైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణముల జ్ఞానస్వరూపుడను కనుక, నాకు బాహ్యాజ్ఞానములు అక్కఱలేదు. అన్నిటికి జ్ఞానమునిచ్చే నాకు=ఆత్మకు=బ్రహ్మకు ఇతరజ్ఞానములేల? సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములతో పూర్ణమైన ఉనికిస్వరూపుడనైన నాకు ఊహతో అక్కఱలేదు. ఊహకు బాహ్యాజ్ఞానములకు అందనిస్వరూపం నేను. ఇది శ్రుతిశాసనం, నాకు అనుసంధానం.

**శుభ్రః అహమ్. శోభతే ఇతి శుభ్రః**. నాకు నేను ఒప్పెడివాడను కనుక శుభ్రస్వరూపుడను. అనాత్మములు ఏవి తమకు తాము స్పష్టమైనవి కావు. దేహం ఆధ్యాత్మికమునకు ఉపమానముల సంపుటిగా సాధకునిగా పూర్తి సాహాయ్యం చేస్తుంది. కాని, తనకు తాను ఒప్పక, మార్పులు చెందుతు, క్షీణిస్తు, నశిస్తుంది. మనస్సు చంచలమై తన ఊహను నిలుపుకోలేదు, జ్ఞానమును నిలుపుకోలేదు. ఇంద్రియములు ఆత్మచైతన్యమును అందుకొని ఆధ్యాత్మికంగా సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములతో చైతన్యవంతమైనప్పటికి, జీవుడు వాటిని విషయాత్మకంగా వాడుకొంటున్నప్పుడు తమ తేజస్సును పోగొట్టుకొని గుణప్రవృత్తితో బలీయమై ప్రవర్తిస్తవి, తమకు తామే శోభలేనివి అవుతయ్. సృష్టిలో సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములను ఆధ్యాత్మికంగ నిలుపుకొన్న ఆధ్యాత్మికస్వరూపమైన **నేనే అహమేవ శుభ్రః** శుభ్రస్వరూపుడను. ఇది శ్రుతిశాసనం. నాకు అనుసంధానం. అనాత్మములైన దేహేంద్రియమనోబుద్ధులు శుభ్రములు కావని ఆధ్యాత్మికంగ అవస్థలలో గుర్తించేటకే సృష్టి 84లక్షల జీవరాశులలో బోధచేసింది. 33

**నిర్గుణో నిష్క్రియో నిత్యః, నిర్వికల్పో నిరఞ్జనః,**
**నిర్వికారో నిరాకారః, నిత్యముక్తోఽస్మి నిర్మలః.**

నిర్గుణః - నిష్క్రియః - నిత్యః - నిర్వికల్పః - నిరఞ్జనః - నిర్వికారః - నిరాకారః - (నిత్య-ముక్తః) - అస్మి - నిర్మలః.

**నిర్గుణో । నిష్క్రియో । నిత్యః, నిర్వికల్పో । నిరఞ్జనః,**

**నిర్వికారో । నిరాకారః, నిత్యముక్తోఽస్మి ॥ నిర్మలః.** **34**

[అహమ్] - - నిర్గుణః – నిష్క్రియః – నిత్యః – నిర్వికల్పః – నిరఞ్జనః – నిర్వికారః – నిరాకారః – నిత్యముక్తః – నిర్మలః - అస్మి.

[అహమ్=నేను] (నిర్గుణః) గుణములను మరల్చినవాడను (నిష్క్రియః) క్రియలను మరల్చినవాడను (నిత్యః) నిత్యుడను (నిర్వికల్పః) భ్రాంతులను మరల్చినవాడను (నిరఞ్జనః) దేనితోను సంబంధపడనివాడను (నిర్వికారః) మార్పులను మరల్చినవాడను (నిరాకారః) ఆకారములను మరల్చినవాడను (నిత్యముక్తః) ఎల్లప్పుడు ముక్తిని పొందినవాడను (నిర్మలః) మలినములను మరల్చినవాడను (అస్మి) అయి ఉన్నాను. 34

ఆత్మబోధ చేయబడుతున్నది.

సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణముల ఆత్మ స్వరూపుడనుగా నేను **నిర్గుణః**. సత్త్వరజస్తమోగుణములను మరలించినవాడను. స్వరూపమును తెలియగోరి..పొందగోరి తెలియలేని..పొందలేని వ్యవస్థయే తరతమభేదంతో సత్త్వరజస్తమోగుణములు. స్వరూపంలో నిలిచిన నాకు తెలియలేని..పొందలేని వ్యవస్థ లేదు, గుణములు లేవు.

**నిష్క్రియః. కరణం క్రియా.** చేయుట క్రియ. క్రియకు కారకములుంటయ్. ఎవరినిగురించి, దేనితో, దేనికొఱకు, దేనివలన, దేనియందు (ఎక్కడ), ఇంకా ఎందుకు, ఎప్పుడు, ఎవరు చేయవలె అన్న ప్రశ్నలకు సమాధానం కూర్చగా క్రియ జేరుగుతుంది. ఉనికికి ఈ ప్రశ్నలేవి ఉండవు. ఈ ప్రశ్నలకు సమాధానం కూర్చక పోయినా ఆశించేక ఉనికి ఉంటుంది. అనాత్మములు ఉన్నవనుట ఉనికి కాదు. ఎందుకంటే, అవి అశాశ్వతములు, వాటి దేశకాలాదులుకూడా అశాశ్వతములు. క్రియా కారకములు మొదలగువాటిని ఆశించేక శాశ్వతంగా ఉన్న ఉనికిస్వరూపం నేను. అందుకే నిష్క్రియుడను.

**నిత్యః. యత్కిఞ్చిత్ జగత్ దృశ్యతే శ్రూయతేపి వా తదనిత్యమ్.** ఏకొంచెం జగత్తైనా చూడబడినా వినబడినదైనా అదంతా అనిత్యం, అసుఖం. క్రియ అనిత్యం, క్రియాత్మక జగత్తు అనిత్యం. నేను క్రియకు విలక్షణమైన ఉనికిస్వరూపం. అందుకే నేను నిత్యుడను.

**నిర్వికల్పః.** విషయప్రవర్తనలో విషయములు బాహ్యంగా ప్రవర్తించేటతో సరిపోవటంలేదు కదా! వాటికి వివేకస్థానంలో స్థానం సూక్ష్మకారణరూపములలో ఉంటున్నది. వివేకం అన్నది బాహ్యపదార్థంగా లేదు కదా! ఆధ్యాత్మికస్థానాన్ని అలంకరించాలని తోసికొని వస్తుంది. జీవునికి స్వరూపస్థానంలో చేరి కూర్చుంటుంది. అధిష్ఠానంగా=అధికసత్యంగా సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణము

లతో తనకొక ధామం=స్థానం ఉండగా, బయటినుండి కూర్చుకొచ్చిన వివేకం ఆ స్థానంలో స్వరూపంగా చేరాలంటే పెద్దసమస్యయే. ఒకస్థానంలో తానుండగా వేఱొకరు వచ్చి కూర్చోవాలంటె ఎట్లు? బాహ్యవివేకమును స్థానంగా..స్వరూపంగా అంగీకరించినపుడు ఈ సమస్య ఇంతింతగా పెరుగుతుంటుంది. ఇది తీరనిసమస్య, పరిష్కారంలేని సమస్య. చివరికి ఇది జీవునికి భ్రాంతిరూపంలో మిగిలిపోతుంది. నేను నాయొక్క సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములలో పూర్ణమై ఉన్నందువలన బాహ్యవిషయములతో కూర్చిన వివేకమును స్వరూపంగాను అంగీ కరించేను, నా స్థానంలో దానికి ఉనికినివ్వను. అందుకే, నేను నిర్వికల్పుడను.

**నిరఞ్జనః.** ఎందుకు అంగీకరించేను? ఎందుకు ఉనికినివ్వను? అన్న ప్రశ్నకు సమాధానం లక్షణాత్మకం. విషయములు ప్రకృతిలక్షణములు కలవి, అశాశ్వతములు. నేను సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనందములను ఆధ్యాత్మికలక్షణముల స్వరూపం. విషయములకు నేను అధిష్ఠానం..ఆధారం, విషయములు నన్ను ఆశ్రయించి నేను అంగీకరిస్తే అశాశ్వతమైన ఉనికితో చంచలంగా ప్రవర్తించేగలవు. ఎన్నటికి వాటికి నా ఉనికి లభించేదు. ఇది పారమార్థికసత్యం. ఈ విధంగా, విషయములకు నేను విలక్షణం. సల్లక్షణములతో సంబంధం పొసగుతుంది, విలక్షణంతో సంబంధం విరుగుతుంది. విషయములతో నాకు సంబంధం విరిగినందువలననే నేను నిరంజనం.

**నిర్వికారః.** భూమిమీద వాహనములు పరుగెత్తుతయ్. వాహనములతో పాటుగా భూమికూడా పరుగెత్తుతే ఏమవుతుందో సాధకులు ఆగి ఆలోచించేవలె. వాహనముల వేగం విపరీతమవుతుంది. వాటికి ఆగినస్థితిని దర్శించేటానికిగాని దర్శింపచేయటానికిగాని అలవికానిది. ఆధేయమైన విషయములు మార్పులుచెం దేవి. ఆధారం..అధిష్ఠానమైన నేనుకూడా మార్పులుచెందితే, వాటి మార్పులను దర్శించేలేను, దర్శింపచేయలేను. ఇక జీవుడు నన్ను=నేనును దర్శించేలేడు. జీవునికి 84లక్షల జీవరాశుల జన్మలలో గడచినవన్నీ మార్పులే, మారకుండగ నిలిచింది నేను ఉన్నాను అన్న ఆధ్యాత్మికస్థానమే. ఇప్పటి విషయంకూడా మరుక్షణం మారిపోతుంది, మిగిలేది నేను ఉన్నాను అన్న ఆధ్యాత్మికస్థానమే. భవిష్యత్తులోని విషయప్రవర్తనలోను ఇంతే. విషయములతోబాటుగ నేను ఉన్నాను అన్న ఆధ్యాత్మికస్థానంకూడా చంచలంగా మారిఉంటే ఇప్పుడు జీవుని గతి ఏమౌనో జీవభావమును పోషిస్తున్నవారు ఆలోచించవలె. వారితో ఇంత రాద్ధాంతం ఎందుకు? విషయములతో సంబంధమేలేని నేను వాటితో మారని నిర్వికారరూపుడను.

**నిరాకారః.** విషయములకు, భౌతికపదార్థములకు, లౌకికవ్యవహారమునకు వచ్చినవాటికి ఆకారం లౌకికరీతి. **ఆ స్మృతౌ కృతం వృత్తిః ఆకారః.** స్మరణలో చేసికొన్న వృత్తులు..సంకల్పములు..ప్రవృత్తి ఆకారమనబడుతుంది. విషయములకు లౌకికమునకు విలక్షణమైన నాకు ఆకారం అన్న అంశం లేదు. లక్షణాత్మకమే నాకు స్వరూపం కనుక నేను నిరాకారుడను.

**నిత్యముక్తః.** గుణములు..క్రియలచేత విషయప్రవర్తనలు, భ్రాంతి, సంబంధబాంధవ్యములు, మార్పులు, నామరూపములు మొదలైనది లౌకికరీతి, విషయ ప్రవర్తనలకు స్థితిగతులు. ఇదొక విషవలయం, ఇదొక సుడిగుండం. దీనినుండి బయటపడుట ముక్తి. ఈ విషవలయానికి ఆవలగ కేవలమైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణముల స్వరూపుడనైన నేను వీటినుండి ముక్తుడను కనుక నిత్యముక్తుడను.

**నిర్మలః. మలతే ధారయతి జగదితి మలః.** మల-ధారణే. జగత్తును ధరించేనది మలము, మురికి. జననం, పెరుగుట, మార్పులుచెందుట, క్షీణించుట, నశించుట ఇది జగత్తు, ఇది మురికి, శుభ్రంచేసికొనవలసినది. మురుగు దేహాదిపదార్థములను దూషితం చేసినట్లు జగత్తు జీవుని స్వరూపమును దూషితం చేస్తుంది. జననాది జగత్తు నాకు లేదు కనుక నేను నిర్మలుడను. 34

**అహమాకాశవత్సర్వమ్, బహిరన్తర్గతోఽచ్యుతః,**
**సదా సర్వసమస్సిద్ధః, నిస్సఙ్గో నిర్మలోఽచలః.**

అహమ్ - ఆకాశవత్ - సర్వమ్ - (బహిః-అన్తః-గతః) - అచ్యుతః - సదా - (సర్వ-సమః) - సిద్ధః - నిస్సఙ్గః - నిర్మలః - అచలః.

**అహమ్ ॥ ఆకాశవత్ ॥ సర్వమ్, బహిరన్తర్గతో । ఽచ్యుతః,**
**సదా ॥ సర్వసమః ॥ సిద్ధః, నిస్సఙ్గో । నిర్మలో । ఽచలః. 35**

అహమ్ - - ఆకాశవత్ - సర్వమ్ - బహిరన్తర్గతః - అచ్యుతః - - సదా - సర్వసమః – సిద్ధః – నిస్సఙ్గః – నిర్మలః – అచలః.

(అహమ్) నేను (ఆకాశవత్) ఆకాశంవలె (సర్వమ్) అంతట (బహిరన్తర్గతః) బయట-లోపల ఉన్నవాడను (అచ్యుతః) అచ్యుతుడను, జారిపడనివాడను (సదా) ఎల్లప్పుడు (సర్వసమః) అంతట సమస్వరూపుడను (సిద్ధః) కల్పితంకాని ఉనికి స్వరూపుడను (నిస్సఙ్గః) కల్పితముతో సంబంధపడనివాడను (నిర్మలః) మలినమును మరలించినవాడను (అచలః) స్వరూపంనుండి చలించేనివాడను. 35

ఆత్మబోధ చేయబడుతున్నది.

ఆకాశం సర్వవ్యాపి. అంటే, కుండకు లోపల-బయట చుట్టి వ్యాపించినట్లు, అన్ని పదార్థములను లోపల-బయట చుట్టి వ్యాపించి ఉన్నది. కుండను కదిలిస్తే కుండయే కదులుతుంది, కుండలోని ఆకాశం కదలదు. అట్లే అన్ని పదార్థములందుకూడా.

**ఆకాశవత్ అహం సర్వం బహిరన్తర్గతః.** ఆకాశంవలె నేను అంతట లోపల-బయట ఉన్నవాడను. ఉపమానమైన ఆకాశం లోపల-బయట వ్యాపించుట

అన్నది భౌతికఉపమానంవఱకే. సూక్ష్మమైన **నేను** లోపల-బయట వ్యాపించుట అన్నది ఆధ్యాత్మికమైన సత్యం. అర్థంచేసికొందాం. నేను చేస్తూ ఉన్నాను అన్న జీవుని వ్యక్తీకరణలో నేను ఉన్నాను అన్నది ఆధ్యాత్మికం వ్యక్తమగుట, చేస్తూ అన్నది బాహ్యమైన చేష్ట-క్రియ వ్యక్తమగుట. నేను ఉన్నాను అన్న ఆధ్యాత్మికంలోను చేస్తూ అన్న బాహ్యక్రియలోనూ వ్యాపించి వ్యక్తమవుతున్నది, బాహ్యక్రియలేని నేను ఉన్నాను అన్న కేవల ఆధ్యాత్మికమునందును వ్యాపించి వ్యక్తమవుతున్నది. సాధకుని ఆంతరంగికదృష్టికి=తత్త్వసాధనకు నేనుయొక్క సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు అధిష్ఠానం..లక్ష్యం. సామాన్య ప్రాణులన్నీ జీవభావంలో ప్రవర్తించేటానికి, లక్ష్యంగా గ్రహించేకున్నా సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములే లక్షణములు. నిత్యనిర్మలంగా సిద్ధపురుషుని ఆత్మబోధస్థితికి కూడా సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనందములే సిద్ధమైన లక్షణములు.

**అహమ్ అచ్యుతః.** బహిరన్తర్గతమై సృష్టిఅంతా వ్యాపించిన లక్షణాత్మక స్వరూపంగా నేను బయటజగత్తుకు అధిష్ఠానమేకాని, జారిపడే స్వరూపం కాదు. నేను ఎప్పుడు జీవుడుగా జారిపడదు. జారిపడితే అది నేను కాదు, జీవుడే. జీవభావమే జీవునిస్థితికి జారిపడుతుంది. ఆత్మభావం ఆత్మస్థితిలో నిలిచి ఉంటుంది.

**అహం సదా సర్వసమః.** సిద్ధపురుషుని సిద్ధస్థితిలోకాని, సాధకుని అధిష్ఠానలక్ష్యములోకాని, సామాన్యప్రాణులకు అధిష్ఠానంగాకాని, జడపదార్థములందు వ్యక్తమయే అధిష్ఠాన లక్షణములుగాకాని అంతట ఎల్లప్పుడు నేను సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములతో ఆధ్యాత్మికంగా సమమై ఉన్నది. సృష్టిఅంతా, ప్రళయంవఱకు ఎల్లప్పుడు, సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు ఆధ్యాత్మికంగా అద్వైతలక్షణములై ఉన్నవి. ఈ లక్షణములకు ద్వైతంగా సృష్టి అన్నది అబద్ధం అన్నంత సమంగా ఉన్నవి.

**అహం సిద్ధః.** నేను చేస్తూ ఉన్నాను అన్న జీవునివ్యవస్థలోకూడా, నేను ఉన్నాను అన్న ఆధ్యాత్మికఉనికి స్వతస్సిద్ధమైనది. చేస్తూ అన్నది తత్కాలకల్పితమై, మార్పులుచెంది క్షీణించి నశిస్తున్నది. కల్పితం కల్పింపబడుటకు ముందుగానే దానిని తప్పించేటానికి నేను సిద్ధమై ఉన్నాను (**నేను** సిద్ధమై ఉన్నది).

**అహం నిస్సఙ్గః.** త్రోవకు అడ్డుగా ఱాయి ఉంటె, అది అడ్డు..తొలగించేవలసినది అని తెలిసిరాగా, ఆ ఱాయియందు ఏ సంబంధములేక, తొలగించుటే కర్తవ్యమన్న ఎఱుక కలుగుతుంది. అట్లే, కల్పింపబడిన చేస్తూ ఇత్యాది చేష్టాపరమైన జగత్తు అడ్డు తొలగించేవలసినది అని తెలిసిరాగా, ఆ జగత్తునందు ఏ సంబంధము లేక, అడ్డు తొలగించుటే సాధనఎఱుకగా నేను జగత్తుతో సంబంధపడనివాడను.

**అహం నిర్మలః.** కల్పితమునకున్న జగత్తుయొక్క మలినం నాకు లేదు కనుకనే నేను దానిని తప్పించగలుగుతున్నాను. ఇంతవఱకు ప్రాణులన్నీ 84లక్షల జీవరాశుల జన్మలలోని ప్రతిజన్మలో ఆ జన్మ-దేహముల మురికిని అభిమానంతో స్వరూపంగా చేసికొని కొట్టుమిట్టాడినయ్. ఆయా జన్మలలో ప్రతిప్రాణిని నేను ఉన్నాను అన్న ఆధ్యాత్మికఅధిష్ఠానస్వరూపంలో ఉండి జన్మ-దేహముల మురికి నుండి తప్పించి బయటపడవేసింది **నేను**. కార్యరూపంలో ఇది సత్యమైనప్పటికి ప్రాణులు గుర్తించేనందువలన మరల మరల జన్మలనెత్తుతున్నయ్. అయినా, అవి కడతేరి ఆధ్యాత్మికోన్నతితో ముక్తిని సాధించేవఱకు నిర్మలరూపంలో ఉండి ఆ మాలిన్యములను తొలగించేది **నేను**.

**అహమ్ అచలః.** నేను ప్రాణుల ఉన్నతికొఱకు చేసే ప్రయత్నం అక్కఱలే నట్లు సామాన్యప్రాణులు చంచలంగా ప్రవర్తిస్తుంటయ్. కావాలంటున్న సాధకులు కావలసినంత శ్రద్ధతో గుర్తించేరు. చపలం వదిలేవఱకు సతమతమవుతుంటారు. చలించేవాటిలో చలించేక నిలిచి కడతేర్చేది అచలమైన **నేను**. చలించుట అన్నది ఎట్టి పరిస్థితిలో లేనిది **నేను**. 35

**నిత్యశుద్ధవిముక్తైకమ్, అఖణ్డానన్దమద్వయమ్,**
**సత్యం జ్ఞానమనన్తం యత్, పరంబ్రహ్మాహమేవ తత్.**

(నిత్య-శుద్ధ-విముక్తః-ఏకమ్) - (అఖణ్డ-ఆనన్దమ్) - అద్వయమ్ - సత్యమ్ - జ్ఞానమ్ - అనన్తమ్ - యత్ - (పరం-బ్రహ్మ) - అహమ్ - ఏవ - తత్.

**నిత్యశుద్ధవిముక్తైకమ్, అఖణ్డానన్దమ్ ॥ అద్వయమ్,**
**సత్యం ॥ జ్ఞానమ్ ॥ అనన్తం ॥ యత్, పరంబ్రహ్మాహమేవ ॥ తత్. 36**

యత్ - నిత్యశుద్ధవిముక్తైకమ్ – అఖణ్డానన్దమ్ – అద్వయమ్ – సత్యమ్ – జ్ఞానమ్ – అనన్తమ్ - - తత్ - పరంబ్రహ్మ - అహమ్ ఏవ.

(యత్) ఏది (నిత్యశుద్ధవిముక్తైకమ్) నిత్యమై శుద్ధమై విముక్తమై ఏకమై నదో (అఖణ్డానన్దమ్) తెగని ఆనందమో (అద్వయమ్) ద్వైతము లేనిదో (సత్యమ్) నిజఉనికికలదో (జ్ఞానమ్) ఆధ్యాత్మిక ఎఱుకరూపమో (అనన్తమ్) నాశంలేనిదో (తత్) ఆ (పరంబ్రహ్మ) పరంబ్రహ్మము (అహమ్ ఏవ) నేనే. 36

ఆత్మబోధ చేయబడుతున్నది.

**నిత్యశుద్ధవిముక్తైకమ్.** అనిత్యమను జగదంశములులేని సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనందములు నిత్యమైనది. అనిత్యమను అశుద్ధము, జన్మజరాకార్శ్య లయాదులు లేనిది శుద్ధమైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు. అనిత్య-అశుద్ధములకు విలక్షణమైనది విముక్తమైన సత్-చైతన్య- ప్రకాశ-జ్ఞాన-ఆనంద

లక్షణములు. ద్వైతంలేని సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు సృష్టిలో ఏకాంశం.

**అఖణ్డానన్దమ్.** లౌకికసుఖములు సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణముల ప్రయోగమే, సిద్ధస్వరూపములు కావు. కనుక, తాత్కాలికములుగాను ముక్కలుగాను అయిన సుఖములు. సిద్ధలక్షణములైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనందములు పూర్ణములుగ అఖండమైన ఆనందం.

**అద్వయమ్.** సృష్టిలో సృష్టి అన్న రెండవదికాని ద్వైతంకాని లేని అద్వయం ఆధ్యాత్మికమైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు.

**సత్యమ్. సతః యమనం సత్యమ్.** సత్‌లక్షణంయొక్క నియామకం సత్యం. సృష్టిలో చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములతో సత్=ఉనికిలక్షణం నియమించేబడినది. ఈ విధంగా, సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు మాత్రమే సృష్టికి సత్యం, ఉనికి నిజమైనవి.

**జ్ఞానమ్.** సృష్టిలో సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనందములు ఏవో లక్షణములుగా కాక ఆధ్యాత్మికలక్షణములుగా అధిష్ఠానంగా వ్యాపించినయ్. కనుక, సృష్టి అంతటా చరాచరములంతటికి సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనందములే ఆధ్యాత్మిక..అధిష్ఠానంగా జ్ఞానస్వరూపమై=ఎఱుకరూపమై ఉన్నది. ప్రాణులు గుర్తించేకున్నా, గుర్తించుటలో లోపమైనా ఎఱుక..జ్ఞాన లక్షణములు ఇవే. విషయాత్మక జగత్తంతా జీవునికి ధ్యాసమాత్రమే.

**అనన్తమ్.** సృష్టి ప్రళయమై అంతమైనా అంతంకానివి సృష్టిలోని ఆధ్యాత్మికములైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు. అందుకే, ఈ లక్షణములు అనంతములు.

నిత్యశుద్ధ మొదలైన అంశములతో సృష్టిలో వ్యాపించి సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు ఏవి ఉన్నవో అవి పరంబ్రహ్మ లక్షణములు. ఈ లక్షణములు ఆధ్యాత్మికములగుటవలన ఆ పరంబ్రహ్మము నేనే. 36

**ఏవం నిరన్తరకృతా, బ్రహ్మైవాస్మీతి వాసనా,**
**హరత్యవిద్యావిక్షేపాన్, రోగానివ రసాయనమ్.**

ఏవమ్ - (నిరన్తర-కృతా) - బ్రహ్మ - ఏవ - అస్మి - ఇతి - వాసనా - హరతి - (అవిద్యా-విక్షేపాన్) - రోగాన్ - ఇవ - రసాయనమ్.

**ఏవం ॥ నిరన్తరకృతా, బ్రహ్మైవాస్మీతి ॥ వాసనా,**
**హరత్యవిద్యావిక్షేపాన్, రోగాన్ ఇవ ॥ రసాయనమ్.** 37

ఏవమ్ - బ్రహ్మ ఏవ అస్మి ఇతి - నిరన్తరకృతా - వాసనా - - రసాయనమ్ - రోగాన్ - ఇవ - - అవిద్యావిక్షేపాన్ - హరతి.

(ఏవమ్) ఈ విధంగా (బ్రహ్మ ఏవ అస్మి ఇతి) బ్రహ్మమునే అయి ఉన్నాను అని (నిరన్తరకృతా) ఎల్లప్పుడు నిలుపుకొనిన (వాసనా) ఆధ్యాత్మికవాసన (రసాయనమ్) మందు (రోగాన్) రోగములను (ఇవ) వలె (అవిద్యావిక్షేపాన్) అవిద్యవలన కలిగిన విక్షేపములను (హరతి) నాశంచేస్తున్నది. 37

ఆత్మబోధ చేయబడుతున్నది.

ఈవిధంగా, (32 నుండి 36 శ్లోకములలో బోధించినట్లు), నేను బ్రహ్మమునే అయి ఉన్నాను అని ఎల్లప్పుడు ప్రవర్తనలో ప్రత్యక్షంగా అనుసంధానం చేయ వలె. ఎక్కడెక్కడ ఏఏ పరిస్థితులలో పూర్వం తనను జీవునిగా తలచి విషయాది జగత్తు సత్యమనుకొన్నాడో అదంతా అసత్యమని, తన భ్రాంతిచేత సత్యంగా తోచిందని, ఈ నిజాన్ని గుర్తించే సాక్షిస్వరూపమే తనకు ఉన్నతరూపమని ప్రత్యక్షంగా దర్శించేవలె. అప్పుడు తనకు సాక్షిస్వరూపం జీవరూపాన్ని తొలగించి వసిస్తుంది, అంటే సాక్షిరూపపు వాసన కలుగుతుంది. క్రమంగా, జీవ రూపపు భ్రాంతి తొలగి, తనకు అధిష్ఠానంగా ఉన్న ఆధ్యాత్మిక సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణముల దర్శనం అవుతుంది. స్వరూపం లభించిన తృప్తి చేత స్వరూపంతో=ఆత్మస్వరూపుడై ప్రవర్తిస్తాడు.

**దృష్టిం జ్ఞానమయీం కృత్వా పశ్యేత్ బ్రహ్మమయం జగత్.** (తే.బి.ఉ.)

దృష్టిని సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములందు ఎఱుకతో నిలిపి జగత్తును క్రొత్తగా చూస్తాడు. సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములనే వ్యక్తంచేస్తున్నదిగా చూస్తాడు. ఈ లక్షణములనే పలికిస్తాడు. క్రమంగా, తనలో ఆత్మలక్షణములుగా గుర్తించిన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనందములను జగత్తంతా దర్శించి పొంది వ్యాపింపచేస్తాడు. సృష్టిలో సృష్టి అనే ద్వైతం లేని సత్-చైతన్య -ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములే ఉన్నవని దర్శించి పొంది వ్యాపింపచేస్తాడు. ఈ విధంగా, ఆత్మలక్షణములను బ్రహ్మలక్షణం(ములు)గా చేసికొంటాడు. బ్రహ్మమే అహంశబ్దవాచ్యం అన్న వాసనను సాధిస్తాడు, అంటే బ్రహ్మలక్షణములతో బ్రహ్మముగా వసిస్తాడు. ఇది, నేను బ్రహ్మమే అయి ఉన్నానన్న నిరంతర అనుసంధానం, ఫలితంగా సాధించిన బ్రహ్మవాసన.

**రసాయనం రోగాన్ ఇవ.** మందు సేవిస్తే రోగములెన్ని ఉన్నా హరించుకు పోతయ్. రోగి ఆరోగ్యం పొందుతాడు.

**హరతి అవిద్యావిక్షేపాన్.** సాధకుడు బ్రహ్మవాసనను సాధించుకొంటూ వస్తుంటే, పూర్వం అవిద్యచేత పేరపెట్టుకొన్న విక్షేపములనే సంసారపురోగములు బ్రహ్మవాసనకు నిలువలేక హరించుకుపోతయ్. ఎక్కడికి పోతయ్ అని అడిగాడు,

ఒక కుంటిప్రశ్న, ఒకాయన. రాత్రి, దీపంలేని గదికి తీసికెళ్ళాడు ఆయనను మన సాధకుడు. కూర్చోమన్నాడు. చీకటిగా ఉందన్నాడాయన. చీకటిని చూస్తున్నావా అని అడిగాడు సాధకుడు. చూస్తున్నానన్నాడాయన. దీపం వెలిగించాడు సాధకుడు. అమ్మయ్య! చీకటి పోయిందన్నాడాయన. చీకటి ఎక్కడికి పోయిందని అడిగాడు సాధకుడు. ప్రశ్నకు ప్రశ్నయే సమాధానం. వెలుతురురాగా పోయిన చీకటి జాడ తెలియదెట్లో, ఆరోగ్యం కుదరగా రోగపు జాడ తెలియదెట్లో, అట్లే బ్రహ్మవాసన కలిగితే అవిద్యవలన కలిగిన విక్షేపరోగములు, విక్షేపపు అంధకారం= పటాపంచలు అవుతయ్. **అథ మర్త్యో ఽమృతో భవతి అత్ర బ్రహ్మ సమశ్నుతే.** (కఠ.ఉ.) మరణమే స్వభావంగా కల జీవుడు అమృతం= మరణంలేకుండుటయే స్వభావంకలవాడుగా అవుతాడు. ఈస్థితిలో బ్రహ్మమును పొందుతాడు. 37

**వివిక్తదేశ ఆసీనః, విరాగో విజితేన్ద్రియః,**
**భావయేదేకమాత్మానమ్, తమనన్తమనన్యధీః.**

(వివిక్త-దేశే) - ఆసీనః - విరాగః - (విజిత-ఇన్ద్రియః) - భావయేత్ - ఏకమ్ - ఆత్మానమ్ - తమ్ - అనన్తమ్ - (అనన్య-ధీః).

**వివిక్తదేశ । ఆసీనః, విరాగో । విజితేన్ద్రియః,**
**భావయేద్ ॥ ఏకమాత్మానమ్, తమనన్తమ్ ॥ అనన్యధీః. 38**

అనన్యధీః - - వివిక్తదేశే - ఆసీనః - - విరాగః – విజితేన్ద్రియః - - తమ్ - అనన్తమ్ - ఏకమ్ - ఆత్మానమ్ - భావయేత్.

(అనన్యధీః) అన్యమునందు పోని బుద్ధికల సాధకుడు (వివిక్తదేశే) ఏకాంత స్థలమునందు, ఏకాంతమునందు (ఆసీనః) కూర్చొన్నవాడై (విరాగః) విరాగియై (విజితేన్ద్రియః) ఇంద్రియములను నిగ్రహించినవాడై (తమ్) దానిని, ఆ (అనన్తమ్) అంతంలేనిది (ఏకమ్) ఏకమైనది అయిన (ఆత్మానమ్) ఆత్మను, స్వస్వరూపమును (భావయేత్) భావించేవలె. 38

బ్రహ్మసాధన బోధింపబడుతున్నది.

**అనన్యధీః.** బ్రహ్మసాధనకు మొదటి అర్హతగా, సాధకుడు అనన్యబుద్ధికలవాడు కావాలి. అర్థంచేసికొందాం. గడచిన జీవితమంతా తను గ్రహించేటకు తనముందుంచేబడిన అవకాశముల మూట. పుచ్చుకోమని ఇచ్చిన వస్తువును చేతిలో బలంలేక పుచ్చుకొంటే ఏమవుతుందో సాధకుడుగ ఆలోచించేండి. వస్తువు క్రింద పడిపోతుంది. ఇప్పుడది గ్రహించిన వస్తువు కాదు, క్రిందపడినది. చేతిబలంతో పుచ్చుకొంటే, అంటే ముందుగా తనచేతిబలాన్ని గ్రహిస్తే, బయటవస్తువు గ్రహించేబడినదవుతుంది, తన చేతిబలాన్ని గ్రహించిన బలంతో గ్రహించేబడిన

దవుతుంది. గతజన్మలజీవితకాలమంతా, ఈ విధంగా, తనను గ్రహించి, తనను గ్రహించిన బలంతో గ్రహించేవలసిన అవకాశముల సంపుటి. కాని, జేరిగిందేమి? తనను తాను గ్రహించేక, ఆ జన్మలజీవితములలో ఏదో బావుకు తినాలని పోయి, జన్మలను జీవితములను అవకాశములను అన్నిటిని పోగొట్టుకొన్నాడు. అంటే, అన్యధీః అయినాడు. అన్యమును గ్రహించేబోయిన గ్రహించేదలచిన బుద్ధికలవాడైనాడు. తప్పుడు బుద్ధి చిక్కింది, స్వరూపమూ చిక్కలేదు, విషయమూ చిక్కలేదు, విజ్ఞానమూ చిక్కలేదు. ఈ అవాంతరం సాధకునికి ఆరోగ్యకరం కాదు. విషయదృష్టితో భారమైన జగత్తును బ్రహ్మలక్షణములతో గ్రహించేవలెనంటె బరువుపట్టే బలం ఉండాలి. అనన్యంగా తనను గ్రహించేగలిగితే అన్యమును ఎంతటి బరువైనా తన అనన్యతేజస్సుతో గ్రహించేవచ్చును. అర్థమైంది కదూ!

**అనన్యధీః** అన్నది మొదటి అర్హత.

**వివిక్తదేశే ఆసీనః.** ఏకాంతస్థలమునందు కూర్చొన్నవాడు కావాలి. తొందరపడి కేవలం స్థూలంగా అవగాహన చేయకూడదు. మొదటిసాధనగా, లోకమును..జగత్తును విడిచి, ఎవరూ ఆటంకపఱచేని స్థలంలో కూర్చొని శాస్త్రవాక్కులను బాగుగా అనుసంధానం చేయాలి. 84లక్షల జీవరాశుల జన్మలలో **అన్యధీః** అయి జీవించిన జీవుడు అంత సులభంగా **అనన్యధీః** కాలేడు. అతని బుద్ధిని శాస్త్రవాక్కులను విశ్వసించేటట్లు విజ్ఞానం కలిగేటట్లు వంచుకొని రావాలి. ఇది తన పనియే.

తరువాత, తన విశ్వాసం..విజ్ఞానములకు తగినట్లు విషయలోకంలో ప్రవర్తించేలి. ఏకాంతంలో బుద్ధికి బుద్ధి చెపితే సరిపోదు. విషయంలో ప్రవర్తించేటప్పుడు పూర్వవాసనలతోనే ప్రవర్తిస్తుంది. ఈ అవాంతరంనుండి బయటపడాలి. విషయప్రవర్తనలో విషయంకంటె దూరంగా ఏకాంతంగా తన స్థానంలో ఉండి విషయంలో విషయరూపంకాక తన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములను నిలిపే సాధనను చేయాలి. అంతవఱకు సాధకునికి వివిక్తదేశం= ఏకాంతం లభించేలేదన్నమాట.

**విరాగః.** విషయములందు రాగమును=మిక్కిలిప్రీతిని విడిచినవాడు కావాలి. ఇదికూడ చెప్పినంత సులభం కాదు. **ఎగదీస్తే బ్రహ్మేచ్ఛ దిగదీస్తే గృహేచ్ఛ.** పొగిడితే విరాగి..బ్రహ్మజ్ఞాని, నిగిడితే=తిట్టితే విషయవాసన. ఇది సామాన్యంగా మనిషితీరు. ఈ విపరీతం రాకుండటానికి ఉపాయం ఉన్నది. **యద్ ఆప్తరాగః అపి చ ఆత్మరాగః తత్ విరాగః.** ఏస్థితిలో విషయములందున్న ప్రీతులన్ని పొందబడినవో, శేషం మిగిలిలేవో, ఏ స్థితిలో ఆత్మలక్షణములందు మిక్కిలి ప్రీతి ఉన్నదో అదే విరాగం. ఇట్టివాడు **విరాగః.**

**విజితేన్ద్రియః.** సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు ఆధ్యాత్మి

కంగా తేజోవంతములైన ఇంద్రియములను మనిషి గతజన్మల జీవితంలో విషయదృష్టితోటి ప్రవర్తనలో తేజోహీనములుగ చేసి, తనవశం లేక పోగొట్టు కొన్నాడు. ఇప్పుడు జ్ఞానవిజ్ఞానములతో సాధనచేసి తన వశం చేసికోవాలి. తన వశమైన ఇంద్రియములు తన బ్రహ్మసాధనకు తోడ్పడుతయ్.

బ్రహ్మసాధనకు ఈ అర్హతలు సాధించి —

**అనన్తమ్ ఏకమ్ ఆత్మానం భావయేత్.** అనంతము ఏకము అయిన ఆత్మను భావించేవలె. అర్థంచేసికొందాం. నేను పురుగునై ఉన్నాను, నేను పక్షినై ఉన్నాను, నేను పశువునై ఉన్నాను, నేను మనిషినై ఉన్నాను, నేను సుఖినై ఉన్నాను, నేను దుఃఖినై ఉన్నాను, నేను చేస్తూ ఉన్నాను మొదలైన వ్యవస్థలలో పురుగు, పక్షి మొదలైనవి అంతమై పోయినయ్. ఇక రాబోయే వ్యవస్థలుకూడా అంతమై పోతయ్. నేను ఉన్నాను అన్న ఆధ్యాత్మికస్వరూపం అనంతం= అంతంకా నిది. ఆత్మను ఈ విధంగా అనంతంగా భావించేనంతవఱకు పురుగు, పక్షి, సుఖి, దుఃఖి మొదలైన అంతమయ్యే వ్యవస్థలే తనకు స్వరూపంగా భావిస్తూ, జీవుడు తన నిజఆత్మను భావించేలేడు. కనుక, అర్హతలను సాధించి తన అనంతమైన ఆత్మను=స్వరూపమును తానుగా భావించేవలె. ఇంకా, పురుగు, పక్షి మొదలైన అనేకమైన ఈ వ్యవస్థలలో ప్రాణులందఱికి అన్నికాలములలో ఏకమై నది నేను ఉన్నాను అన్న ఆధ్యాత్మికం. అందువలన, అర్హతలను సాధించి, సత్-చైతన్య-ప్రకాశ- జ్ఞాన-ఆనంద లక్షణములతో పూర్ణమైనది అనంతమైనది, ఏకమైనది అయిన తన ఆత్మను భావనచేయవలె. 38

**ఆత్మన్యేవాఖిలం దృశ్యమ్, ప్రవిలాప్య ధియా సుధీః,**
**భావయేదేకమాత్మానమ్, నిర్మలాకాశవత్సదా.**

ఆత్మని - ఏవ - అఖిలమ్ - దృశ్యమ్ - ప్రవిలాప్య - ధియా - సుధీః - భావయేత్ - ఏకమ్ - ఆత్మానమ్ - (నిర్మల-ఆకాశ-వత్) - సదా.

**ఆత్మన్యేవాఖిలం దృశ్యమ్, ప్రవిలాప్య ॥ ధియా ॥ సుధీః,**
**భావయేద్ ॥ ఏకమాత్మానమ్, నిర్మలాకాశవత్ ॥ సదా. 39**

సుధీః - - ధియా - - దృశ్యమ్ - అఖిలమ్ - ఆత్మని ఏవ - సదా - ప్రవిలాప్య - - నిర్మలాకాశవత్ - - ఏకమ్ - ఆత్మానమ్ - భావయేత్.

(సుధీః) మంచిబుద్ధికలవాడు (ధియా) బుద్ధిచేత, అవగాహనచేత (దృశ్యమ్) దృశ్యం (అఖిలమ్) అంతటిని (ఆత్మని ఏవ) ఆత్మయందే (సదా) ఎల్లప్పుడు (ప్రవిలాప్య) లయంచేసి (నిర్మలాకాశవత్) నిర్మలమైన ఆకాశంవలె (ఏకమ్) ఒక టైన (ఆత్మానమ్) ఆత్మను (భావయేత్) భావించేవలె. 39

బ్రహ్మసాధన బోధింపబడుతున్నది.

క్రిందటి శ్లోకంలో విచారించుకొన్న అనేకవ్యవస్థలను సామాన్యుడు పురుగు, పక్షి, సుఖి మొదలైన విషయజీవితపరంగానే లయం చేస్తున్నాడు. వాటితో అంత మైపోతానేమోనని=మరణిస్తానేమోనని బాధపడిపోతున్నాడు. బ్రహ్మసాధకుడు ఈ దుస్థితికి దూరంగ ఉండాలి. **సుధీః** మంచిబుద్ధికలవాడు కావాలి. అంటే ఏమిటో మరల లౌకికంగా ఆలోచించేవద్దు, శాస్త్రవిధిని సప్రమాణంగా జ్ఞానవిజ్ఞానములలో గ్రహించినవాడే **సుధీః**. ప్రమాణం తెలియనందువలన నిజం తెలియక .. ఆచరించే లేకనే స్థితి విపరీతమైనది. ఇప్పుడైనా ప్రమాణమును గ్రహించి, అటు వంటి అవగాహనతో పురుగు, పక్షి, సుఖి మొదలైన దృశ్యజగత్తునంతా ఆత్మయందే లయంచేయాలి. అంటే, జగత్తంతా సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణము లనే వ్యక్తంచేస్తున్నదనీ, తాను ఆ లక్షణముల ఆధ్యాత్మికస్వరూపుడననీ శాస్త్రప్ర మాణంచేత గుర్తించాలి. అజ్ఞాని అంతట అజ్ఞానమునే గ్రహిస్తాడు. జ్ఞాని అంతట జ్ఞానమునే గ్రహిస్తాడు. సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములచే పూర్ణు డైన తాను విషయముల అధిష్ఠానంనుండి=స్వభావంనుండి వ్యక్తంచేస్తున్న ఆ ల క్షణములనే గ్రహించాలి. వ్యవస్థలను కల్పితములను గుర్తించి నిషేధించాలి.

**నిర్మలాకాశవత్. కాఞ్చనఘటీ మృత్కుమ్భయోర్వ్యామ్బరే.** సర్వవ్యాపియైన ఆకాశం బంగారుపాత్రలోని బంగారంతో సంబంధపడి గొప్పకాలేదు, కుండలోని మట్టితో సంబంధపడలేదు. అన్నిటిలో వ్యాపించినా, వాటి రూపభేదంచేత మలినంకాక, ఆకాశం నిర్మలంగా ఉన్నది, తన ఏకరూపంలో ఉన్నది.

వ్యవస్థలన్నిటిని తాను గ్రహించిన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణ ములుగా విలీనంచేసి, వాటితో సంబంధపడక నిర్మలంగా ఏకరూపంలో ఆత్మ ఉన్నది. ప్రతిప్రాణి తన గతజన్మల దేహములను వ్యవస్థలను వ్యవహారములను అన్నిటిని నేను ఉన్నాను అన్న ఉనికిరూపంలో విలీనంచేసి ఇప్పుడు ఆత్మస్వరూ పమై ఉన్నది. ఉన్నది ఉన్నట్లు గ్రహిస్తే ఉన్నట్లు ఉన్నవాడవుతాడు. ఉన్నది ఉన్నట్లు కాక లేనట్లుగానో వేఱుగానో గ్రహిస్తే అదే అవుతాడు, అవుతున్నాడు జీవుడు. గ్రహించేటలో ఇమిడియున్న భేదాన్ని శాస్త్రప్రమాణం కలిగిన సుధీః గా ఛేదించి నిర్మలమైన తన ఆత్మస్వరూపాన్ని గ్రహించాలి. 39

**రూపవర్ణాదికం సర్వమ్, విహాయ పరమార్థవిత్,**
**పరిపూర్ణ-సచ్చిదానన్ద-స్వరూపేణావతిష్ఠతే.**

(రూప-వర్ణ-ఆదికమ్) - సర్వమ్ - విహాయ - (పరమ-అర్థ-విత్) - (పరి-పూర్ణ-సత్-చిత్-ఆనన్ద-స్వరూపేణ) - అవతిష్ఠతే.

**రూపవర్ణాదికం ॥ సర్వమ్, విహాయ ॥ పరమార్థవిత్,**

**పరిపూర్ణ-సచ్చిదానన్ద-స్వరూపేణావతిష్ఠతే. 40**

పరమార్థవిత్ - - రూపవర్ణాదికమ్ - సర్వమ్ - విహాయ - - (పరిపూర్ణ-సచ్చిదానన్ద-స్వరూపేణ) - అవతిష్ఠతే.

(పరమార్థవిత్) పరమార్థమును తెలిసినవాడు (రూపవర్ణాదికమ్) రూపములు వర్ణములు మొదలైనవాటితో కూడిన (సర్వమ్) అన్నిటిని (విహాయ) విడిచి (పరిపూర్ణ-సచ్చిదానన్ద-స్వరూపేణ) పరిపూర్ణమైన సచ్చిదానంద స్వరూపంతో (అవతిష్ఠతే) స్థిరంగా ఉంటాడు. 40

బ్రహ్మసాధన బోధింపబడుతున్నది.

**అస్తి భాతి ప్రియం నామం రూపం చేత్యంశపఞ్చకమ్,**
**ఆద్యత్రయం బ్రహ్మరూపం జగద్రూపం తతోద్వయమ్.**

ప్రతి పదార్థమునకు సచ్చిదానందములు నామరూపములు అని ఐదుఅంశములు ఉంటవి. వాటిలో సచ్చిదానందములు బ్రహ్మరూపం, నామరూపములు జగద్రూపం.

**పరమార్థవిత్,** పరమార్థమును తెలిసినవాడు అంటే అర్థంచేసికొందాం. నేను చేస్తూ ఉన్నాను అన్న వ్యవస్థలో చేస్తూ అన్నది వ్యవహారార్థం, అంటే వ్యవహారం కొఱకు కోరిక కలిగినది, వ్యవహారంకొఱకు ప్రయోజనం కలిగినది. నేను ఉన్నాను అన్న ఉనికిఅంశం పరమార్థం, పరమంకొఱకు కోరికకలిగినది, పరమంకొఱకు ప్రయోజనం కలిగినది. సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు తనలో తనకు పరమార్థమునకే. జగత్తంతా..సృష్టిఅంతా ఉన్న ఈ లక్షణములు తాను తన లక్షణముల జ్ఞానదృష్టితో గ్రహించి బ్రహ్మమును సిద్ధింపచేసికొనుట అన్న పరమార్థమునకే. ఈ విధంగా, సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములను ఎఱుకలో నిలిపినవాడు పరమార్థవిత్.

పరమార్థమును ఎఱుకలో నిలిపినవాడు, వ్యవహారార్థమైన నామరూపవర్ణములు మొదలైన జగత్తు వ్యవహారప్రసిద్ధమైన ఉనికికలవే కాని వాస్తవములు కావని గుర్తిస్తూ ఆ జగత్తును అంతా కార్యకారణములతో సహా విడిచేస్తాడు.

ఇక మిగిలేది పరిపూర్ణమైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు ఆధ్యాత్మికంగా తన స్వరూపమే. అటువంటి స్వరూపంలో స్థిరంగా నిలిచిపోతాడు.

**జ్ఞాతృజ్ఞానజ్ఞేయభేదః, పరే నాత్మని విద్యతే,**
**చిదానన్దైకరూపత్వాత్, దీప్యతే స్వయమేవ తత్.**

(జ్ఞాతృ-జ్ఞాన-జ్ఞేయ-భేదః) - పరే - న - ఆత్మని - విద్యతే - (చిత్-ఆనన్ద-

ఏక-రూపత్వాత్) - దీప్యతే - స్వయమ్ - ఏవ - తత్.

**జ్ఞాతృజ్ఞానజ్ఞేయభేదః, పరే ॥ నాత్మని విద్యతే,**
**చిదానన్దైకరూపత్వాత్, దీప్యతే స్వయమేవ ॥ తత్. 41**

జ్ఞాతృజ్ఞానజ్ఞేయభేదః - పరే ఆత్మని - న విద్యతే - - చిదానన్దైకరూపత్వాత్ - తత్ - స్వయమేవ - దీప్యతే.

(జ్ఞాతృజ్ఞానజ్ఞేయభేదః) తెలియువాడు-తెలియుట-తెలియదగినది అన్న భేదం (పరే ఆత్మని) పరమమైన ఆత్మయందు (న విద్యతే) తెలియబడదు. (చిదానన్దైక -రూపత్వాత్) చిదానందలక్షణములచే ఏకరూపమగుటవలన (తత్) అది, ఆ ఆత్మ (స్వయమేవ) తనకు తానే (దీప్యతే) ప్రకాశింపబడుతున్నది. 41

విషయప్రవర్తనలో ప్రతివిషయమునుగుఱించి తెలియువాడు-తెలియుట-తెలియదగినది అన్న భేదం ఉంటున్నది. ఈ భేదం పరమమైన ఆత్మలో లేదు. అర్థంచేసికొందాం. ఆత్మ సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనందములు ఆధ్యాత్మిక లక్షణములుగా కలది. సృష్టిఅంతా ఈ లక్షణములే ఆధ్యాత్మికంగా అధిష్ఠానంగా అద్వైతంగా ఉన్నయ్. విషయలోకాన్ని నామరూపక్రియాగుణాది జగత్తును అభావంచేసి ఉన్నయ్. ఈ భ్రాంతిజగ్తతును జగద్రూపంలో తెలియాలన్నా, మిథ్యగా తెలియాలన్నా, లేనిదిగా తెలియాలన్నా జగత్తులో తెలివి=జ్ఞానం లేదు, భ్రాంతిలో తెలివి=జ్ఞానం లేదు.

ఇక మిగిలినది పరమార్థమే. పరమార్థంలో తెలివిలేని జడమునుగాని, భ్రాంతినిగాని తెలియవలసినవాడు లేడు, తెలియుట అన్నది అబద్ధం=అసత్యం, అవి తెలియదగినవి కావు. కనుక తెలియువాడు-తెలియుట-తెలియదగినది అన్న త్రిపుటిభేదం పరమార్థంలో జగత్తునుగుఱించి లేదు.

ఇక పరమమైన ఆత్మలో జగత్తు లేదు కనుక, జగత్తునుగుఱించి ఈ త్రిపుటి భేదం లేదు. ఆత్మనుగుఱించి త్రిపుటిలో ఎంచబోతే తెలియుజ్ఞాతా సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములే, తెలియుట సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనందముల లక్షణాత్మకమే, తెలియదగినది సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములే. త్రిపుటిభేదం లేక సృష్టిఅంత ఈ లక్షణములే ఏకరూపంలో ఉన్నవి.

**చిదానన్దైకరూపత్వాత్ తత్ స్వయమేవ దీప్యతే.** చిదానందలక్షణములచేత ఏకరూపమగుటవలన ఆత్మ తనకు తానే ప్రకాశింపబడుతుంది. అర్థంచేసికొందాం. చిదానందములంటే, ***చైతన్యం***= ఉనికిని తనకు తాను చైతన్యం చేసికొనుట, ***ప్రకాశం***= తన ఉనికిచైతన్యమును తనకు తాను ప్రకాశింపచేసికొనుట= తెలియజేసికొనుట, ***జ్ఞానం***= ప్రకాశింపచేసికొన్న..తెలియచేసికొన్న ఉనికిచైతన్యమును ఎఱుకలో నిలుపుకొనుట, ***ఆనందం***= చైతన్య-ప్రకాశ- జ్ఞానములచే పూర్ణత్వం. ఈ చిదానందములు ఉనికి=సత్‌లక్షణమునుగుఱించియే, అన్యము సృష్టిలో లేదు,

అన్యమునుగుఱించి ఊహ-వ్యవహారములు సృష్టిలో లేవు. అందువలన, చిదానందములు ఏకరూపమైనవి. ఇవి ఆధ్యాత్మికమగుటవలన ఆత్మరూపమైనది. ఇవి స్వయంగా ఉనికినిగుఱించియే ప్రవర్తించుటవలన స్వయంగా తమకు తామే ప్రకాశింపచేసికొనుటవలన ఆత్మ తనకు తాను ప్రకాశింపచేసికొనునదిగా శాస్త్రములన్నీ చెపుతున్నవి, జ్ఞానుల అనుభవం, సత్యం. 41

**ఏవమాత్మారణౌ ధ్యానమథనే సతతం కృతే,**
**ఉదితాఽవగతిజ్వాలా, సర్వాజ్ఞానేన్ధనం దహేత్.**

ఏవమ్ - (ఆత్మన్-అరణౌ) - (ధ్యాన-మథనే) - సతతమ్ - కృతే - ఉదితా - (అవగతి-జ్వాలా) - (సర్వ-అజ్ఞాన-ఇన్ధనమ్) - దహేత్.

**ఏవమాత్మారణౌ ॥ ధ్యానమథనే ॥ సతతం కృతే,**
**ఉదితా ॥ ఽవగతిజ్వాలా, సర్వాజ్ఞానేన్ధనం ॥ దహేత్. 42**

ఏవమ్ - ఆత్మారణౌ - సతతం కృతే - ధ్యానమథనే - - ఉదితా - అవగతి జ్వాలా - - సర్వాజ్ఞానేన్ధనమ్ - దహేత్.

(ఏవమ్) ఈ విధంగా (ఆత్మారణౌ) ఆత్మయనెడి అరణియందు (సతతం కృతే) ఎల్లప్పుడు చేయబడిన (ధ్యానమథనే) ధ్యానమనెడి మథనమునందు (ఉదితా) ఉదయించిన (అవగతిజ్వాలా) అవగాహనయొక్క జ్వాల (సర్వాజ్ఞానేన్ధనమ్) అజ్ఞానకారణంగా కలిగిన అజ్ఞానమనెడి కట్టెలన్నిటిని (దహేత్) దహింపచేయును. 42

ఇంతవఱకు విచారణచేసికొన్నవిధంగా, ఆత్మ అనెడి అరణియందు ఎల్లప్పుడు ధ్యానమథనం చేయాలి. అరణి అంటె నిప్పును త్రచ్చెడి చెక్క. విషయములను విషయములతో త్రచ్చినా, అజ్ఞానంతో=ఆత్మజ్ఞానహీనంతో త్రచ్చినా అజ్ఞానాంధకారమే ఫలిస్తుంది. జ్ఞానాగ్ని రగులదు. విషయప్రవర్తనలో విషయములను ఆత్మ లక్షణములైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనందములతో పోల్చుకొని విచారణ చేయాలి. ఈ విచారణను ధ్యానమథనం అంటున్నది శ్లోకం. ఒకసారి విచారణ చేస్తే సరిపోదు. విచారణ మథనంవలె ఉండి విషయదృష్టిని విఱిచేయవలె. ఈ ప్రయత్నం=సాధన సాధకునికి ధ్యానం కావాలి. అంటే, విషయములు, వాటిలో ప్రవర్తన అనాత్మం= ఆత్మలక్షణం లేనివి అని ఆత్మలక్షణములతో పోల్చుకొంటే, ఆత్మానాత్మవివేకంగా సాగుతుంది విచారణ. విచారణరూపం లక్షణాత్మకంగా అర్థం చేసికొందాం.

1. **సత్.** విషయం శాశ్వతఉనికి కలిగినదా లేదా?
2. **చైతన్య.** ఆత్మ చైతన్యమా విషయచపలమా? శాశ్వతఉనికిగా నిశ్చయమైతే

ఆత్మ చైతన్యం. విషయాత్మకంగా దీర్ఘకాలమున్నా దేహం అశాశ్వతమే, దైహిక చైతన్యమనబడునది చపలమే.

**3.** **ప్రకాశ.** విషయం ఆత్మ చైతన్యపరంగా పోల్చబడి అశాశ్వతమని ప్రకాశిస్తున్నదా=తెలియవస్తున్నదా, లేక విషయమే శాశ్వతం..సత్యం అని ప్రకాశిస్తున్నదా?

**4.** **జ్ఞాన.** 84లక్షల జీవరాశుల జన్మలలో నశించే దేహములలో..విషయములలో నశించేక ఇంతవఱకు నిలిచిన నేను ఉన్నాను అన్న ఆత్మఉనికిచైతన్యం ప్రకాశించి=తెలిసి ఎఱుకలో ఉన్నదా, లేక విషయంయొక్క కారణ-కార్య-ఫలములే ధ్యాసలో ప్రకాశించి=తెలిసిచిందులు త్రొక్కుతున్నవా?

**5** **ఆనన్ద.** సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన పరిపూర్ణత కలిగినదా లేక విషయంలో తాత్కాలికంగా..లౌకికంగా కలిగిన మేలుకు సంతోషం కలిగి ఉబ్బిపోతున్నావా?

సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములతో, ఈ విధంగా, పోల్చుకొంటూ ఆత్మానాత్మవివేకం అనే ధ్యానమథనం చేయాలి.

ఈ ధ్యానమథనానికి ఫలితంగా సాధకునికి ఆధ్యాత్మికజ్ఞానపరమైన అవగాహనాజ్వాలలు కలుగుతయ్. ఈ జ్వాలలు అజ్ఞానమనే కట్టెలనన్నిటిని దహింపచేస్తయ్. అంటే, ఆత్మానాత్మవివేకంగా ఆత్మతో పోల్చుకొంటూ విషయములలో ప్రవర్తించేనపుడు సాధకుని అవగాహన విషయాత్మకంనుండి ఆధ్యాత్మికమునకు ఉదయించి, ఉదయించిన సూర్యుడు నడినెత్తికి వచ్చినట్లు, ఆధ్యాత్మికం శిరోధార్యమై స్థిరమవుతుంది. ఇక విషయాత్మకమునకు మరలదు. పూర్వపు విషయాత్మక జీవితం-బుద్ధి దహింపబడినదే అవుతుంది. 42

**అరుణేనేవ బోధేన, పూర్వం సంతమసే హృతే,**
**తత ఆవిర్భవేదాత్మా, స్వయమేవాంశుమానివ.**

అరుణేన - ఏవ - బోధేన - పూర్వమ్ - సంతమసే - హృతే - తతః - ఆవిర్భవేత్ - ఆత్మా - స్వయమ్ - ఏవ - అంశుమాన్ - ఇవ.

**అరుణేనేవ ॥ బోధేన, పూర్వం ॥ సంతమసే హృతే,**
**తత । ఆవిర్భవేదాత్మా, స్వయమేవ్వాంశుమానివ. 43**

అరుణేన ఏవ - పూర్వమ్ - సంతమసే - హృతే సతి - అంశుమాన్ ఇవ - - బోధేన - తతః - స్వయమ్ ఏవ - ఆత్మా - ఆవిర్భవేత్.

(అరుణేన ఏవ) అరుణోదయంచేతనే (పూర్వమ్) పూర్వపు (సంతమసే) చీకటి (హృతే సతి) హరించేమేండగా (అంశుమాన్ ఇవ) సూర్యుడు ఎదిగి వస్తున్నట్లు (బోధేన) బోధచేత, అవగాహనచేత (తతః) వెంటనే (స్వయమ్ ఏవ) స్వయంగానే (ఆత్మా) ఆత్మ (ఆవిర్భవేత్) ఆవిర్భవిస్తుంది. 43

ప్రాతఃకాలంలో అరుణోదయంచేత అంతకు పూర్వం ఉన్న చీకటి తొలగిపోతుంది. అప్పుడు సూర్యుడు కనిపించి భూమిలో వెలుగునిస్తున్నాడు. ఇది ఉపమానం.

క్రిందటి శ్లోకంలో విచారణచేసినట్లు బుద్ధికి అవగాహన ఆధ్యాత్మికంగా అలవడితే, అటువంటి బోధచేత గత 84లక్షల జీవరాశుల జన్మలలో గడచిన అజ్ఞానపు చీకటిని నెట్టుకుంటూ ఆధ్యాత్మికానుభవం పెరుగుతుంది. ఈ అనుభవంలో ఆత్మ స్వయంగా ఆవిర్భవిస్తుంది. 43

**ఆత్మా తు సతతం ప్రాప్తోఽప్యప్రాప్తవదవిద్యయా,**
**తన్నాశే ప్రాప్తవద్భాతి స్వకణ్ఠాభరణం యథా.**

ఆత్మా - తు - సతతమ్ - ప్రాప్తః - అపి - అప్రాప్తవత్ - అవిద్యయా - తత్ - నాశే - ప్రాప్తవత్ - భాతి - (స్వ-కణ్ఠ-ఆభరణమ్) - యథా.

**ఆత్మా తు ॥ సతతం ప్రాప్తోఽపి, అప్రాప్తవద్ ॥ అవిద్యయా,**
**తన్నాశే ॥ ప్రాప్తవద్ భాతి, స్వకణ్ఠాభరణం ॥ యథా. 44**

ఆత్మా తు - సతతమ్ - ప్రాప్తః అపి - అవిద్యయా - అప్రాప్తవత్ - భాతి - - - తత్ - నాశే - - యథా - స్వకణ్ఠాభరణమ్ - - [తథా] - - ప్రాప్తవత్ - [భాతి].

(ఆత్మా తు) ఆత్మ (సతతమ్) ఎల్లప్పుడు (ప్రాప్తః అపి) పొందబడినదైనప్పటికి (అవిద్యయా) అవిద్యచేత (అప్రాప్తవత్) పొందబడనిదానివలె (భాతి) ప్రకాశిస్తున్నది=తెలుస్తున్నది. (తత్) అది, ఆ అవిద్య (నాశే) నశించేగా (యథా) ఎట్లు (స్వకణ్ఠాభరణమ్) తన కంఠంలోని ఆభరణమో [తథా=అట్లు] (ప్రాప్తవత్) పొందబడినదానివలె [భాతి=ప్రకాశిస్తున్నది=తెలుస్తున్నది]. 44

**యథా స్వకణ్ఠాభరణమ్.** ఉపమానం అర్థంచేసికొందాం. కంఠంలో ఆభరణం కంఠంలో ఉండగానే..మోస్తూండగానే, చూచుకోక, పోయిందని ఊరంతా వెదకినాడట. మెడలోనే ఉన్నది చూచుకోమని ఇతరుడు బోధచేస్తే, అప్పుడు, పోయిన ఆభరణం దొరికినట్లు సంతోషించాడట. ఆభరణం పోయిందని అనుకొనుట భ్రాంతియే, తరువాత దొరికిందని అనుకొనుట కూడా భ్రాంతియే.

సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు ఆధ్యాత్మికలక్షణములుగ సృష్టి అంతా వ్యాపించి ఉండగా, ప్రాణులన్నిటికి అధిష్ఠానఆత్మగా (జీవాత్మగా కాదు) ఆధ్యాత్మికమైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములతో ఎల్లప్పుడు ఆత్మ పొందబడియే ఉన్నది. ఆత్మఅధిష్ఠానం లేక జీవుడు..ప్రాణి.. జగత్తు..జనన మరణాదులు లేవు.

అయినా, గుర్తించేని కారణంచేత, అంటే అవిద్యచేత=తెలియకుండుటచేత

ఆత్మ పొందబడనిదిగా ప్రాణులకు భ్రాంతి కలుగుతున్నది.

**నాహం జీవః పరాత్మేతి జ్ఞాతఃచేత్.** నేను నేను నేను నేను అని నిత్యం ఆధ్యాత్మికంగా స్మరించేది జీవుడనురూపం కాదనీ, మారే జీవరూపములలో మార కుండగా, నశించే జీవరూపములలో నశించేక ఉన్నది..స్మరింపబడుతున్నది అయిన నేను జీవునికి పరమమైన నిజఆత్మరూపమేనని తెలుస్తుంది. ఇప్పుడు, క్రొత్తగా, సాధనఫలంగా ఆత్మస్వరూపం పొందబడినట్లు అనుభూతి కలుగుతుంది.

ఆత్మ ఒకప్పుడు పొందబడలేదన్నా ప్రాణుల భ్రాంతియే. తరువాత సాధనకు ఫలంగా పొందబడినదన్నా భ్రాంతియే అని ఎల్లప్పుడు ఋజువు అవుతున్నంతగా ఆత్మ నిత్యం పొందబడియే ఉండుట సత్యం. 44

**స్థాణౌ పురుషవత్ భ్రాన్త్యా, కృతా బ్రహ్మణి జీవతా,**
**జీవస్య తాత్త్వికే రూపే, తస్మిన్ దృష్టిః నివర్తతే.**

స్థాణౌ - పురుషవత్ - భ్రాన్త్యా - కృతా - బ్రహ్మణి - జీవతా - జీవస్య - తాత్త్వికే - రూపే - తస్మిన్ - దృష్టిః - నివర్తతే.

**స్థాణౌ పురుషవత్ ॥ భ్రాన్త్యా, కృతా ॥ బ్రహ్మణి జీవతా,**
**జీవస్య ॥ తాత్త్వికే రూపే, తస్మిన్ ॥ దృష్టిః నివర్తతే. 45**

స్థాణౌ - పురుషవత్ - - భ్రాన్త్యా - బ్రహ్మణి - జీవతా - కృతా - - జీవస్య - తాత్త్వికే రూపే - [దృష్టే సతి] - - తస్మిన్ - దృష్టిః - నివర్తతే.

(స్థాణౌ) స్థాణువునందు (పురుషవత్) పురుషుడనుటవలె (భ్రాన్త్యా) భ్రాంతి చేత (బ్రహ్మణి) బ్రహ్మమునందు (జీవతా) జీవత్వం (కృతా) చేయబడినది, కల్పింపబడినది. (జీవస్య) జీవునియొక్క (తాత్త్వికే రూపే) నిజరూపము [దృష్టే సతి = చూచుచుండగా, చూడగా] (తస్మిన్) జీవత్వమునందు (దృష్టిః) దృష్టి (నివర్తతే) మరలుతున్నది. 45

**స్థాణౌ పురుషవత్ భ్రాన్త్యా.** ఉపమానం అర్థంచేసికొందాం. శిలువ ఆకారంలో రెండుకఱ్ఱలు బిగించి, పైన ఒక చిన్నకుండను బోర్లించి, దానికి కన్నుముక్కులు గీచి, ఒక చొక్కా..లాగు తొడిగినట్లు వ్రేలాడదీసినది చీకటిలో చూచి, ఎవరో ఉన్నారని భయపడతాడు పిల్లవాడు. ఇది స్థాణువునందు (కదలని బొమ్మయందు) పురుషుడను భ్రాంతి. ఎవరో పురుషుడు కాదు, దొంగ కాదు, ఉన్నది బొమ్మ అని చూచినప్పుడు భ్రాంతిలో కలిగిన భయం పోతుంది.

**భ్రాన్త్యా బ్రహ్మణి జీవతా కృతా.** నేను దుఃఖినై ఉన్నాను. ఈ వ్యవస్థను అర్థంచేసికొందాం. నేను ఉన్నాను అన్నది సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్ష

ణములు ఆధ్యాత్మికంగా ఆత్మస్వరూపం, బ్రహ్మస్వరూపం కూడా. దుఃఖినై అన్నది జీవుని వ్యవస్థ. **1. సత్.** ఆధ్యాత్మికంగా..అధిష్ఠానంగా తనకు బ్రహ్మఉనికి నేను ఉన్నాను అని ఉనికిగా ఉండగా, ఉనికికి దుఃఖినై అన్న విశేషణం కల్పింపబడింది. **2. చైతన్య.** బ్రహ్మఉనికియే నేను ఉన్నాను అన్న చైతన్యంగా ఉండగా దుఃఖించేట చైతన్యంగా ఆరోపించుకోబడింది. **3. ప్రకాశ.** బ్రహ్మఉనికిచైతన్యమే నేను ఉన్నాను అని ప్రకాశిస్తుంటే=తెలుస్తుంటే దుఃఖించేటయే తెలుస్తున్నట్లు ఆరోపించుకోబడింది. **4. జ్ఞాన.** ప్రకాశించిన బ్రహ్మఉనికిచైతన్యమే నేను ఉన్నాను అని నిత్యం ఎఱుకలో=జ్ఞానంలో ఉంటే, దుఃఖించేట ఎఱుకలో=జ్ఞానంలో=తెలివిలో కల్పింపబడింది. **5. ఆనంద.** ప్రకాశించిన బ్రహ్మఉనికిచైతన్యపు ఎఱుకయే నేను ఉన్నాను అని పూర్ణంగా నిలిచిఉంటే, పూర్ణంగా దుఃఖించేటయే ఆనందమని, దుఃఖం విడువలేనిదన్నట్లు కల్పింపబడింది. ఇది భ్రాంతి. భ్రాంతిచేత తన బ్రహ్మస్వరూపమునందు జీవత్వం కల్పింపబడింది.

జీవుడు తన నిజబ్రహ్మస్వరూపమును..ఆత్మస్వరూపమును శ్రుతి-యుక్తి-అనుభవప్రమాణంగా శ్రవణంచేసి మననంచేసి నిదిధ్యాస=నిశ్చయంచేసికొని దర్శిస్తే, ఇక జీవత్వపు కల్పితప్రవృత్తినుండి దృష్టి మరలుతుంది. 45

**తత్త్వస్వరూపానుభవాత్, ఉత్పన్నం జ్ఞానమఞ్జసా,**
**అహం మమేతి చాజ్ఞానమ్, బాధతే దిగ్భ్రమాదివత్.**

(తత్త్వ-స్వరూప-అనుభవాత్) - ఉత్పన్నమ్ - జ్ఞానమ్ - అఞ్జసా - అహమ్ - మమ - ఇతి - చ - అజ్ఞానమ్ - బాధతే - (దిక్ -భ్రమ-ఆది-వత్).

**తత్త్వస్వరూపానుభవాత్, ఉత్పన్నం జ్ఞానమ్ ॥ అఞ్జసా,**
**అహం మమేతి చ్ఛాజ్ఞానమ్, బాధతే ॥ దిగ్భ్రమాదివత్. 46**

తత్త్వస్వరూపానుభవాత్ - ఉత్పన్నమ్ - జ్ఞానమ్ - - అఞ్జసా - - అహం మమేతి చ - దిగ్భ్రమాదివత్ - అజ్ఞానమ్ - బాధతే.

(తత్త్వస్వరూపానుభవాత్) తత్త్వస్వరూపానుభవంవలన (ఉత్పన్నమ్) కలిగిన (జ్ఞానమ్) జ్ఞానం (అఞ్జసా) శీఘ్రముగా (అహం మమేతి చ) నేను-నాది అన్న (దిగ్భ్రమాదివత్) దిగ్భ్రమ మొదలైనదానివలె (అజ్ఞానమ్) అజ్ఞానమును (బాధతే) బాధించేను, పోగొట్టును. 46

ఇంతవఱకు చేసినట్టి విచారణవలన తత్త్వస్వరూపానుభవం కలుగుతుంది. అర్థంచేసికొందాం. జీవుడు తన నిజఆత్మస్వరూపమును తనలో గుర్తించేలేక, ఎక్కడో దూరాన **తత్=అది** అని గుర్తించేటట్లు విసరివేసికొని దేవుడు..భగవంతుడు అందని దూరంలో ఉన్నట్లు అనుకొంటున్నాడు. ఇంకొకపక్షంలో, విషయజగత్తులో

బాధపడుతున్న త్వమ్=నీవు అన్న యుష్మద్ పదవాచ్యమైన జీవునిగా వి^రివేసి కొన్నాడు. రెండు వ్యతిరేకపదములుగా..స్థానములుగా తనను తాను దూరంచేసి కొని, భగవంతుని పొందలేక, జీవభావమును నిగ్రహించలేక, దిక్కు తెలియక భ్రాంతిలో ఉన్నాడు జీవుడు. తత్ స్వరూపబ్రహ్మము తన నిజస్వరూపమని తనయందు గుర్తిస్తే, తనను బాధించే త్వంశబ్దార్థ జీవభావంనుండి తన నిజస్వరూపమే నిగ్రహిస్తుంది. అప్పుడు, రెండువ్యతిరేకరూపములచేత బాధింపబడే జీవుడు, రెండింటిని తన లోనే పరిష్కరించుకొనే అతని స్వరూపమే తత్-త్వం = తత్త్వస్వరూపం. శాస్త్ర ప్రమాణంచేత రెండింటిని పోల్చుకొని విచారణచేసే సాధనలో రెండురూపముల నిజరూపం గుర్తించేగలుగుతాడు. నిజరూపం గుర్తించక పోల్చుకొనుట సత్యంకాదు. రెండురూపములను వాటి నిజరూపంలో అనుభవపూర్వకంగా గుర్తించి విచారణ చేసి తనలోనే పరిష్కారం చేసికొన్న అనుభవమే తత్త్వస్వరూపానుభవం. ఇటు వంటి అనుభవంవలన జీవబ్రహ్మల ఐక్యమును గుర్తించిన జ్ఞానం కలుగుతుంది.

ఈ జ్ఞానం నేను-నాది అన్న దిగ్భ్రమను కలిగించే అజ్ఞానమును బాధించి తొలగిస్తుంది. అర్థంచేసికొందాం. జీవ-బ్రహ్మైక్య జ్ఞానం కలిగేవఱకు నేను-నాది అన్న భావములకు స్థితి లభించేదు. బ్రహ్మలక్షణాత్మకమైన నిజనేనును తత్శబ్దవా చ్యంగా దూరం చేసేశాడు. 84లక్షల జీవరాశుల జన్మలలో తనుకాని జీవరూప మును నేనుగా చేసికోవాలని చేసిన దీర్ఘప్రయత్నమంతా ఎక్కడికక్కడ వృథా అవుతూ వస్తున్నది, తన ప్రయత్నం ఫలించలేదు. నేను అన్న భావానికి స్థితి=స్థిరత్వం లభించేనందువలన నాది అంటే ఏదో తెలియక, బాహ్యములన్నిటిని నాదిగా చేసి కోవాలని ఇన్ని జన్మల ప్రయత్నం వ్యర్థమై, నాది అన్న భావానికికూడా స్థితి-స్థిరత్వం లభించేలేదు. ఇది అహం-మమ అన్న దిగ్భ్రమ కారణమైన అజ్ఞానంతోసహా ఈ దిగ్భ్రమను జీవబ్రహ్మైక్యజ్ఞానం బాధించి పోగొట్టుతుంది. 46

**సమ్యగ్విజ్ఞానవాన్ యోగీ, స్వాత్మన్యేవాఖిలం స్థితమ్,**
**ఏకం చ సర్వమాత్మానమ్, ఈక్షతే జ్ఞానచక్షుషా.**

(సమ్యక్-విజ్ఞానవాన్) - యోగీ - స్వాత్మని - ఏవ - అఖిలమ్ - స్థితమ్ - ఏకమ్ - చ - సర్వమ్ - ఆత్మానమ్ - ఈక్షతే - (జ్ఞాన-చక్షుషా).

**సమ్యగ్ విజ్ఞానవాన్ ॥ యోగీ, స్వాత్మన్యేవాఖిలం స్థితమ్,**
**ఏకం చ సర్వమ్ ॥ ఆత్మానమ్, ఈక్షతే ॥ జ్ఞానచక్షుషా. 47**

సమ్యగ్ విజ్ఞానవాన్ - యోగీ - - స్వాత్మని ఏవ - అఖిలమ్ - స్థితమ్ - ఏకం చ సర్వమ్ - ఆత్మానమ్ - - జ్ఞానచక్షుషా - ఈక్షతే.

(సమ్యగ్ విజ్ఞానవాన్) అనుభవపూర్వకంగా బాగుగా తెలిసిన (యోగీ) యోగి, జ్ఞాని (స్వాత్మని ఏవ) ఆత్మయందే (అఖిలమ్) అంతయు (స్థితమ్)

నిలిచినదిగా (ఏకం చ సర్వమ్) ఏకమైనదియు సర్వమును అయిన (ఆత్మానమ్) ఆత్మను (జ్ఞానచక్షుషా) జ్ఞానదృష్టితో (ఈక్షతే) దర్శిస్తున్నాడు. 47

ఇంతవఱకు చేసిన ఆధ్యాత్మికవిచారణను అనుభవంలో తెలిసినవాడు యోగి=జ్ఞాని=విజ్ఞాని. సృష్టిలో సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములే ఆధ్యాత్మికంగా ఉన్నందువలన, ఇవే ప్రాణుల గుర్తింపుకు ఆత్మలక్షణములని జ్ఞానంకలిగిన ఈ జ్ఞాని జగత్తంతా ఆత్మయందే నిలిచిందని దర్శిస్తాడు. 84లక్షల జీవరాశుల జన్మలు గడచినా, అవి జన్మలపరంగా గడవలేదు, ఆధ్యాత్మికంగా ఆత్మపరంగానే గడచినయ్.

సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు సృష్టిఅంతా ఏకరూపంలో వ్యాపించినందువలన, ఇవే అన్నిప్రాణులకు ఆధ్యాత్మికంగా ఆత్మపరమగుటవల నను, సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములతోడి ఆత్మ లక్షణాత్మకంగా అంతట ఏకరూపమును, అన్నిప్రాణులకు అవే లక్షణాత్మకం అగుటవలన సర్వము=సర్వరూపమును అయినది.

ఆత్మజ్ఞాని ఇటువంటి జ్ఞానదృష్టితో ఆత్మను దర్శిస్తాడు. 47

**ఆత్మైవేదం జగత్సర్వమ్, ఆత్మనోఽన్యన్న కిఞ్చన,**
**మృదో యద్వత్ ఘటాదీని, స్వాత్మానం సర్వమీక్షతే.**

ఆత్మా - ఏవ - ఇదమ్ - జగత్ - సర్వమ్ - ఆత్మనః - అన్యత్ - న - కిఞ్చన - మృదః - యద్వత్ - (ఘట-ఆదీని) - (స్వ-ఆత్మానమ్) - సర్వమ్ - ఈక్షతే.

**ఆత్మైవేదం ॥ జగత్సర్వమ్, ఆత్మనోఽన్యన్ ॥ న కిఞ్చన,**
**మృదో యద్వత్ ॥ ఘటాదీని, స్వాత్మానం ॥ సర్వమీక్షతే. 48**

ఇదమ్ - జగత్ - సర్వమ్ - ఆత్మా ఏవ - - ఆత్మనః - అన్యత్ - న కిఞ్చన - - యద్వత్ - ఘటాదీని - మృదః - - [తద్వత్] - - స్వాత్మానమ్ - సర్వమ్ - ఈక్షతే.

(ఇదమ్) ఇది, ఈ (జగత్) జగత్తు (సర్వమ్) అంత (ఆత్మా ఏవ) ఆత్మయే. (ఆత్మనః) ఆత్మకంటె (అన్యత్) వేఱు (న కిఞ్చన) ఏదిలేదు. (యద్వత్) ఏవిధంగ (ఘటాదీని) కుండమొదలైనవి (మృదః) మట్టియో [తద్వత్=ఆవిధంగానే] (స్వాత్మానమ్) తన ఆత్మగ (సర్వమ్) అంతటిని (ఈక్షతే) చూస్తున్నాడు. 48

సృష్టిఅంతా సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు ఆధ్యాత్మికం అగుటవలన, సృష్టిలో గ్రహింపబడినది ఈ లక్షణములు. జ్ఞానం అజ్ఞానం భ్రాంతి అన్నవి ప్రాణియొక్క గ్రాహ్యభేదం..గ్రాహ్యదోషం. రజ్జుసర్పదృష్టాంతంలో, నిజంగా చూచినది = గ్రహించినది త్రాడును, గ్రాహ్యదోషంతో గ్రహించినది

=చూచినది పామును. దోషంగా గ్రహించినా, వాస్తవంగా గ్రహించినా. ఉన్నది ఆధ్యాత్మికలక్షణములే, గ్రహించినది ఈ లక్షణములనే. ఈ విధంగా, ఈ సృష్టియే కాదు, జగత్తంతా ఆత్మయే.

ఆత్మకంటె వేఱు లేదు. ప్రతిప్రాణియొక్క గతజీవితంలో స్వయంగా ఈ నిజం ఋజువైనది. ఎన్ని జన్మలలో ఎన్ని ప్రాణులకు ఎన్ని వ్యవస్థలు జరిగినా, ఆవ్యవస్థలు ఆత్మపరంగానే (వాస్తవానికి) జరిగినయ్, ఆత్మభావాన్నే మిగిల్చి వ్యవస్థలు అంతమైనయ్. ఈ విధంగా, ఆత్మకంటె వేఱు లేదన్నది విజ్ఞానాత్మకమైన సత్యం.

కుండ మూకుడు ప్రమిద మొదలైనవి ఎన్ని చూచినా చూచినది మట్టినే. మట్టిని చూడక కుండను చూచుట అసంభవం. కుండను తీసివేసి=చెడగొట్టి మట్టిని చూడవచ్చును. కాని, మట్టిని తీసివేసి కుండను చూడలేము.

అట్లే, సృజింపబడిన పదార్థములను, జీవుడు కల్పించిన జగత్పదార్థములను ఎన్ని చూచినా చూచినది ఆత్మనే. పదార్థములను తీసివేసి ఆత్మను దర్శించవచ్చును. కాని, ఆత్మను తీసివేసి పదార్థములను దర్శించలేము. ఇట్టిది జ్ఞాని దర్శనం. 48

**జీవన్ముక్తిస్తు తద్విద్యాత్, పూర్వోపాధిగుణాంస్త్యజేత్,**
**స సచ్చిదాదిధర్మత్వాత్, భేజే భ్రమరకీటవత్.**

(జీవన్-ముక్తిః) - తు - తత్ - విద్యాత్ - (పూర్వ-ఉపాధి-గుణాన్) - త్యజేత్ - సః - (సత్-చిత్-ఆది-ధర్మత్వాత్) - భేజే - (భ్రమర-కీట-వత్).

**జీవన్ముక్తిస్తు ॥ తద్విద్యాత్ , పూర్వోపాధిగుణాన్ ॥ త్యజేత్ ,**
**స । సచ్చిదాదిధర్మత్వాత్ , భేజే ॥ భ్రమరకీటవత్** **49**

పూర్వోపాధిగుణాన్ - త్యజేత్ - [ఇతి] - - తత్ - జీవన్ముక్తిః - విద్యాత్ - - సః - భ్రమరకీటవత్ - సచ్చిదాదిధర్మత్వాత్ - భేజే.

(పూర్వోపాధిగుణాన్) ఉపాధి=దేహం=జన్మ యొక్క పూర్వగుణములను (త్యజేత్) విడువవలెను [ఇతి=అని] (తత్) ఆ విధిని (జీవన్ముక్తిః) జీవన్ముక్తిగ (విద్యాత్) తెలియుము. (సః) జీవన్ముక్తిని (భ్రమరకీటవత్) భ్రమరమును కీటకము వలె (సచ్చిదాదిధర్మత్వాత్) సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణముల ధారణచేత (భేజే) పొందుచున్నారు. 49

జీవన్ముక్తి బోధింపబడుతున్నది.

దేహంలో జీవించిఉండగానే ముక్తినిపొందుట జీవన్ముక్తి. మరణంలో విషయములన్నిటిని విడిచి విషయవాసనలను, కారణమైన ప్రవృత్తిని తీసికొనిపోతాడు జీవుడు. ముక్తినిపొంది దేహమును విడిచినప్పుడు ప్రవృత్తి..విషయవాసనలతోసహ దేహమును విడుస్తాడు. జీవన్ముక్తిని ఆనందిస్తున్న సాధకుడు, ప్రవృత్తి..విష

యవాసనలను విడిచి, ఆ దేహజీవితంలో పూర్వం ఉన్న నామం=పేరు విడిచేస్తాడు, ఇక క్రొత్తపేరుతో పనిలేదు. విషయములతో పోల్చి పూర్వపు సుఖదుఃఖముల హోదాకు సంబంధించిన రూపములను విడిచేస్తాడు. పూర్వపు మంచిచెడు కర్మల సంబంధం కర్మఫలసంబంధం విడిచేస్తాడు. పూర్వపు గుణములను, బుద్ధులను, స్మృతులను విడిచేస్తాడు. ఇది జీవన్ముక్తికి విధి. మరి, ఏం చేస్తాడు?

**భ్రమరకీటవత్.** భ్రమరం=తుమ్మెద ఒక కీటకమును=పురుగును తెచ్చి ఒక రంధ్రంలో పెట్టి, దానిచుట్టు తిరుగుతు ఘీంకారం చేస్తుంది. ఘీంకారభయానికి పురుగు తుమ్మెదమీదనే దృష్టిపెట్టి, భయాన్ని నిగ్రహించుకొని, తుమ్మెదగా బయటికి వస్తుంది.

84లక్షల జీవరాశుల జన్మలలో జీవభావంలో భయాన్ని అనుభవించి, తప్పించుకొనే ఉపాయంలేక, భయాన్ని నిగ్రహిస్తూ, క్రమంగా తన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణముల అధిష్ఠానంలో మానవజన్మనెత్తి, విచారణ అందక సంసారంలో ఎపరీతమైన భయాన్ని..భ్రాంతిని అనుభవిస్తూ, **నిగ్రహం కంటె వేఱుఉపాయం కనపడక,** గురుసన్నిధిని చేరి, తన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణముల అధిష్ఠానమును తెలిసి, బాధఉపాయంకాక, బోధను అనుసరించి, జ్ఞానిగ తన జగత్తును నిగ్రహించి, తన స్వరూపమైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములను నిలుపుకొని జీవన్ముక్తిని పొందుతాడు. 49

**తీర్త్వా మోహార్ణవం హత్వా రాగద్వేషాది రాక్షసాన్,**
**యోగీ శాన్తిసమాయుక్తః, ఆత్మారామో విరాజతే.**

తీర్త్వా - (మోహ-అర్ణవమ్) - హత్వా - (రాగ-ద్వేషాది) - రాక్షసాన్ - యోగీ - (శాన్తి-సమ-ఆయుక్తః) - (ఆత్మా-రామః) - విరాజతే.

**తీర్త్వా॥మోహార్ణవం ॥ హత్వా॥రాగద్వేషాది రాక్షసాన్,**
**యోగీ ॥ శాన్తిసమాయుక్తః, ఆత్మారామో । విరాజతే. 50**

మోహార్ణవమ్ - తీర్త్వా - - రాగద్వేషాది - రాక్షసాన్ - హత్వా - - యోగీ - శాన్తిసమాయుక్తః - - ఆత్మారామః - విరాజతే.

(మోహార్ణవమ్) మోహమనెడి సముద్రమును (తీర్త్వా) దాటి, (రాగద్వేషాది) రాగద్వేషములు మొదలైన (రాక్షసాన్) రాక్షసులను (హత్వా) చంపి (యోగీ) యోగి (శాన్తిసమాయుక్తః) శాంతిని సమముగ కూడినవాడై (ఆత్మారామః) ఆత్మయందు రమించువాడుగ (విరాజతే) ప్రకాశిస్తున్నాడు. 50

**మోహార్ణవం తీర్త్వా. మోహనం మోహః.** ముహ-వైచిత్త్యే. విమనస్కుడౌట మోహం. తనకు మనస్సు..చిత్తం అనేవి లేకనే పశుపక్ష్యాది జన్మలు గడచినయ్.

వాటిని విషయదృష్టిలో పోగొట్టుకొని మానుషజన్మలు వృథా అయిపోతున్నవి. మోహం అంతటి మహాసముద్రం. అది ఎంతటిదైనా, స్వరూపజ్ఞానంచేత అచిరకాలంలో దాటవచ్చును.

**రాగద్వేషాది రాక్షసాన్ హత్వా.** అనాత్మం ఈ జగత్తు. అర్థంచేసికొందాం. ఏదైనా ఉన్నదనుట దానితో=విషయంతో=పదార్థంతో పోల్చి కాదు. ఉనికి ఆధ్యాత్మికం. కళ్ళు ఉన్నదందామంటే, తాను ఉన్నట్లు కళ్ళకు తెలియదు. కనుక, కళ్ళకు ఉనికి లేనిదే. కళ్ళకు ఉనికిని గుర్తించేవాడు, (ఉనికిని)తాను ఆధ్యాత్మికంగా తనగుఱించి తనలో గుర్తిస్తున్న ఉనికిలక్షణాన్ని ప్రసరింపచేసి, తనలక్షణంలో తనలో తెలిసి ఉన్నదంటున్నాడు. అంటే, గుర్తించేవానికి కళ్ళు పరపదార్థం, తన సత్-చైతన్య- ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు తనవి=తనస్వరూపం. తన లక్షణములు తనకు తనలో పూర్ణములై ఉండగా కళ్ళయొక్క నామరూపములతో తనకు పని లేదు. లేని పని కల్పించుకొంటె అక్కఱలేని రాగమో..ద్వేషమో తనలో పుట్టుకొస్తుంది. ఇప్పుడు కళ్ళను తన నిజఉనికిగా కాక తన రాగద్వేషములకు తగిన ఉనికి కలిగినట్లు చూస్తాడు. తన నిజఉనికిగా చూస్తే, కళ్ళను కాక, తనలోని తన నిజఉనికినే దర్శించినవాడవుతాడు. ఈ విధంగా, జగత్తు తనలో (దానియొక్క నామరూపక్రియాగుణములకంటెకూడా వేఱుగా) రాగద్వేషములు మొదలైన ద్వంద్వములుగా కల్పింపబడుతున్నది. తన నిజరూపాన్ని=నిజఉనికిని భంగపఱచే రాక్షసులవలె ప్రవర్తిస్తున్నయ్. ఇటువంటి ఎన్ని రాక్షసులనైనా స్వరూపజ్ఞానంచేత అచిరకాలంలో నాశంచేయవచ్చును.

**యోగీ శాన్తిసమాయుక్తః.** మోహాదులను దాటి రాగద్వేషాది ద్వంద్వములను నశింపచేసిన సాధకుడు, అటువంటి జ్ఞానంచేత ఆధ్యాత్మికమైన శాంతిని తనలో దర్శిస్తాడు, నిలుపుకొంటాడు.

**ఆత్మారామో విరాజతే.** ఆత్మయందే, ఆధ్యాత్మికమైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములందే మిక్కిలిప్రీతితో ఆనందించేవాడు ఆత్మారాముడు. ఆధ్యాత్మికశాంతిని పొందిన యోగి ఆత్మానందంతోనే ప్రకాశిస్తాడు. 50

**బాహ్యానిత్యసుఖాసక్తిమ్, హిత్వాఽఽత్మసుఖనిర్వృతః,**
**ఘటస్థదీపవచ్ఛశ్వదన్తరేవ ప్రకాశతే.**

(బాహ్య-అనిత్య-సుఖ-ఆసక్తిమ్) - హిత్వా - (ఆత్మ-సుఖ-నిర్వృతః) - (ఘట-స్థ-దీప-వత్) - శశ్వత్ - అన్తః - ఏవ - ప్రకాశతే.

**బాహ్యానిత్యసుఖాసక్తిం హిత్వా ॥ ఽఽత్మసుఖనిర్వృతః,**
**ఘటస్థదీపవత్ ॥ శశ్వత్, అన్తరేవ ॥ ప్రకాశతే.** 51

బాహ్యానిత్యసుఖాసక్తిమ్ - హిత్వా - - ఆత్మసుఖనిర్వృతః - - ఘటస్థదీపవత్ - - శశ్వత్ - అన్తః ఏవ - ప్రకాశతే.

(బాహ్యానిత్యసుఖాసక్తిమ్) బాహ్యములైన అనిత్యసుఖములందు ఆసక్తిని (హిత్వా) విడిచి, (ఆత్మసుఖనిర్వృతః) ఆత్మసుఖమందు ప్రీతిని పొందినవాడై, (ఘటస్థదీపవత్) కుండలోని దీపంవలె, (శశ్వత్) ఎల్లప్పుడును (అన్తః ఏవ) లోలోపలనే (ప్రకాశతే) ప్రకాశిస్తున్నాడు. 51

విషయలోకంలో బాహ్యంగా చేరుతున్న సుఖములన్నీ అనిత్యములు. అంతే కాదు, నిత్యమైన సుఖమును మరిపించి మోహంలో పడవేస్తయ్. కనుక, ఈ బాహ్య సుఖములందు ఆసక్తిసంకల్పమును ధ్యాసను కూడా విడువవలె. బాహ్యసుఖాసక్తిని నిజంగా స్పష్టంగా విడిచినవాడు ఆత్మసుఖమునందు ప్రీతిని రుచి చూచి, ఆస్వాదించి సొంతం చేసికొంటాడు.

**ఘటస్థదీపవత్.** కుండలోని దీపం, కుమ్మటంగా కుండలోనే ఉండి, కుండ లోపలనే ప్రకాశింపచేస్తుంది.

**శశ్వత్ అన్తరేవ ప్రకాశతే.** బాహ్యసుఖాసక్తిని విడిచినవాడు, ఆత్మసుఖమును ఆస్వాదించేవాడు ఎల్లప్పుడు తనలో తనకే తాను ప్రకాశించుకొంటూ, తనలో తననే తాను ఆనందించుకొంటూ ఆత్మస్వరూపుడై ఉంటాడు. 51

**ఉపాధిస్థోఽపి తద్ధర్మైః, అలిప్తో వ్యోమవన్మునిః,**
**సర్వవిన్మూఢవత్తిష్ఠేత్, అసక్తో వాయువచ్చరేత్.**

(ఉపాధి-స్థః) - అపి - (తత్-ధర్మైః) - అలిప్తః - వ్యోమవత్ - మునిః - (సర్వ-విత్) - మూఢవత్ - తిష్ఠేత్ - అసక్తః - వాయువత్ - చరేత్.

**ఉపాధిస్థోఽపి ॥ తద్ధర్మైః, అలిప్తో । వ్యోమవన్మునిః,**
**సర్వవిన్ ॥ మూఢవత్ తిష్ఠేత్, అసక్తో । వాయువచ్చరేత్. 52**

ఉపాధిస్థః అపి - తద్ధర్మైః - వ్యోమవత్ - మునిః - అలిప్తః - - సర్వవిత్ - మూఢవత్ - తిష్ఠేత్ - - వాయువత్ - అసక్తః - చరేత్.

(ఉపాధిస్థః అపి) దేహమునందు ఉన్నప్పటికి (తద్ధర్మైః) దాని ధర్మముల చేత (వ్యోమవత్) ఆకాశంవలె (మునిః) ముని, జీవన్ముక్తుడు (అలిప్తః) అంటనివాడు. (సర్వవిత్) సర్వవిత్ అయినవాడై (మూఢవత్) మూఢునివలె (తిష్ఠేత్) ఉండవలె. (వాయుపత్) వాయువువలె (అసక్తః) ఆసక్తిలేనివాడై (చరేత్) చరించేవలె. 52

*జీవన్ముక్తస్థితి వివరింపబడుతున్నది.*

**వ్యోమవత్.** ఆకాశం అంతట అన్ని పదార్థములను చుట్టి వ్యాపించి ఉంటుంది.

పదార్థములు చరించినా..చలించినా ఆకాశానికి ఈ గుణములు లేవు.

**ఉపాధిస్థః అపి తద్ధర్మైః వ్యోమవత్ మునిః అలిప్తః.** ముని, అంటె మననశీలిగా తపస్సుచేసి స్వరూపమును ఎఱిగినవాడు. అట్టి ముని, దేహంలో ఉన్నప్పటికి దేహధర్మములచేత అంటక ఆకాశంవలె ఉంటాడు. అర్థంచేసికొందాం. తాను ఆధ్యాత్మికంగా సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణాత్మకస్వరూపము నందు తెలివిని నిలిపినవాడు ముని. చర్మం రక్తం మాంసం మొదలైనవాటితో కూడి నది దేహం. వీటికి సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనందములు స్వతస్సిద్ధములు కావు. తన అధిష్ఠానంలో..సన్నిధిలో ఉన్నవి. దేహం భౌతికం, తాను సూక్ష్మం=అభౌతికం. దేహానికి అస్తి-జాయతే-వర్ధతే-విపరిణమతే-క్షీయతే-నశ్యతి అని ఆఱు వికారము లున్నవి. ఆత్మలక్షణములకు ఈ వికారములు లేవు. దేహం ఉపమానం, ఆత్మ ఉపమేయం. దేహమును చుట్టి అధిష్ఠానరూపంలో ఆత్మ దేహంలో సర్వవ్యాపియై ఉన్నది. దేహం చరించినా.. చలించినా ఆత్మకు ఈ గుణములు లేవు.

**సర్వవిత్ మూఢవత్ తిష్ఠేత్.** సర్వవిత్ అన్ని తెలిసినవాడు అంటే టి.వి. రిపేర్, విమాననిర్మాణం మొదలైనవి తెలిసినవాడని కాదు. సర్వము సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములే, తన (ఆత్మ) స్వరూపమే, ఈ లక్షణములకంటె వేఱైనది లేదు అని తెలిసినవాడు. మూఢుడు జడత్వంచేత ఊయివలె చైతన్యహీనుడై ఉంటాడు. ఇంకేదైనా ఉన్నదంటే దానికొఱకు చరించుటకాని చలించుటకాని కలుగుతుంది. ఏది లేదని తెలిసిన సర్వవిత్ చరించేవలసిన.. చలించేవలసిన అవసరం లేదు కనుక మూఢునివలె ఊయివలె ఉంటాడు.

**వాయువత్ అసక్తః చరేత్.** వాయువు అధికఒత్తిడినుండి అల్పఒత్తిడికి high pressure to low pressure చరిస్తుంది. వాయువు లేని చోట వాయువు లేమి స్థితి vaccum కలుగుతుంది. పైకి-క్రిందికి-ప్రక్కలకు ఒత్తిడితో వాయువు చరిస్తుంది. ముని..సర్వవిత్ అయినవాడు లౌకికమైన అధికఒత్తిడినుండి అల్పఒత్తిడికి చరిస్తాడు. ఆత్మజ్ఞానం లేనిచోట ఆత్మజ్ఞానంలేని అజ్ఞానప్రభావం vaccum ఉంటుంది. విషయములతో సంబంధపడకున్నను వాటిని పైకి..క్రిందికి..ప్రక్కలకు ఒత్తిడి రూపములుగ దర్శించగలడు. అంటే, జ్ఞానదృష్టితో చూచి ఊర్ధ్వంగా.. ఉన్నతంగా వాటిలో అధిష్ఠానమైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములను దర్శించగలడు, నిలుపుకోగలడు. లౌకికదృష్టికి సత్యమైనది అభావం=లేనిది అన్నంత అధమంగా దర్శించేగలడు..నిలుపుకోగలడు. ఏప్రాణి ఏవిషయంలో ప్రవర్తించినా ఆవిషయం ఆప్రాణికి అర్హతకు తగిన గుణపాఠం ఇస్తూ, సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములను ఆస్థాయికి తగినట్లు అభ్యాసం చేయిస్తున్నది. ఏదిశ చూచినా ఈవిధంగా ఆధ్యాత్మికమే ఉన్నది. గుర్తించేని ప్రాణిని..మనిషిని గుర్తించే వఱకు వంగదీసికొని వస్తున్నది. గుర్తించిన మనిషికి ఊర్ధ్వగతి తీసికొని పోతున్నది.

ముని..సర్వవిత్, ఈవిధంగా, విషయములను వాయుచలనంవలె దర్శిస్తాడు. 52

**ఉపాధివిలయాద్విష్ణౌ, నిర్విశేషం విశేన్మునిః,**
**జలే జలం వియద్వ్యోమ్ని, తేజస్తేజసి వా యథా.**

(ఉపాధి-విలయాత్) - విష్ణౌ - నిర్విశేషమ్ - విశేత్ - మునిః - జలే - జలమ్ - వియత్ - వ్యోమ్ని - తేజః - తేజసి - వా - యథా.

**ఉపాధివిలయాద్ ॥ విష్ణౌ, నిర్విశేషం విశేన్ ॥ మునిః,**
**జలే జలం ॥ వియద్ వ్యోమ్ని, తేజస్తేజసి వా ॥ యథా. 53**

యథా - - జలే - జలమ్ - - వ్యోమ్ని - వియత్ - - తేజసి - తేజః - - వా - - [తథా] - - మునిః - - (ఉపాధి-విలయాత్) - విష్ణౌ - నిర్విశేషమ్ - విశేత్.

(యథా) ఎట్లైతే (జలే) నీటియందు (జలమ్) నీరు (వ్యోమ్ని) ఆకాశమునందు (వియత్) ఆకాశం (తేజసి) తేజస్సునందు (తేజః) తేజస్సు (వా) ఉపమానంగా [తథా=అట్లే] (మునిః) ముని, జీవన్ముక్తుడు (ఉపాధి-విలయాత్) దేహం లయం అగుటవలన (విష్ణౌ) సర్వవ్యాపకమునందు, విశాలత్వమునందు (నిర్విశేషమ్) విశేషంలేని స్వరూపముగ (విశేత్) ప్రవేశించేవలె, ఐక్యం కావలె. 53

*శ్లోకం వివరించే ఉపమానములను అర్థంచేసికొందాం.*

**జలే జలమ్.** భూమిమీద ఎక్కడెక్కడి నీరు సూర్యరశ్మికి ఆవిరియై మేఘంగా చేరి వర్షించి, నదులనుండి సముద్రమును చేరుతున్నది. ఇంకా ఎక్కడెక్కడి నీటి నైనా అఖండమైన భూగర్భపునీరుగా భూమి పీల్చుకొంటున్నది. కుండపగిలితే కాని ఒంచితేకాని, కుండలో నీరు భూమిలో మహానీటి రూపమును పొందుతున్నది.

**వ్యోమ్ని వియత్.** కుండపగిలితే, కుండలోని ఆకాశం మహాకాశంలో చేరి పోతున్నది. **వాయౌ వాయుః.** కుండపగిలితే, కుండలోని వాయువు మహావా యువును కలిసిపోతున్నది. **తేజసి తేజస్** దీపం వెలిగిస్తే సృష్టిలోని మహా తేజస్సులో (వెలుగులో) కలిసిపోతున్నది. అగ్నిజ్వాలలో ఇంకొక చిన్నజ్వాలను చేర్చినప్పుడు, అది పెద్దజ్వాలలో కలిసిపోతున్నది. కుండపగిలిన మట్టి భూమిలో కలిసిపోతున్నది.

శవమునకు అగ్నిసంస్కారం చేసినప్పుడు, అందులోని ఆకాశం మహా ఆకాశంలోను, వాయువు మహావాయువులోను, నీరు ఆవిరిలోను, భూమి భూమిలోను చేరిపోతున్నవి.

అట్లే, జీవన్ముక్తుడు దేహమును విడిచి, దేహాదిజగత్తును గుజించి, జన్మపరంపరను గుజించి విశేషంలేని స్వరూపంలో లీనమవుతాడు. ప్రళయ

కాలంలో పంచమహాభూతములు ఏ ఆధ్యాత్మిక సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములలోకి ఉపసంహరింపబడుతవో, జీవన్ముక్తుడు దేహంవిడిచి జన్మపరంపరనుండి ఉపసంహరించుకొని విశాలమైన తన ఆ సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములలో లీనమవుతాడు.

విశాలత్వం అంటే సాధకులు లౌకికంగా ఊహించకూడదు. చెట్టు విశాలంగా ఉన్నప్పటికి, కాలాన క్షీణిస్తుంది. ఇంతకు గొప్ప విశాలమైనది విత్తనం, క్షీణించనిది. సృష్టి విశాలత్వం దానిలో ఆధ్యాత్మికలక్షణములు, భౌతికవిస్తీర్ణత కాదు, విశేషములు కాదు. అట్లే, జీవుని విశాలత్వం 84లక్షలజీవరాశుల జన్మలు కాదు, అతడు లౌకికంగా సాధించిన ఘనకార్యములు కాదు. అతని ఆధ్యాత్మికమైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు. జీవన్ముక్తుడు దేహమును విడిచి అట్టి ఆధ్యాత్మికలక్షణములలోకి ఉపసంహరింపచేసికొని ఐక్యం అవుతాడు, విశాలత్వమును పొందుతాడు. 53

**యల్లాభాన్నాపరో లాభః, యత్సుఖాన్నాపరం సుఖమ్,**
**యజ్జ్ఞానాన్నాపరం జ్ఞానమ్, తద్బ్రహ్మేత్యవధారయేత్.**

యత్ - లాభాత్ - న - అపరః - లాభః - యత్ - సుఖాత్ - న - అపరమ్ - సుఖమ్ - యత్ - జ్ఞానాత్ - న - అపరమ్ - జ్ఞానమ్ - తత్ - బ్రహ్మ - ఇతి - అవధారయేత్.

**యల్లాభాన్ ॥ నాపరో లాభః, యత్ సుఖాన్ ॥ నాపరం సుఖమ్,**
**యజ్ జ్ఞానాన్ ॥ నాపరం జ్ఞానమ్, తద్ ॥ బ్రహ్మేత్యవధారయేత్. 54**

యత్ లాభాత్ - న అపరః లాభః - - యత్ సుఖాత్ - న అపరం సుఖమ్ - - యత్ జ్ఞానాత్ - న అపరం జ్ఞానమ్ - - తత్ - బ్రహ్మ ఇతి - అవధారయేత్.

(యత్ లాభాత్) ఏది పొందుటకంటె (న అపరః లాభః) ఇంకొక లాభం లేదో, (యత్ సుఖాత్) ఏసుఖంకంటే (న అపరం సుఖమ్) ఇతరసుఖం లేదో, (యత్ జ్ఞానాత్) ఏది తెలియుటకంటె, ఏది ఎఱుకలో నిలుపుటకంటె (న అపరం జ్ఞానమ్) ఇంకొకటి తెలిసినది కాదు, ఇంకొకటి ఎఱుకకాదో (తత్) దానిని (బ్రహ్మ ఇతి) బ్రహ్మము అని (అవధారయేత్) అవధరించవలెను. 54

బ్రహ్మజ్ఞానం బోధింపబడుతున్నది.

జగత్తులో పొందిన జన్మలు గడచిపోయినవ్, దేహములు క్షీణించిపోయినవ్, విషయములు స్మృతికికూడా లేకుండగా గతంలోకి గడచిపోయినవ్. ఇవి అనాత్మములుగ పొందినవి కనుక తానుగాగాని తనవిగాగాని నిలువలేదు. ఇంతటి జగత్తులో పొందిన ఈ అన్నిటిని అన్యములుగా అనాత్మములుగా చేసి

ఆత్మస్వరూపంగా ఆధ్యాత్మికంగా సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు నిలిచినయ్. ఈ లక్షణాత్మకస్వరూపమే బ్రహ్మముగా తెలియవలె.

జగత్తులోని సుఖములన్నీ విషయాత్మకములు, అనాత్మములు, అశాశ్వతములు. వీటికి అధిష్ఠానంగా సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములచేత పూర్ణత్వపు సుఖస్థితి ఆధ్యాత్మికంగా ఆత్మపరంగా శాశ్వతమై నిర్మలమై నిలిచింది. ఈస్థితినే బ్రహ్మముగా తెలియవలె.

జగత్తులో తెలిసినవన్నీ మఱపులోకి మఱుగై ఇప్పుడు లేనివిగా అయినయ్. ఉన్నవన్నప్పుడుకూడ అనాత్మములుగా భ్రాంతిని కల్పించినయ్, అశాశ్వతములుగా ఋజువు చేసికొని పోయినయ్. జగత్తులో ఎఱుకలో నిలుపుకోదలచినవన్ని (ఎఱుక కేవలాధ్యాత్మికం) ధ్యాసను మించి ఆధ్యాత్మికమైన ఎఱుక కాలేక మానసిక ఆందోళనకు కారణమైనవి కాని అంతకు మించి సాహాయ్యం చేయలేక పోయినయ్. వీటికి అధిష్ఠానంగా సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు ఆధ్యాత్మిక తెలివిగా..ఎఱుకగా శాశ్వతమై ఉన్నది. ఈ తెలివినే.. ఎఱుకనే బ్రహ్మముగా తెలియవలె.

ఆధ్యాత్మికమైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములను బ్రహ్మస్థితిగ పొందగా ఇంకొకటి పొందనవసరం లేదు, ఇంకొకటి సుఖం కాదు, ఇంకొకటి తెలివి..ఎఱుక..జ్ఞానం కాదు.

ఇది, బ్రహ్మస్థితిని పొందిన అనుభూతిగా తెలియవలె. 54

**యద్దృష్ట్వా నాపరం దృశ్యమ్, యద్భూత్వా న పునర్భవః,**
**యజ్జ్ఞాత్వా నాపరం జ్ఞేయమ్, తద్బ్రహ్మేత్యవధారయేత్.**

యత్ - దృష్ట్వా - న - అపరమ్ - దృశ్యమ్ - యత్ - భూత్వా - న - పునః - భవః - యత్ - జ్ఞాత్వా - న - అపరమ్ - జ్ఞేయమ్ - తత్ - బ్రహ్మ - ఇతి - అవధారయేత్.

**యద్దృష్ట్వా ॥ నాపరం దృశ్యమ్, యద్భూత్వా ॥ న పునర్భవః,**
**యజ్జ్ఞాత్వా ॥ నాపరం జ్ఞేయమ్, తద్ ॥ బ్రహ్మేత్యవధారయేత్. 55**

యత్ దృష్ట్వా - న అపరం దృశ్యమ్ - - యత్ భూత్వా - న పునః భవః - - యత్ జ్ఞాత్వా - న అపరం జ్ఞేయమ్ - తత్ - బ్రహ్మ ఇతి - అవధారయేత్.

(యత్ దృష్ట్వా) దేనిని దర్శిస్తే (న అపరం దృశ్యమ్) ఇంకొక దృశ్యం ఉండదో, (యత్ భూత్వా) ఏది తానైతే (న పునః భవః) ఇంకొకటి అగుటలేదో, ఇంకొకజన్మ లేదో, (యత్ జ్ఞాత్వా) ఏది తెలిస్తే (న అపరం జ్ఞేయమ్) ఇంకొకటి తెలియవలసినది ఉండదో, (తత్) దానిని (బ్రహ్మ ఇతి) బ్రహ్మము అని (అవధారయేత్)

అవధరించేవలెను. 55

బ్రహ్మజ్ఞానం బోధింపబడుతున్నది.

తన ఆధ్యాత్మికమైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణాత్మక స్వరూపమును ఆధ్యాత్మికంగా ఆధ్యాత్మికస్థానంలో దర్శిస్తే అట్టి జ్ఞానికి ఇంకొక దృశ్యం ఉండదు. ఎందుకంటే, అన్ని దృశ్యములలో అతనికి తన లక్షణములే కనబడుతయ్, లౌకికదృశ్యం అసత్యంగా స్పష్టంగా దర్శనం అవుతుంది. సృష్టి అంతా సృజింపబడినవన్న భౌతికరూపములను కాక సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములనే వ్యక్తం చేస్తున్నది. ప్రాణులు కల్పించుకొన్న జగత్తు మనస్సు కల్పించుకొన్నట్లు వాటికి తోచినా, ఆ జగత్తుకూడా నిజానికి ప్రాణి ఆధ్యాత్మికంగా గ్రహించగలిగినట్లు సత్-చైతన్య- ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములనే వ్యక్తంచేస్తున్నది. కనుక, జ్ఞానికి ఇంకొకదృశ్యం లేదు. అతనికి దృశ్యమైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములే బ్రహ్మమని తెలియవలె.

జ్ఞాని తన ఆధ్యాత్మికమైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములతో ఐక్యమును పొందితే, అతనికి ఐక్యమగుటకు ఇంకొకటి లేదు, ఇంకొక జన్మ లేదు. ఆధ్యాత్మికలక్షణములు తానైతే అనాత్మములు తాను అవడు. అనాత్మమైన జన్మాదివ్యవస్థలు ఉండవు. అందువలన, తాను వాస్తవంలో ఆధ్యాత్మికలక్షణముల స్వరూపమై ఉన్నదే బ్రహ్మమని తెలియవలె.

తన ఆధ్యాత్మికలక్షణములైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనందములను తెలిస్తే, ఇక తెలియదగినది ఇంకొకటి ఉండదు. అన్నిటిని అనాత్మములుగ తెలిసేది ఈ లక్షణములే, ఆయా జగత్తు కాదు, ఏది కాదు. ఈలక్షణములు తెలియకుంటే అనాత్మములు అనాత్మములుగా కాక ఆత్మగా భ్రాంతి కలిగి ప్రాణి అస్తవ్యస్తం అవుతాడు. ఇన్ని 84లక్షల జీవరాశుల జన్మలలో జరిగినది ఇదే. నిజజ్ఞేయమైన ఆధ్యాత్మికలక్షణములే బ్రహ్మముగా తెలియవలె. 55

**తిర్యగూర్ధ్వమధః పూర్ణమ్, సచ్చిదానన్దమద్వయమ్,**
**అనన్తం నిత్యమేకం యత్, తద్బ్రహ్మేత్యవధారయేత్.**

తిర్యక్ - ఊర్ధ్వమ్ - అధః - పూర్ణమ్ - (సత్-చిత్-ఆనన్దమ్) - అద్వయమ్ - అనన్తమ్ - నిత్యమ్ - ఏకమ్ - యత్ - తత్ - బ్రహ్మ - ఇతి - అవధారయేత్.

**తిర్యగ్ ॥ ఊర్ధ్వమ్ ॥ అధః ॥ పూర్ణమ్, సచ్చిదానన్దమ్ ॥ అద్వయమ్, అనన్తం ॥ నిత్యమ్ ॥ ఏకం యత్, తద్ ॥ బ్రహ్మేత్యవధారయేత్.56**

యత్ -- తిర్యక్ – ఊర్ధ్వమ్ – అధః – పూర్ణమ్ – సచ్చిదానన్దమ్ – అద్వయమ్ – అనన్తమ్ – నిత్యమ్ –ఏకమ్ - - తత్ - బ్రహ్మ ఇతి - అవధారయేత్.

(యత్) ఏది (తిర్యక్) అడ్డము (ఊర్ధ్వమ్) పైన (అధః) క్రింద (పూర్ణమ్) పూర్ణము (సచ్చిదానన్దమ్) సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణాత్మకం (అద్వయమ్) ద్వైతంలేనిది (అనన్తమ్) అంతంలేనిది (నిత్యమ్) నిత్యం (ఏకమ్) ఒకటే అయినది (తత్) దానిని (బ్రహ్మ ఇతి) బ్రహ్మము అని (అవధారయేత్) అవధరింపవలె. 56

బ్రహ్మజ్ఞానం బోధచేయబడుతున్నది.

సచ్చిదానందములు, సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు అంటేను ఆత్మ, బ్రహ్మ అన్న పదములను సాధకులు వింతగా చూడకూడదు, అపరిచయ ముగా వేదాంతం సాధన చేయకూడదు. చిత్ అంటే చైతన్య-ప్రకాశ-జ్ఞానములు. సచ్చిదానందములంటే సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు. సత్ అంటే ఉనికిలక్షణం. ఇది సృష్టికి పూర్వమున్నది. ఉనికిని గ్రహించి నిలుపుకొని పూర్ణత్వమును పొందుట సృష్టి లక్ష్యము..స్వరూపము. సృష్టి అంతా దీనికి అభ్యాసము..సాధన. వేఱు లేదు. ***ధనమూలమిదం జగత్.*** కనబడుతున్న జగత్తంతా వ్యవహారమునకు జగత్, మూలం=ఆధారం=కీలకం= అధిష్ఠానం= అంతట అధిక సత్యంగా నిలుపబడినది ధనం. కోటివిద్యలు కూటికొఱకే. విద్యలు వ్యావహారిక ములు, వీటికి అధిష్ఠానం కూడు. అట్లే, సృష్టిలో భౌతికం, ప్రాణుల జగత్తు అంతా వాస్తవంలో భౌతికం కాదు జగత్తు కాదు (భౌతికం..జగత్తు అన్నవి జీవుని వ్యావ హారికం) . **1.** సత్=ఉనికి, **2.** చైతన్యం= ఉనికిని చైతన్యం చేసికొని, **3.** ప్రకాశ= ఉనికిచైతన్యమును ప్రకాశింపచేసికొని, **4.** జ్ఞానం= ప్రకాశింపచేసికొన్న ఉనికిచైత న్యమును తెలివిలో..ఎఱుకలో నిలుపుకొని. **5.** ఆనన్ద= సత్‌యొక్క చైతన్య-ప్రకాశ-జ్ఞానములచేత పూర్ణత్వం. ఈ సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములే ఆధ్యాత్మికంగా ఆత్మలక్షణములు. ఈ లక్షణములనే జీవుడు జ్ఞానియై అంతటా దర్శించగలిగినపుడు అతనికి స్వరూపమై నిలిచిన ఈ లక్షణములే బ్రహ్మము.

**తిర్యక్ .** విషయదృష్టితో విషయములలో అన్ని దిశలు చరించేవానికైనా సృష్టిలో సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణముల అభ్యాసమే, గుణపాఠం చేత వంచుకొని రావటమే.

**ఊర్ధ్వమ్.** సృష్టిని..జగత్తును జ్ఞానదృష్టితో చూస్తే సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణముల పూర్ణత్వమునకు సోపానం.

**అధః.** లౌకికదృష్టికి సత్యమనుకొన్నప్పటికి జగత్తు అసత్యం..అభావం (లేనిది) అన్నంత నీచంగా జగద్భావమును మరల్చగలిగినది సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన- ఆనంద లక్షణములు.

**పూర్ణమ్.** సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములచేతనే సృష్టి పూర్ణం, జీవుడు పూర్ణం, దైవం పూర్ణం, జ్ఞాని పూర్ణం, ముక్తి పూర్ణం, జగత్ పూర్ణం. సృష్టి

సృష్టిగా, జీవుడు జీవుడుగా, జగత్ జగత్తుగా నిత్యము వెల్తిరూపములే.

**అద్వయమ్.** సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములకు సర్వం ద్వైతములే. అన్ని ద్వైతములకు అద్వైతమైనది ఆధ్యాత్మికమైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములే.

**అనన్తమ్.** ఈ లక్షణములు అంతంలేనివి, నశించేవి కావు. సృష్టి ప్రళయమైనా నశించేవు. ఎందుకంటే, ప్రళయకాలంలో సృష్టి ఈ లక్షణములలోకే లీనమవుతుంది.

**నిత్యమ్.** సృష్టికూడా అనిత్యమే. సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములే, త్రికాలములలో, సృష్టికి పూర్వం, సృష్టికాలంలో, సృష్టికి పిమ్మట సత్యమన్నంత నిత్యమ్.

**ఏకమ్.** సాధకునికి ఎన్ని శంకలు వచ్చినా, అతడు ఎన్ని ప్రశ్నలు వేసినా అన్నిటికి చివరి సమాధానం సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములే. సిద్ధపురుషునికి మిగిలేవి, శాస్త్రం ఋజువు చేసేవి, అజ్ఞానంలోనైనా ప్రాణులు ..జడపదార్థములు అనుసరించేవి సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములే. అందుకే ఈలక్షణములు ఏకరూపములు, అన్యమును ఆశ్రయించేనివి.

ఇన్ని అంశములతో బోధించిన అంశములలో వ్యాపించిన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములను బ్రహ్మముగా తెలియవలె. 56

**అతద్వ్యావృత్తిరూపేణ, వేదాన్తైః లక్ష్యతేఽవ్యయమ్,**
**అఖణ్డానన్దమేకం యత్, తద్బ్రహ్మేత్యవధారయేత్.**

(న-తద్వ్యా-వృత్తి-రూపేణ) - వేదాన్తైః - లక్ష్యతే - అవ్యయమ్ - (అఖణ్డ-ఆనన్దమ్) - ఏకమ్ - యత్ - తత్ - బ్రహ్మ - ఇతి - అవధారయేత్.

**అతద్వ్యావృత్తిరూపేణ, వేదాన్తైః ॥ లక్ష్యతేఽవ్యయమ్,**
**అఖణ్డానన్దమేకం ॥ యత్, తద్ ॥ బ్రహ్మేత్యవధారయేత్. 57**

అఖణ్డానన్దమ్ - ఏకమ్ - అవ్యయమ్ - యత్ - వేదాన్తైః - అతద్వ్యావృత్తిరూపేణ - లక్ష్యతే - - తత్ - బ్రహ్మ ఇతి - అవధారయేత్.

(అఖణ్డానన్దమ్) తెంపులేని ఆనందం, లోటులేని పూర్ణత్వం (ఏకమ్) ఒకటే అయినది (అవ్యయమ్) శాశ్వతం అయిన (యత్) ఏది (వేదాన్తైః) ఉపనిషత్తుల చేత, వేదాంతముల చేత (అతద్వ్యావృత్తిరూపేణ) అతద్వ్యావృత్తిరూపంచేత (లక్ష్యతే) లక్ష్యం చేయబడుతున్నదో (తత్) దానిని (బ్రహ్మ ఇతి) బ్రహ్మము అని (అవధారయేత్) అవధరించేవలెను. 57

బ్రహ్మజ్ఞానం బోధచేయబడుతున్నది.

అతద్వ్యావృత్తి అన్న పదమును అర్థంచేసికొందాం. తత్ అంటే అది అని చూపుడువ్రేలుతో నిర్దేశించి చూపబడినది. అట్లా నిర్దేశించి చూపుట తద్వ్యావృత్తి. భౌతికప్రపంచంలో అన్ని తద్వ్యావృత్తిచేత చూపగలిగినవి. ఆధ్యాత్మికమైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు తద్వ్యావృత్తిచేత చూపగలిగినవి కాదు. జన్మపరంపరలో పిపీలికంనుండి మనిషిజన్మవఱకు అన్ని ప్రాణులు తద్వ్యావృత్తిచేతనే పరమార్థమును పొందాలని ప్రయత్నిస్తున్నవి. ప్రాణులు తద్వ్యావృత్తితో చూచే..చూపే వాటినన్నిటిని శాస్త్రం..వారిజీవితం **న ఇతి** ఇది కాదు **న ఇతి** ఇది కాదు అని వ్యతిరేకిస్తూ ఆధ్యాత్మికమును చూపిస్తున్నది.

**అఖణ్డానన్దమ్.** తెంపులేని ఆనందం. లోటులేని పూర్ణత్వం ఆధ్యాత్మికమైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు. జగత్తంతా అసంపూర్ణం, తాత్కాలికం.

**ఏకమ్.** ఆధ్యాత్మికదృష్టితోనైనా లౌకికదృష్టితోనైనా విచారణ చేస్తే సృష్టిలో మిగిలేది సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు. రెండవది లేనిది ద్వైతంలేనిది అన్నంత ఏకం ఈ లక్షణములు.

**అవ్యయమ్.** సృష్టిప్రళయమైనా శాశ్వతమైనది సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు. మిగిలినవన్ని ఆదిమధ్యాంతములకు గురి అయినవే.

**అఖణ్డానన్దమ్ ఏకమ్ అవ్యయమ్** ఇత్యాదిగా చెప్పబడిన ఏ ఆధ్యాత్మిక లక్షణములను ఉపనిషత్తులు అతద్వ్యావృత్తిచేత బోధిస్తున్నవో, ఆ లక్షణములను బ్రహ్మమని తెలియవలె. 57

**అఖణ్డానన్దరూపస్య, తస్యానన్దలవాశ్రితాః,**
**బ్రహ్మాద్యాస్తారతమ్యేన, భవన్త్యానన్దినో లవాః.**

(అఖణ్డ-ఆనన్ద-రూపస్య) - తస్య - (ఆనన్ద-లవ-ఆశ్రితాః) - బ్రహ్మాద్యాః - తారతమ్యేన - భవన్తి - ఆనన్దినః - లవాః.

**అఖణ్డానన్దరూపస్య, తస్యానన్దలవాశ్రితాః,**
**బ్రహ్మాద్యాః ॥ తారతమ్యేన, భవన్త్యానన్దినో లవాః.** 58

తస్య - అఖణ్డానన్దరూపస్య - ఆనన్దలవాశ్రితాః - బ్రహ్మాద్యాః - - తారతమ్యేన - ఆనన్దినః - లవాః - భవన్తి.

(తస్య) దానియొక్క, ఆ (అఖణ్డానన్దరూపస్య) అఖణ్డానందరూపముయొక్క (ఆనన్దలవాశ్రితాః) ఆనందపు లవములు=తుంపరలను ఆశ్రయించిన (బ్రహ్మాద్యాః)

బ్రహ్మాదులు (తారతమ్యేన) తారతమ్యంచేత, వారివారి స్వరూపముల భేదంచేత (ఆనన్దినః) ఆనందములు కల (లవాః) తుంపరలు, అల్పాలు (భవన్తి) అవుతున్నారు.

బ్రహ్మజ్ఞానం బోధచేయబడుతున్నది.

అఖండానందరూపంయొక్క ఆనందపు తుంపరలను ఆశ్రయించినవారు బ్రహ్మ.. విష్ణు..మహేశ్వరులు, ఇంద్రాదిదేవతలు. వారు వారివారి స్వరూపభేదములచేతను అర్హతలచేతను ఆనందం కల తుంపరలు..అల్పాలు అవుతున్నారు.

ఆధ్యాత్మికతత్త్వం అర్థంచేసికొందాం. సృష్టికి మూడుకాలములలో ఆధ్యాత్మికంగా ఉన్న సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు అఖండమైనవి అనంతమైనవి. సృష్టియొక్క కర్తరూపం బ్రహ్మ, స్థితిరూపం విష్ణు, లయరూపం శివ సృష్టికి సంబంధించినవి. సృష్టికి పూర్వపువైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములను సృష్టిలో నిలుపుటకు కర్త-స్థితి-లయరూపములు నిత్యం వాటివాటి శక్తికి తగినట్లు ఆధ్యాత్మికంగానే భౌతికప్రపంచంలోను ప్రాణులలోను కృషిచేస్తున్నవి. ఆధ్యాత్మికలక్షణముల ఆనందము=పూర్ణత్వముయొక్క తుంపరలను ఆశ్రయించి, జరుగుతున్న కృషియొక్క తారతమ్యంచేత కర్త-స్థితి-లయరూపములు ఆ పూర్ణత్వంయొక్క తుంపరలుగా=అల్పములుగా ఉన్నవి. ఇక, ఇంద్రాదిదేవతలుగా పురాణములలో చెప్పబడిన ప్రాణుల..మానవుల ఇంద్రియములు, వాటివాటి కృషియొక్క తారతమ్యంచేత పూర్ణత్వంయొక్క అల్పతుంపరలుగా ఉన్నవి. భౌతికప్రపంచంలో సూర్యుడు మొదలగు గ్రహములు, నక్షత్రములు మొదలగునవి తమ తమ జడత్వపురూపములలోనే సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములను జ్ఞానులకు వ్యక్తంచేస్తూ, తమకు తెలియక పూర్ణత్వపు తుంపరలుగా అల్పములుగా ఉన్నవి. 58

**తద్యుక్తమఖిలం వస్తు, వ్యవహారశ్చిదన్వితః,**
**తస్మాత్సర్వగతం బ్రహ్మ, క్షీరే సర్పిరివాఖిలే.**

(తత్-యుక్తమ్) - అఖిలమ్ - వస్తు - వ్యవహారః - (చిత్-అన్వితః) - తస్మాత్ - సర్వగతమ్ - బ్రహ్మ - క్షీరే - సర్పిః - ఇవ - అఖిలే.

**తద్యుక్తమ్ ॥ అఖిలం వస్తు, వ్యవహారః ॥ చిదన్వితః,**
**తస్మాత్ ॥ సర్వగతం బ్రహ్మ, క్షీరే ॥ సర్పిరివాఖిలే.** 59

అఖిలం వస్తు - తత్యుక్తమ్ - - వ్యవహారః - చిదన్వితః - - తస్మాత్ - - అఖిలే క్షీరే - సర్పిః ఇవ - - బ్రహ్మ - సర్వగతమ్.

(అఖిలం వస్తు) సృష్టిలోని వస్తుజాలమంతా (తత్యుక్తమ్) ఆ అఖండానందంతో కూడి ఉన్నది. (వ్యవహారః) సృష్టి..ప్రాణుల వ్యవహారం (చిత్-అన్వితః)

చైతన్య-ప్రకాశ-జ్ఞాన లక్షణములకు అన్వయమైనది. (తస్మాత్) అందువలన (అఖిలే క్షీరే) పాలంతట (సర్పిః ఇవ) వెన్న ఉన్నట్లు (బ్రహ్మ) బ్రహ్మ (సర్వగతమ్) సర్వవ్యాపి. 59

బ్రహ్మజ్ఞానం బోధింపబడుతున్నది.

సృష్టిలో ఉన్నదని ఆధ్యాత్మికంగాగాని, విషయాత్మకంగాగాని, జ్ఞానంచేతగాని, అజ్ఞానంచేతగాని, మోహంచేతగాని ఎట్లేని గుర్తించబడితే అది ఆధ్యాత్మికంగా అధిష్ఠానంగా తనయందున్న సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణముల గుర్తింపే, ఆ అఖండానందపు తుంపరయే. ఆహారపదార్థపు రుచి పదార్థమునకు తెలియదు. తన వివేకంతో గుర్తించి తన వివేకంలో దర్శించినదే. తన వివేకరూపమే పదార్థపు రుచి. అన్నిటిని తనలో ఇముడ్చుకొనే వివేకపు తుంపరయే పదార్థపు రుచి. ఇది ఉపమానం. అట్లే, అఖండానందపు తుంపరలే సృష్టిలోని వస్తువులన్నీ.

సృష్టిలోని వ్యవహారములన్నీ, వాటిని చేసే ప్రాణుల చిత్‌లక్షణ సమన్వయమే. తన ఆధ్యాత్మికచైతన్యంచేత చైతన్యవంతమై వ్యవహారంలో ప్రవేశించి, తన ఆధ్యాత్మికచైతన్యమును తనలో ప్రకాశింపచేసికొనవలసిన స్థానం విడిచి వ్యవహారంలో వ్యవహారరూపంగా తెలిసికొని=ప్రకాశింపచేసికొని, తనలో తన ఆధ్యాత్మికచైతన్యమును ఎఱుకగా నిలుపుకొనవలసిన స్థితిని విడిచి వ్యవహారంలో వ్యవహారరూపమును ఎఱుకలో నిలుపుకొంటు ప్రాణి వ్యవహారంలో ప్రవర్తిస్తుంది. వ్యవహారంలో చైతన్య-ప్రకాశ-జ్ఞానములు లేవు, అవి ప్రాణి తన ఆధ్యాత్మికంనుండి అరువిచ్చినవే, పరావర్తనం=reflect చేసినవే, ఈ విధంగా.

**సృష్టిఅంతా సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణముల బ్రహ్మమే.**

**అఖిలే క్షీరే సర్పిః ఇవ.** శ్లోకమిచ్చిన ఉపమానం అర్థంచేసికొందాం. పాలలో వ్రేలు పెడితే వ్రేలుకు వెన్నజిడ్డు అంటుకొంటుంది, కాని, తీయటానికి వెన్న రాదు. పాలను సంస్కరించి వెన్న తీయాలి. పాలను కాచి, తగినవేడిలో తోడు వేసి, పెరుగుగ గడ్డకట్టేవఱకు కదలించక, పెరుగును చిలికితే (కలకకూడదు) కవ్వమునకు మీట్టి వెన్న వస్తుంది. వెన్న లేక పాలుండవు.

సృష్టిలో ఆధ్యాత్మికమున్నంత అంతరంగికంగా సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములున్నాయి. లక్షణములులేక సృష్టిలేదు. పాలలో వెన్నవలె ఈ లక్షణములే పూర్ణరూపంలో భౌతికపదార్థములలోను ప్రాణుల వ్యవహారంలోను అన్వయమై ఉన్నాయి. పాలను జాగ్రత్తగా సంస్కరించి వెన్నను తీసినట్లు, ఆధ్యాత్మికలక్షణములను తన ఆధ్యాత్మికస్థానంలో మథనంచేసి ఆధ్యాత్మికజ్ఞానం అన్న సారంగా ప్రాణి గ్రహించాలి. విషయంలోను వ్యవహారంలోను కెలికితే ఆధ్యాత్మికలక్షణములు లభించవు. 59

**అనణ్వస్థూలమహ్రస్వమ్, అదీర్ఘమజమవ్యయమ్,**
**అగుణరూపవర్ణాఖ్యమ్, తద్బ్రహ్మేత్యవధారయేత్.**

అనణు - అస్థూలమ్ - అహ్రస్వమ్ - అదీర్ఘమ్ - అజమ్ - అవ్యయమ్ - (న-గుణ-రూప-వర్ణ-ఆఖ్యమ్) - తత్ - బ్రహ్మ - ఇతి - అవధారయేత్.

**అనణ్వస్థూలమ్ ॥ అహ్రస్వమ్, అదీర్ఘమ్ ॥ అజమ్ ॥ అవ్యయమ్,**
**అగుణరూపవర్ణాఖ్యమ్, తద్ ॥ బ్రహ్మేత్యవధారయేత్.** 60

అనణు - అస్థూలమ్ – అహ్రస్వమ్ – అదీర్ఘమ్ – అజమ్ – అవ్యయమ్ – అగుణరూపవర్ణాఖ్యమ్ - - తత్ - బ్రహ్మ ఇతి - అవధారయేత్.

(అనణు) అణువుకానిది, సూక్ష్మంకానిది (అస్థూలమ్) స్థూలంకానిది, భౌతికం కానిది (అహ్రస్వమ్) పొట్టిదికానిది (అదీర్ఘమ్) పొడుగుకానిది (అజమ్) పుట్టనిది (అవ్యయమ్) మార్పుచెందనిది, శాశ్వతమైనది (అగుణరూపవర్ణాఖ్యమ్) గుణం రూపం వర్ణములతో చెప్పబడనిది (తత్) దానిని (బ్రహ్మ ఇతి) బ్రహ్మము అని (అవధారయేత్) అవధరించేవలె. 60

బ్రహ్మజ్ఞానం బోధచేయబడుతున్నది.

అణువు=సూక్ష్మం, స్థూలం..భౌతికం, పొట్టి, పొడుగు, పుట్టుక, మార్పులు చెందుట, గుణం, రూపం, వర్ణం మొదలైన విశేషణములతో వివరింపబడేవి సృష్టిలోని భౌతికపదార్థములు. ఈ విశేషణములతో పరస్పరపోలికలతో అనేకంగా వివరిస్తూ, కారణ-కార్య-ఫలరూపములను కల్పించి వర్ణించి విషయములకు వ్యవహారములకు ఉనికిని సత్యత్వమును చూపినట్లు ప్రాణులచేత జగత్తు నిర్మింపబడుతున్నది. ఇదంతా సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణముల చేత అధిష్ఠానంగా యుక్తమై ఉన్నప్పటికిని, వ్యవహారమంతా చైతన్య-ప్రకాశ -జ్ఞాన లక్షణములచేతనే అన్వయమై ఉన్నప్పటికిని, ఆధ్యాత్మికంగా గుర్తింప బడుట లేదు కనుక ఈ జగత్తు బ్రహ్మస్వరూపం కాదు.

అణువుకానిది, స్థూలంకానిది, పొట్టికానిది, పొడుగుకానిది, పుట్టుకలేనిది, మార్పులు చెందనిది, గుణం-రూపం-వర్ణం మొదలైన జగత్తుచేత చెప్పబడని ఆధ్యాత్మిక సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణముల ఎఱుక బ్రహ్మమని తెలియవలె. (ఈ శ్లోకంయొక్క విపులమైన వివరణను శ్రీకృష్ణానంద మఠము ప్రచురించిన ఆత్మా-సత్ అన్న ప్రవచనగ్రంథంలో చూడండి). 60

**యద్భాసా భాస్యతేఽర్కాది, భాస్యైర్యత్తు న భాస్యతే,**
**యేన సర్వమిదం భాతి, తద్బ్రహ్మేత్యవధారయేత్.**

(యత్-భాసా) - భాస్యతే - (అర్క-ఆది) - భాస్యైః - యత్ - తు - న -

భాస్యతే - యేన - సర్వమ్ - ఇదమ్ - భాతి - తత్ - బ్రహ్మ - ఇతి - అవధారయేత్.

**యద్భాసా ॥ భాస్యతే ఽర్కాది, భాస్యైర్ యత్ తు ॥ న భాస్యతే,**
**యేన ॥ సర్వమిదం భాతి, తద్ ॥ బ్రహ్మేత్యవధారయేత్. 61**

యత్ భాసా - అర్కాది - భాస్యతే - - భాస్యైః తు - యత్ - న భాస్యతే - - యేన - ఇదమ్ - సర్వమ్ - భాతి - - తత్ - బ్రహ్మ ఇతి - అవధారయేత్.

(యత్ భాసా) దేనియొక్క ప్రకాశంచేత (అర్కాది) సూర్యుడు మొదలైనవి (భాస్యతే) ప్రకాశిస్తున్నదో, (భాస్యైః తు) ప్రకాశింపబడేవాటిచేత (యత్) ఏది (న భాస్యతే) ప్రకాశించేటలేదో (యేన) దేనిచేత (ఇదమ్) ఇది (సర్వమ్) అంత (భాతి) ప్రకాశిస్తున్నదో (తత్) దానిని (బ్రహ్మ ఇతి) బ్రహ్మమని (అవధారయేత్) అవధరించేవలె. 61

బ్రహ్మజ్ఞానం బోధింపబడుతున్నది.

**యద్భాసా భాస్యతే అర్కాది.** (24వ శ్లోకం మరల చేదవండి). అధిష్ఠానమైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములుగానే జ్ఞానులకు సూర్యుడు కనబడుతున్నాడు. సామాన్యులకు తోచే భౌతికమైన ఉష్ణపువెలుగు తమ వ్యవహారజీవితానికి కావలసినదే అయినప్పటికి పరిమితంగానే గ్రహించగలరు. సూర్యునికి భూమికి ఉన్న దూరంవలన పరిమితంగానైనా గ్రహించ గలరు. ఉత్తరాయణం వేసవికాలంలో సూర్యుడు కొద్దిగా దగ్గఱై ఉష్ణోగ్రత కొద్దిగా పెరిగితేనే సహించేలేరు. సూర్యుని సూటిగా కంటితో చూడలేరు. సృష్టి లోని భౌతికపదార్థములతో సామాన్యుల భౌతికదృష్టి ఇటువంటి పరిమితవివర ణలు ఒక్కొక్కదానికి ఒక్కొక్క ప్రత్యేకత. ఈ పరిమితవిపరీతములు అధిష్ఠానలక్ష ణములతో అధిష్ఠానలక్షణములుగా చూచినప్పుడు ఉండవు. జగత్తుయొక్క అధి ష్ఠాన నిజరూపంకాని, పరిమిత..విపరీతములైనా అధిష్ఠానజ్ఞానంతోనే తెలుస్తయ్.

**భాస్యైః యత్ న భాస్యతే.** అధిష్ఠాన ఆధ్యాత్మికలక్షణములతోనే నిజ-పరిమిత-విపరీతములన్నీ తెలుస్తున్నవి=ప్రకాశిస్తున్నవి అయినట్టి భౌతి కపదార్థములచేత ఆధ్యాత్మిక సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు ప్రకాశించేవు= తెలియబడవు. తెలియబడే దానిచేత తెలుసుకొనునది తెలియ బడదు. ప్రకాశింపబడేది తనకు ప్రకాశమైనదానిని ప్రకాశింపచేయలేదు. వెలుతురుచేత తెలియబడే పదార్థం వెలుతురును వెలిగించేలేదు.

**యేన సర్వమిదం భాతి.** సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణముల చేతనే జగత్తంతా జీవుని జ్ఞానమునకు కావలసినట్లు నిజ-పరిమిత-విపరీతములు ప్రకాశిస్తయ్ - తెలియవస్తయ్.

**తత్ బ్రహ్మేత్యవధారయేత్.** ఆ సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద

లక్షణములను తనలో ప్రకాశింపచేసి. ఎఱుకలో నిలుపుకొనుటయే బ్రహ్మమని తెలియవలె. 61

**స్వయమన్తర్బహిర్వ్యాప్య, భాసయన్నఖిలం జగత్,**
**బ్రహ్మ ప్రకాశతే వహ్నిప్రతప్తాయసపిణ్డవత్.**

స్వయమ్ - అన్తః - బహిః - వ్యాప్య - భాసయన్ - అఖిలమ్ - జగత్ - బ్రహ్మ - ప్రకాశతే - (వహ్ని-ప్రతప్త-ఆయస-పిణ్డ-వత్).

**స్వయమ్ ॥ అన్తర్ బహిర్ వ్యాప్య, భాసయన్ ॥ అఖిలం జగత్,**
**బ్రహ్మ ప్రకాశతే ॥ వహ్నిప్రతప్తాయసపిణ్డవత్. 62**

వహ్నిప్రతప్తాయసపిణ్డవత్ - - స్వయమ్ - అన్తః బహిః వ్యాప్య - అఖిలం జగత్ - భాసయన్ - - బ్రహ్మ - [స్వయమ్] - ప్రకాశతే.

(వహ్నిప్రతప్తాయసపిణ్డవత్) అగ్నిచేత కాలిన ఇనుపముద్దవలె (స్వయమ్) స్వయంగా (అన్తః బహిః వ్యాప్య) లోపల-బయట వ్యాపించి (అఖిలం జగత్) జగత్తు అంతటిని (భాసయన్) ప్రకాశింపచేస్తూ (బ్రహ్మ) బ్రహ్మము [స్వయమ్=స్వయంగా] (ప్రకాశతే) ప్రకాశిస్తున్నది. 62

*బ్రహ్మజ్ఞానం బోధచేయబడుతున్నది.*

**వహ్నిప్రతప్తాయసపిణ్డవత్.** అగ్ని ఇనుపముద్దను కాల్చినపుడు, అగ్ని ఇనుపముద్దయొక్క లోపల-బయట వ్యాపించి ఉన్నది. ఇనుమును లోపల-బయట తన అగ్నిరూపంలో ప్రకాశింపచేస్తుంది. ఇంకా, అగ్ని తాను స్వయంగా ప్రకాశిస్తూ=వెలుగుతూ ఉంటుంది. ఇది ఉపమానం.

బ్రహ్మలక్షణములైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనందములు జగత్తంతటి లోపల-బయట వ్యాపించి ఉన్నవి. అర్థంచేసికొందాం. జగత్తుకు ఆధ్యాత్మికం (లోపల), విషయాత్మకం (వ్యవహారాత్మకం) (బయట) అనునవి రెండు వ్యతిరేక పక్షములు. ఆధ్యాత్మికమునకు సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనందములు లక్షణములు. ఇవి అధిష్ఠానం, శాశ్వతం, అఖణ్డం, ఏకం, అనంతం, ఎఱుకలో నిలుపుకొన్నవి. విషయం..జగత్తుకు బాహ్యామునకు నామరూపక్రియాగుణములు మొదలైన విశేషణములతో కనిపించినప్పటికి, ఈవిశేషణములు వచ్చేవి- పోయేవి. సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనందములు అధిష్ఠానంగా ఉండగా వచ్చి-పోయేవి.

రజ్జుసర్పదృష్టాంతంలో, వాస్తవంగా చూచేది త్రాడును. ఇది ఒక పక్షం. భ్రాంతిలో భావించి చూచేది పామును. పాముయొక్క నామరూపక్రియాగుణములు మొదలైనవన్నీ వచ్చేవి-పోయేవి. త్రాడును చూచే అధిష్ఠానంపై వచ్చి-పోయేవి.

ఈ విధంగా, సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు జగత్తంతా ఆధ్యాత్మికంగా (లోపల), విషయాత్మకంగా (బయట) వ్యాపించి, లక్షణములు స్వయంగా ప్రకాశిస్తాయ్, తెలుసుకొనగలిగిన జ్ఞానికి తనలోనే తెలుస్తాయ్. ఈ లక్షణాత్మకమైన బ్రహ్మ జ్ఞానికి స్వయంగా తనలోనే తెలుస్తుంది. 62

**జగద్విలక్షణం బ్రహ్మ, బ్రహ్మణోఽన్యన్న కిఞ్చన,**
**బ్రహ్మాన్యద్భాతిచేన్మిథ్యా, యథా మరుమరీచికా.**

(జగత్-విలక్షణమ్) - బ్రహ్మ - బ్రహ్మణః - అన్యత్ - న - కిఞ్చన - (బ్రహ్మ-అన్యత్) - భాతి - చేత్ - మిథ్యా - యథా - మరుమరీచికా.

**జగద్విలక్షణం ॥ బ్రహ్మ, బ్రహ్మణోఽన్యన్ ॥ న కిఞ్చన,**
**బ్రహ్మాన్యద్ భాతిచేన్ ॥ మిథ్యా, యథా ॥ మరుమరీచికా. 63**

బ్రహ్మ - జగద్విలక్షణమ్ - - బ్రహ్మణః - అన్యత్ - న కిఞ్చన - - మరుమరీచికా - యథా - - [తథా] - బ్రహ్మాన్యత్ - భాతిచేత్ - మిథ్యా.

(బ్రహ్మ) బ్రహ్మము (జగద్విలక్షణమ్) జగత్తుకు వ్యతిరేకలక్షణం. (బ్రహ్మణః) బ్రహ్మమునకంటె (అన్యత్) వేఱైనది (న కిఞ్చన) కొంచెమైనా లేదు. (మరుమరీచికా) ఎండమావులలో తోచిన నీరు (యథా) ఎట్లో [తథా=అట్లే] (బ్రహ్మాన్యత్) బ్రహ్మముకంటె వేఱైనది (భాతిచేత్) ప్రకాశిస్తే=తెలిస్తే (మిథ్యా) మిథ్య, లేనిదే ఉన్నట్లు. 63

బ్రహ్మజ్ఞానం బోధింపబడుతున్నది.

**మరుమరీచికా.** ఉపమానం అర్థంచేసికొందాం. ఎండలో తారురోడ్డుమీద పోతుంటే, దూరంగా నీరున్నట్లు కనిపిస్తుంది. ఇది భ్రాంతియే, వాస్తవంలో అక్కడ నీరు లేదు. మరీచికలు నీటికంటె వేఱైనవి. మరీచికలకంటె వేఱైన నీరు లేదు. మరీచికలకంటె వేఱుగా నీరున్నదని అనుకొంటే అది మిథ్య, లేనిదే ఉన్నదానివలె కనిపించిన స్థితియే.

బ్రహ్మము జగత్తుకు విలక్షణమైది, వ్యతిరేకలక్షణమైనది. బ్రహ్మము నిత్యం, జగత్తు అనిత్యం. బ్రహ్మము అధిష్ఠానం, జగత్తు ఆదిమధ్యాంతములు కలిగినది. బ్రహ్మము అద్వైతం, జగత్తు ద్వైతం. ఈ విధంగా, అన్నితీరుల బ్రహ్మము జగద్విలక్షణమైనది. (మరీచికలు నీటికంటె వేఱైనవి).

సృష్టిలో ఆదిమధ్యాంతములలోను బ్రహ్మలక్షణములైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములకంటె వేఱేది లేదు. (మరీచికలకంటె వేఱైన నీరు లేదు).

సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములకంటె వేఱుగా భౌతికపదార్థం కాని, విషయంకాని, వ్యవహారంకాని, సుఖదుఃఖాది ద్వంద్వములుకాని ప్రకాశిస్తే

కనబడితే తోచితే అది మిథ్యయే, మిథ్యాస్థితియే. (మరీచికలకంటె వేఱుగా నీరు కనబడితే అది మిథ్యాస్థితియే).

ఈ శ్లోకతత్త్వం వెనుకశ్లోకములలో చాల విపులంగా విచారణచేసికొన్నాం. (1) జగద్విలక్షణం బ్రహ్మ. (2) బ్రహ్మణః అన్యత్ న కిఞ్చన, (3) బ్రహ్మాన్యత్ భాతిచేత్ మిథ్యా. ఈ శ్లోకంలోని ఈ మూడువాక్యములు సాధకుడు చాల లోతైన అనుభవంలో దర్శించేగలిగినవి. సామాన్యవాక్యములుగా నిర్లక్ష్యం చేయదగినవి కావు. 63

**దృశ్యతే శ్రూయతే యద్యత్, బ్రహ్మణోఽన్యన్న తద్భవేత్,**
**తత్త్వజ్ఞానాచ్చ తద్బ్రహ్మ, సచ్చిదానన్దమద్వయమ్.**

దృశ్యతే - శ్రూయతే - యది - యత్ - బ్రహ్మణః - అన్యత్ - న - తత్ - భవేత్ - (తత్త్వ-జ్ఞానాత్) - చ - తత్ - బ్రహ్మ - (సత్-చిత్-ఆనన్దమ్) - అద్వయమ్.

**దృశ్యతే ॥ శ్రూయతే ॥ యద్యత్, బ్రహ్మణోఽన్యన్ ॥ న తద్భవేత్,**
**తత్త్వజ్ఞానాచ్చ ॥ తద్బ్రహ్మ, సచ్చిదానన్దమ్ ॥ అద్వయమ్. 64**

యత్ - దృశ్యతే శ్రూయతే యది - - తత్ - బ్రహ్మణః - అన్యత్ - న భవేత్ - - తత్త్వజ్ఞానాత్ చ - తత్ బ్రహ్మ - సచ్చిదానన్దమ్ - అద్వయమ్.

(యత్) ఏది (దృశ్యతే శ్రూయతే యది) చూడబడినది వినబడినది అయితే (తత్) అది (బ్రహ్మణః) బ్రహ్మముకంటె (అన్యత్) వేఱైనది (న భవేత్) కాదు. (తత్త్వజ్ఞానాత్ చ) తత్త్వజ్ఞానంచేతకూడ (తత్ బ్రహ్మ) ఆ బ్రహ్మము (సచ్చిదానన్దమ్) సచ్చిదానందలక్షణాత్మకమైనది (అద్వయమ్) ద్వైతం లేనిది.64

*బ్రహ్మజ్ఞానం బోధింపబడుతున్నది.*

జగత్తులో ఏదైనా చూడబడినదన్నా వినబడినదన్నా అది బ్రహ్మముకంటె వేఱు కాదు. జగత్తుకు అధిష్ఠానం బ్రహ్మలక్షణములు కనుక, బ్రహ్మమునే దర్శిస్తున్నప్పటికి జగత్తుగ భావిస్తున్నారు (త్రాడునే చూస్తూ పాము అని అనుకొంటారు). ఇటువంటి బోధవాక్యములలో పూర్వపక్షియొక్క సంశయం ఒకటి ఉంటుంది. అదేమిటంటే, *బ్రహ్మము చూడబడునది అనుట అద్వైతమునకు భంగము కదా!* ఈ ప్రశ్నకు ఇక్కడ తావులేదు. బ్రహ్మము చూడబడు పదార్థం..విషయం వంటిది కాదన్నది పరమసత్యం. కాని, ఇక్కడ, జగత్తును చూస్తున్నానన్న భ్రాంతిపురుషునికి, చూచేది బ్రహ్మమే, జగత్తు కాదు, అని జగద్భావమును తప్పించు లక్ష్యంతో చెప్పిన వాక్యం. జగద్భావమును తొలగించి అధిష్ఠానమును గుర్తించుటకు చేసినబోధ.

దీనికి ఉత్తమంగా, సాధకుడు తత్త్వవిచారణచేసి. తత్త్వజ్ఞానమును సంపా

దించి, జ్ఞానియై బ్రహ్మమును గుర్తిస్తాడు. తనలోని సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములుగా, అద్వైతస్వరూపంగా బ్రహ్మమును గుర్తిస్తాడు. 64

**సర్వగం సచ్చిదాత్మానమ్, జ్ఞానచక్షుర్ నిరీక్షతే,**
**అజ్ఞానచక్షుర్నేక్షేత, భాస్వన్తం భానుమన్ధవత్.**

సర్వగమ్ - (సత్-చిత్-ఆత్మానమ్) - (జ్ఞాన-చక్షుః) - నిరీక్షతే - (అజ్ఞాన-చక్షుః) - న - ఈక్షేత - భాస్వన్తమ్ - భానుమ్ - అన్ధవత్.

**సర్వగం ॥ సచ్చిదాత్మానమ్, జ్ఞానచక్షుర్ ॥ నిరీక్షతే,**
**అజ్ఞానచక్షుర్ ॥ నేక్షేత, భాస్వన్తం భానుమ్ ॥ అన్ధవత్. 65**

సర్వగమ్ - సచ్చిదాత్మానమ్ - జ్ఞానచక్షుః - నిరీక్షతే - - భాస్వన్తమ్ - భానుమ్ - అన్ధవత్ - - అజ్ఞానచక్షుః - న ఈక్షేత.

(సర్వగమ్) సర్వమునందు వ్యాపించిఉన్న (సచ్చిదాత్మానమ్) సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణముల ఆత్మను (జ్ఞానచక్షుః) జ్ఞానదృష్టి కలవాడు (నిరీక్షతే) తనలో దర్శిస్తున్నాడు. (భాస్వన్తమ్) ప్రకాశిస్తున్నట్టి (భానుమ్) సూర్యుని (అన్ధవత్) గ్రుడ్డివానివలె, (అజ్ఞానచక్షుః) అజ్ఞానదృష్టి కలవాడు (న ఈక్షేత) చూడడు.

ఆత్మబోధ చేయబడుతున్నది.

**సర్వగం సచ్చిదాత్మా** అన్న పదం అర్థంచేసికొందాం.

సృష్టి అంతా సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు అధిష్ఠానంగా ఆధ్యాత్మికమై ఉన్నయ్. తన అధిష్ఠానలక్షణములను గుర్తించేక, జీవుడు 84లక్షల జీవరాశుల జన్మలను జీవిస్తాడు. ఎన్నో మానవజన్మలలో లౌకికంగా ప్రవర్తించే తన మనస్సుతోను వివేకంతోను వేగి, విసిగిపోయి, గురుసన్నిధిని చేరి జ్ఞాన సముపార్జనకు పూనుకొంటాడు. గురువు, తనకు తన నిజరూపమైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములను ఆత్మగా=నేనుగా చూపించి దర్శింపచేస్తారు. తదుపరి, తనలో దర్శించిన లక్షణములే సృష్టి అంత, జగత్తంతా, తన వ్యవహార మంతా వ్యాపించి ఉన్నవని బోధిస్తారు. తనస్వరూపమైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములతో అంతట అధిష్ఠానమై ఉన్న లక్షణములను దర్శించి, అంతట అంతకంటె అన్యం అగుపడని అభ్యాసం చేయాలి. ఇది బ్రహ్మ సాధన, ఈవిధంగా సాధించింది బ్రహ్మజ్ఞానం. ఇప్పుడు సాధకుడు దర్శించే సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు బ్రహ్మలక్షణములు. అంతట దర్శించిన ఈ సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములను = బ్రహ్మలక్షణ ములను ఇప్పుడు తనలో కేవలఆధ్యాత్మికంగా నిలబెట్టుకొన్నప్పుడు ఈ సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు సచ్చిదాత్మ = సత్-చైతన్య-

ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు పూర్ణమైన ఆత్మ.

క్లుప్తంగా, ఉనికి=సత్‌లక్షణమును గ్రహించే చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు సమన్వయమై సృష్టిలో గ్రహించేలక్షణములుగా సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు ఆధ్యాత్మికమైనవి. ఈ లక్షణములను (1) తనలో దర్శించుట ఆత్మలక్షణములు, (2) తనలో దర్శించిన లక్షణములతో అంతటఅధిష్ఠానమైన అదే లక్షణములను దర్శించి, తన ఆత్మలక్షణములను వృద్ధిచేసికొనుట చేత ఆ లక్షణములు బ్రహ్మలక్షణములు, (3) బ్రహ్మలక్షణములుగా తనలో నిలుపుకొనుట సచ్చిదాత్మ లక్షణములు, పూర్ణములైన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు. వీటిని, పూర్ణములైన లక్షణములను ఎల్లప్పుడు ఎఱుకలో నిలుపుకొన్నవాడు జ్ఞానదృష్టి కలవాడు.

జ్ఞానదృష్టి కలవాడు, అంతట సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు పూర్ణములుగా ఉన్నట్లు తనలో దర్శిస్తాడు.

ప్రకాశిస్తున్న సూర్యుని గ్రుడ్డివాడు చూడలేనట్లు జ్ఞానదృష్టిలేనివాడు, అంటే అజ్ఞానదృష్టి కలవాడు, అంతట ప్రకాశిస్తున్న సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములను దర్శించేలేడు. 65

**శ్రవణాదిభిరుద్దీప్తజ్ఞానాగ్నిపరితాపితః,**
**జీవస్సర్వమలాన్ముక్తః, స్వర్ణవద్ద్యోతతే స్వయమ్.**

శ్రవణాదిభిః - (ఉత్-దీప్త-జ్ఞాన-అగ్ని-పరి-తాపితః) - జీవః - (సర్వ-మలాత్) - ముక్తః - స్వర్ణవత్ - ద్యోతతే - స్వయమ్.

**శ్రవణాదిభిర్ ॥ ఉద్దీప్త-జ్ఞానాగ్ని-పరితాపితః,**
**జీవస్ ॥ సర్వమలాన్ముక్తః, స్వర్ణవద్ ద్యోతతే ॥ స్వయమ్. 66**

శ్రవణాదిభిః - (ఉద్దీప్త-జ్ఞానాగ్ని-పరితాపితః) - జీవః - - సర్వమలాత్ - ముక్తః - - స్వర్ణవత్ - - స్వయమ్ - ద్యోతతే.

(శ్రవణాదిభిః) శ్రవణాదులచేత (ఉద్దీప్త-జ్ఞానాగ్ని-పరితాపితః) బాగుగ ప్రకాశింపబడిన=తెలియబడిన జ్ఞానమనెడి అగ్నిచేత స్పష్టంగ దహింపబడిన (జీవః) జీవుడు (సర్వమలాత్) అన్నివిధములైన మలంవలన (ముక్తః) ముక్తుడై (స్వర్ణవత్) బంగారువలె (స్వయమ్) స్వయంగ (ద్యోతతే) ప్రకాశిస్తున్నాడు. 66

ఆత్మబోధ చేయబడుతున్నది.

మనిషి ముక్తిసాధన..తత్త్వసాధనయందు బుద్ధికలవాడుకాగా గురుసన్నిధిని శాస్త్రప్రమాణం శ్రవణంచేయాలి. శ్రవణంచేసినదానిని మననంచేస్తే మనస్సుకు.. వివేకానికి మథనం అవుతుంది. శ్రుతి..యుక్తులు శాస్త్రప్రమాణమునందు అనుభ

వమును ఇస్తయ్. క్రమంగా నిదిధ్యాసనవలన ఆధ్యాత్మికమైన నిశ్చయములతో సాధనసోపానములను నిర్మించుకొంటాడు. ఆధ్యాత్మికంగా ఈ మార్గంలో పొందిన అభ్యాస-అనుభవములు సాధకునిలో జ్ఞానాగ్నిని రగుల్చుతుంది, నిలుపుతుంది. ఇటువంటి నిజమైన సాధనలో కొన్నిజన్మలకు జీవుడు స్పష్టంగ దహింపబడుతాడు. జన్మాంతరంగ పేరుకొన్న విక్షేపావృతుల మలంనుండి విడుదల పొందుతాడు.

మలావరణను తొలగిస్తే బంగారం స్వయంగా కాంతివంతంగా ప్రకాశిస్తుంది.

విక్షేపావృతులు తొలగి, జీవభావం నాశమైన సాధకుడు పూర్ణమైన ఆధ్యాత్మిక సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములతో ఆత్మస్వరూపుడై స్వయంగా ప్రకాశిస్తాడు, తనకు తాను తెలియబడుతాడు, ఇతరులకుకూడ ఆదర్శంగ తెలియబడుతాడు. 66

**హృదాకాశోదితో హ్యాత్మా, బోధభానుస్తమోఽపహృత్,**
**సర్వవ్యాపీ సర్వధారీ, భాతి భాసయతేఽఖిలమ్.**

(హృత్-ఆకాశ-ఉదితః) - హి - ఆత్మా - (బోధ-భానుః) - (తమస్-అపహృత్) - (సర్వ-వ్యాపీ) - (సర్వ-ధారీ) - భాతి - భాసయతే - అఖిలమ్.

**హృదాకాశోదితో । హ్యాత్మా, బోధభానుస్ ॥ తమోఽపహృత్,**
**సర్వవ్యాపీ ॥ సర్వధారీ, భాతి ॥ భాసయతే ఽఖిలమ్. 67**

తమోఽపహృత్ – హృదాకాశోదితః – సర్వవ్యాపీ – సర్వధారీ – ఆత్మా - - బోధభానుః - భాతి - - అఖిలమ్ - భాసయతే హి.

(తమోఽపహృత్) తమస్సును నాశం చేయునది (హృదాకాశోదితః) హృదయమను ఆకాశమున ఉదయించినది (సర్వవ్యాపీ) సర్వం వ్యాపించి నది (సర్వధారీ) సర్వమును ధరించునది (ఆత్మా) ఆత్మ (బోధభానుః) బోధరూప సూర్యునిగ (భాతి) ప్రకాశిస్తున్నది, (అఖిలమ్) అంతటను (భాసయతే హి) ప్రకాశింపచేస్తున్నది కదా! 67

**తమోఽపహృత్.** సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములు ఆధ్యాత్మికమైన పూర్ణమైన ఆత్మ, గడచిన 84లక్షల జీవరాశుల జన్మల తమస్సును, పొంచిఉండి, జీవుని వ్యతిరేకతకు చెదరిపోక, కాలాన హరింపచేసింది. అంతటి దీర్ఘకాలం ఓర్పు వహించి, జీవుని విషయాత్మకమైన విద్యలకు వ్యతిరేకంగా ఆధ్యాత్మికనేర్పుతో తమస్సును నాశంచేసింది.

**హృదాకాశోదితః. హరతీతి హృత్.** హృఞ్-హరణే. తీసికొనిపోవునది హృదయం. **ఆ స్మృతౌ కాశతే దీప్యత సర్వమ్ అనేన ఇతి ఆకాశః.** కాశృ-దీప్తౌ, దీపీ-దీప్తౌ. స్మృతిలో వెలిగి అంతటిని ప్రకాశింపచేయునది ఆకాశము. గతమైన

విషయాది జగత్తునందు ఆధ్యాత్మికస్మృతిలో ఆధ్యాత్మికంగా వెలిగించుకొని అంతటి విషయాత్మకంగా కాక ఆధ్యాత్మికంగా ప్రకాశింపచేయుటకొఱకు విషయాది జగత్తునంతా తీసికొనిపోయినందువలన కలిగినదే ఆత్మ. అర్థంచేసికొందాం. జీవుడు సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణములను విషయాత్మకంగ ప్రయోగించి దుర్వినియోగం చేస్తున్నాడు.

అతని విషయాది జగత్తును ఆధ్యాత్మికంగా స్మృతిలో వెలిగించి, ఆధ్యాత్మికవెలుగుగా అంతటిని ప్రకాశింపచేసేది అతని ఆకాశం. ఈ ఆకాశమే అతని హృదయం. సర్వమును ఆధ్యాత్మికంగా తీసికొనిపోయేది. ఈస్థానంలో= హృదయంలో = ఆధ్యాత్మికంగా తీసికొనిపోయిన స్థానంలో ఆధ్యాత్మికంగా ఉదయించేది=వెలిగేది=తెలియునట్టేది నేను=ఆత్మ.

**సర్వవ్యాపీ.** దీపం తాను వెలుగుతు, తన వెలుతురుతో అంతట వ్యాపించి అంతటిని తనవెలుగుపరంగా, తన వెలుగులో గుర్తింపబడినట్లుగా ప్రకాశింపచేస్తుంది. ఇది ఉపమానం. సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన ఆనంద లక్షణములను హృదాకాశంలో ఉదయింపచేసిన ఆత్మ, ఆధ్యాత్మికస్థానంలో తాను వెలుగుతు, తన వెలుతురుతో విషయాది జగత్తునంతా వ్యాపించి అంతటిని తన వెలుగుపరంగా, తన వెలుగులో గుర్తింపబడినట్లుగా ప్రకాశింపచేస్తుంది.

**సర్వధారీ.** జీవుల విషయాది జగత్తునంతా తన ఆధ్యాత్మికస్థానంలో ఆధ్యాత్మికంగా ధరించేనది సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణముల స్వరూపమైన ఆత్మ.

**బోధభానుః భాతి.** ఈ ఆత్మ, తన ఈ లక్షణములతో జీవులందఱి 84లక్షల జీవరాశుల జన్మలలో, ఆయాదశలలోనివారి అనుభవపూర్వకంగా, వారు గుర్తించేకున్నా, ఆధ్యాత్మికబోధను ప్రసరింపచేస్తూ, కిరణములను ప్రసరింపచేయుట ఉపమానంగా, ఉన్నది. ఏఏదశలలో ఏఏ ప్రాణియొక్క గ్రాహ్యం ఎంతదూరంగా ఉన్నప్పటికి, అంతదూరాన అందుకోగలిగినంత అనుభవంలో ఆధ్యాత్మిక బోధను చేస్తున్నది.

**భాసయతే అఖిలమ్.** ఆత్మ బోధచేయుట తన పక్షంమాత్రమే కాదు, బోధను అందుకొని వంగివచ్చేటట్లు ప్రాణుల జగత్తుకు ఆధ్యాత్మికప్రకాశ మును ఇస్తున్నది. 67

**దిగ్దేశకాలాద్యనపేక్ష్య సర్వగం శీతాదిహృన్నిత్యసుఖం నిరఞ్జనమ్,**
**యస్స్వాత్మతీర్థం భజతే వినిష్క్రియః స సర్వవిత్సర్వగతోఽమృతో భవేత్.**

(దిక్-దేశ-కాల-ఆది) - అనపేక్ష్య - సర్వగమ్ - (శీత-ఆది-హృత్) -

- సః - సర్వవిత్ - సర్వగతః - అమృతః - భవేత్.

**దిగ్దేశకాలాద్యనపేక్ష్య॥సర్వగమ్,**
**శీతాదిహృన్ ॥ నిత్యసుఖం ॥ నిరఞ్జనమ్,**
**యస్ ॥ స్వాత్మతీర్థం భజతే ॥ వినిష్క్రియః,**
**స సర్వవిత్ ॥ సర్వగతో ఽమృతో । భవేత్. 68**

వినిష్క్రియః - యః - దిగ్దేశకాలాది - అనపేక్ష్య - - సర్వగమ్ - శీతాదిహృత్ – నిత్యసుఖమ్ – నిరఞ్జనమ్ – స్వాత్మతీర్థమ్ - భజతే - - సః - సర్వవిత్ - సర్వగతః – అమృతః - భవేత్.

(వినిష్క్రియః) అన్ని క్రియలను/కర్మలను విశిష్టంగ విడిచినవాడు (యః) ఎవడు, (దిగ్దేశకాలాది) దిక్కులు దేశములు కాలములు మొదలైనవి (అనపేక్ష్య) కోరక, (సర్వగమ్) అంతట నిండినది (శీతాదిహృత్) శీతోష్ణాది ద్వంద్వములను నాశంచేయునది (నిత్యసుఖమ్) నిత్యసుఖమైనది (నిరఞ్జనమ్) దేనితోను అంటని దిఅయిన (స్వాత్మతీర్థమ్) తన ఆత్మ అనే తీర్థమును (భజతే) సేవిస్తాడో, (సః) అతడు, ఆ (సర్వవిత్) సర్వవిత్, అన్ని తెలిసినవాడు (సర్వగతః) సర్వమును పొంది నవాడును (అమృతః) నాశంలేనివాడును (భవేత్) అగుచున్నాడు. 68

ఆత్మజ్ఞానం బోధచేయబడుతున్నది.

**వినిష్క్రియః.** ఆత్మజ్ఞానం కోరినవాడు, ఆధ్యాత్మికమును కోరి విషయాత్మకమైన చేష్టలను సంకల్పములను కర్మలను అన్నిటిని విడవాలి. అవి తన ఆధ్యాత్మికసాధనకు లౌకికంగాను ఆధ్యాత్మికంగాను అడ్డంకులు, తెలివికి తీరని కళంకములు.

**దిగ్దేశకాలాది అనపేక్ష్య.** లౌకికమైన దిక్కులు-లక్ష్యములు, దేశములు-తీర్థములు, కాలభేదములు మొదలైనవన్నిటిని కోరకూడదు. తన దృష్టికి దూరంగా ఉంచాలి.

ఇక, ఏం చేయాలంటే – ఆత్మతీర్థమును సేవించాలి.

**సర్వగమ్.** తన సత్-చైతన్య-ప్రకాశ-జ్ఞాన-ఆనంద లక్షణముల స్వరూపం అంతట నిండి ఉన్నది. అందువలన, **శీతాదిహృత్** శీతోష్ణసుఖదుఃఖములు మొదలైన ద్వంద్వరూపములు, మొదలైన జగత్తుకు ఇక తావులేదు. **నిత్యసుఖమ్.** అనిత్యమైన జగత్తుకు అసుఖమైన జీవితానికి విలక్షణంగా నిత్యమైన సుఖం నిత్యము సుఖంగా తనరూపంగా ఉండి, **నిరఞ్జనమ్** అన్యమని అన బడిన అనాత్మములు ద్వైతములైనవాటితో సంబంధపడనిది తనకు ఆత్మగా= స్వరూపంగా ఉన్నది. ఇదే తనకు నిత్యము సేవించదగిన తీర్థం, స్వాత్మతీర్థమ్.

ఈ స్వాత్మతీర్థమును సేవించినవాడు **సర్వవిత్** అన్ని తెలిసినవాడు, **సర్వగతమ్** అన్నిటిని తన ఆత్మలక్షణములుగ పొందినవాడు (జగద్రూపంగ పొందినవాడు కాదు), **అమృతః** అతడు నాశంలేనివాడు, మరణమును జయించినవాడు అవుతున్నాడు. 68

**స్వాత్మతీర్థమును సేవించుటవలన ముక్తి**
**ఇది ఆత్మబోధ**

ఓం తత్ సత్

# తత్త్వదృష్టి ముఖ్యం నాయనా!